బిహార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో

మహిళలకు 35% కోటా

యువత అభ్యున్నతి, సంక్షేమానికి ప్రత్యేక కమిషన్

ఎన్నికల ముందు నితీశ్ ప్రభుత్వం కీలక ప్రకటన

2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 9-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 101 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి:చతుర్దశి రా.1.37 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: మూల తె. 4.50 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.11.46-1.29, తె.3.07-4.50, దుర్ముహూర్తం: ఉ.11.54-12.46 వరకు, అమృతఘడియలు: రా.10.00-11.43 వరకు, రాహుకాలం:మ.12.00-1.30, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ మల్లు రవి, జితేందర్‌రెడ్డి

జహీరాబాద్ స్మార్ట్ సిటీకి

డబ్బులివ్వండి

కేంద్రం ఆమోదించిన 596 కోట్లు విడుదల చేయండి

వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక చేయూత

హైదరాబాద్-బెంగళూరు ఏరో డిఫెన్స్ కారిడార్.. తెలంగాణకు సకాలంలో యూరియా

దేశీయ ఉత్పత్తిలో రాష్ట్రం కోటా పెంచండి.. కేంద్ర మంత్రులు గోయల్, నడ్డాలకు సీఎం వినతి

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ) ఆమోదించిన రూ.596.61 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలన్నారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నామని కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందని, హైదరాబాద్ బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కోరారు.

సకాలంలో యూరియా సరఫరా చేయండి

తెలంగాణ అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువుల మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో ఆయన్ను అధికారిక నివాసంలో

మిగతా 12వ పేజీలో...

మెడికల్ కాలేజీ నుంచి లంచం

మహిళా ప్రొఫెసర్‌పై సీబీఐ కేసు

తనిఖీల్లో కాలేజీకి అనుకూలంగా నివేదిక

రూ.లక్షల్లో లంచం ముట్టినట్లు గుర్తింపు

త్వరలో విచారణ.. వైద్య శాఖలో చర్చ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ కాలేజీలో తనిఖీలకు వెళ్లి.. అనేక లోపాలున్నా.. లంచం తీసుకుని, అంతా సవ్యంగా ఉందంటూ నివేదిక ఇచ్చిన ఓ మహిళా ప్రొఫెసర్ ఇప్పుడు చిక్కుల్లో పడ్డారు. ఆమెపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేసు నమోదవ్వడంతో వైద్యశాఖలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. ఓ బోధనాస్పత్రిలో ప్రొఫెసర్‌గా ఉన్న మహిళా డాక్టర్‌కు గతంలో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) నుంచి ఫోన్ వచ్చింది. "ప్రైవేటు వైద్య కళాశాలల తనిఖీకి మీరు వెళ్తారా?" అని ఎన్ఎంసీ కోరడంతో.. ఆమె అంగీకరించారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో తనిఖీలు జరగ్గా.. ఆ బృందంలో ఆమె ఉన్నారు. ఆ కాలేజీలో అనేక లోపాలున్నా.. యాజమాన్యం తనిఖీ బృందాన్ని లంచంతో మేనేజ్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ తరహా ఉదంతాలపై గత నెల 30న సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే..! రాష్ట్రంలో దర్యాప్తులో భాగంగా మహిళా ప్రొఫెసర్ బాగోతం బయటపడింది. దీంతో.. ఆమెపై ఎఫ్ఐఆర్

మిగతా 14వ పేజీలో...

పురుషులకు దీటుగా..

నెలన్నర వ్యవధిలో ఏసీబీ వలకు చిక్కిన ఏడుగురు మహిళా అధికారులు

ఏసీబీ చరిత్రలోనే ఇది అత్యధికం!

దొరికినవారిలో ముగ్గురు జీహెచ్ఎంసీ ఉద్యోగులే.. తాజాగా డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ అధికారి అరెస్టు

14



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్ల ద్వారా నీరు విడుదల అవుతున్న దృశ్యం

బిరబిరా కృష్ణమ్మ

తెరుచుకున్న శ్రీశైలం 4గేట్లు.. సాగర్‌కు 1.72 లక్షల క్యూసెక్కుల విడుదల

జూరాలకు 1.25 లక్షలు, సుంకేసులకు 61 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో.. అంతేస్థాయిలో దిగువకు..

సాగర్, పులిచింతల తప్ప కృష్ణా ప్రాజెక్టులు ఫుల్

531.70 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

గోదావరితో ఉభయ రాష్ట్రాలు సుభిక్షం

ఏటా 2వేల టీఎంసీలు సాగరం పాలు.. చెరో 200టీఎంసీలు వాడుకున్నా చాలు: చంద్రబాబు

కృష్ణాకు జలహారతి..గంగమ్మ తల్లికి సారె

సాగర్‌కు పొంచి ఉన్న ముప్పు!

ఎస్ఎల్‌బీసీ మోహరింపునకు అనుమతినివ్వండి

కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం లేఖ

3

మహబూబ్‌నగర్/హైదరాబాద్/నాగార్జునసాగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ పరవళ్లతో నాగార్జునసాగర్, పులిచింతల మినహా ఆలమట్టి నుంచి శ్రీశైలం దాకా ప్రాజెక్టులన్నీ నిండాయి. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో బేసిన్‌లోని ప్రాజెక్టులకు ఈ ఏడాది ముందుగా వరద పోటెత్తటంతో మంగళవారం శ్రీశైలం డ్యామ్ గేట్లు కూడా తెరుచుకున్నాయి. బిరబిరా కృష్ణమ్మ శ్రీశైలం ప్రాజెక్టు

మిగతా 3వ పేజీలో...

భద్రాద్రి ఆలయ ఈవోపై భూ ఆక్రమణదారుల దాడి

స్పృహ కోల్పోయిన ఈవో, మరో ఉద్యోగి

ఏపీలోని పురుషోత్తపట్నంలో ఘటన

ఆలయ భూముల్లి కబ్జా చేస్తే పీడీ యాక్టు

మంత్రి కొండా సురేఖ హెచ్చరిక

14

కేటీఆర్.. దమ్ముంటే రాధాకృష్ణను టచ్ చెయ్!



దాడులు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయ్

'ఆంధ్రజ్యోతి'కి కాంగ్రెస్ అండగా ఉంటుంది.. ఆ పార్టీ నేతల స్పష్టీకరణ

దాడికి రెచ్చగొడుతోంది కేటీఆరే: సీతక్క

ఆంధ్రజ్యోతిపై దాడి చేస్తే.. టీ న్యూస్‌పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేస్తాయ్: రమేశ్‌రెడ్డి

రాధాకృష్ణ తెలంగాణ బిడ్డ: మైనంపల్లి

13

భారత్‌లో మీడియాపై సెన్సార్‌షిప్!

ప్రభుత్వం చెప్పడంతో రాయిటర్స్ హ్యాండిల్ ఆపేశాం

గంటలో 2,355 ఖాతాల్ని ఆపమన్నారు

'ఎక్స్ ఇండియా' సంచలన ఆరోపణ

ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగింది.. ఇప్పుడు కాదు: కేంద్ర ఐటీ శాఖ

2

స్కూలు బస్సును ఢీకొన్న రైలు

తమిళనాడులోని కడలూరు జిల్లాలో పట్టాలు దాటుతుండగా ఘటన

ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు

గేట్‌మ్యాన్ తమిళం రాకపోవడం వల్లే అక్కడ వరుస ప్రమాదాలు

డీఎంకే ఆరోపణలు.. రాజకీయ దుమారం

2

అన్ని భాషలూ జాతీయ భాషలే

ఒకే భాషను బలవంతంగా రుద్దటాన్ని మేం సమర్థించం: ఆర్ఎస్ఎస్

హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్. పక్కన సీఎం కోసం వేసిన కుర్చీ



చర్చకు రమ్మని..

ఢిల్లీకి పారిపోయావేం?

పారిపోవడం రేవంత్‌కు అలవాటే.. రచ్చ తప్ప చర్చ చేయడం రాదు

నువ్వు రాకపోతే.. డిప్యూటీ సీఎంను లేదా వ్యవసాయ మంత్రిని పంపు

సమయం, స్థలం చెప్పు.. ఈసారి రాకుంటే కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి

కేటీఆర్ ధ్వజం.. పార్టీ నేతలతో ప్రెస్‌క్లబ్ వద్దకు.. సీఎం కోసం కుర్చీ!

సభలో చర్చిద్దామంటే ప్రెస్‌క్లబ్‌లో రాద్ధాంతం

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు గల్లంతే: భట్టి

నేను స్పందించేంత స్థాయి కేటీఆర్‌ది కాదు: మహేశ్

కేటీఆర్ పిచ్చికుక్కలా ఒర్లుతున్నడు: రామ్మోహన్‌రెడ్డి

చెల్లెలి ఫోన్ ట్యాప్ చేసిన నీచ చరిత్ర: అద్దంకి



13



ఉప్పల్ స్టేడియం గేటును మూసివేస్తూ గోడ నిర్మాణం కోసం వేసిన స్తంభాలు

ఉప్పల్ స్టేడియానికి దారేదీ?

స్టేడియం పక్కనున్న స్థలం కార్పొరేట్ సంస్థ చేతికి

స్టేడియంలో ఐదు గేట్లు మూస్తూ గోడ నిర్మాణం

పార్కింగ్ స్థలం గల్లంతు

ఉప్పల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ఉప్పల్ క్రికెట్ స్టేడియానికి పెద్ద కష్టం వచ్చిపడింది. భవిష్యత్తులో ఇక్కడ మ్యాచ్‌లు జరపడం కుదురుతుందా? అనే పరిస్థితి తలెత్తుతోంది. స్టేడియం చుట్టూ ఖాళీగా ఉన్న స్థలం ఓ కార్పొరేట్ సంస్థ చేతికి

మిగతా 14వ పేజీలో...

ఏడాదిలోనే రైతులకు 70 వేల కోట్లు

అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ బురదజల్లే ప్రయత్నం: భట్టి

మంచి కార్యక్రమాలు చేస్తుంటే కడుపు మంటా?: పొంగులేటి

కాంగ్రెస్ ప్రభుత్వం 15 ఏళ్లుంటే రాష్ట్రం సుభిక్షం: కోమటిరెడ్డి

తెలంగాణలా కావాలంటున్న ఇతర రాష్ట్రాల ప్రజలు: తుమ్మల

మహబూబాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

12

కీరవాణి తండ్రి శివశక్తి దత్తా కన్నుమూత

10


ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35% కోటా

బిహార్‌లో ఎన్నికలకు ముందు నితీశ్ ప్రభుత్వం కీలక ప్రకటన

పట్నా, జూలై 8: ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువత కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను నితీశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అన్ని విభాగాలు, స్థాయుల్లోని ఉద్యోగాల్లో బిహార్ శాశ్వత నివాసితులైన మహిళా అభ్యర్థులకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళా శక్తిని పెంచడం, రాష్ట్ర పరిపాలనలో వారు చురుకైన పాత్ర పోషించేలా చేయాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 'బిహార్ యూత్ కమిషన్‌'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఛైర్‌పర్సన్, ఇద్దరు వైస్ ఛైర్‌పర్సన్లు, ఏడుగురు సభ్యులతో ఏర్పాటయ్యే ఈ కమిషన్.. రాష్ట్రంలో యువత అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వానికి సలహాలు ఇస్తుందని తెలిపారు. యువతకు మెరుగైన విద్య, ఉద్యోగావకాశాలు కల్పించడానికి, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం దక్కేలా ఈ కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు.


రాముడు నేపాల్‌లోనే పుట్టాడు!

- శివుడు, విశ్వామిత్రుడు కూడా ఇక్కడే జన్మించారు
- నేపాల్ ప్రధాని ఓలి వివాదాస్పద వ్యాఖ్యలు



కాఠ్‌మాండూ, జూలై 8: శ్రీరాముడి జన్మస్థలంపై నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రామ భగవానుడు నేపాల్‌లోనే జన్మించాడని పునరుద్ఘాటించారు. రాముడితోపాటు శివుడు, విశ్వామిత్రుడు కూడా నేపాల్‌లోనే పుట్టారని చెప్పారు. కాఠ్‌మాండూలో అధికార సీపీఎన్-యూఎంఎల్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఓలి ఈ వ్యాఖ్యలు చేశారు. రాముడు నేపాల్‌లోనే జన్మించాడని.. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని ఓలి అన్నారు. "రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉంది. దీన్ని మనం అంతగా జనంలోకి తీసుకెళ్లలేకపోతున్నాం" అని చెప్పారు. రాముడు పుట్టింది నేపాల్‌లో అయితే.. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరు? అని ఓలి ప్రశ్నించారు. ఓలి గతంలోనూ ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. అయోధ్య నేపాల్‌లోని చిత్వాన్ జిల్లా థోరిలో ఉందని 2020 జూలైలో చెప్పారు. ఇక్కడే రాముడు పుట్టాడనీ అన్నారు. అక్కడ రామ మందిరం నిర్మించాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే దశరథుడు పుత్రకామేష్టి యాగం చేసిన ప్రాంతం కూడా నేపాల్‌లోనే ఉందన్నారు.

లోకం తీరు





ప్రతిపక్షం నిరసన ర్యాలీలో మంత్రి

ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరాఠా అస్తిత్వ ర్యాలీలో ప్రతాప్ బాబూరావు..అరెస్టు చేయాలని సవాలు

న్యూఢిల్లీ, జూలై 8: 'మరాఠా అస్తిత్వం' కోసమంటూ మహారాష్ట్రలో ప్రతిపక్ష ఎంఎన్ఎస్ పార్టీ మంగళవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో ఏకంగా ఆ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఏక్‌నాథ్ శిందే శివసేన వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ప్రతాప్ బాబూరావు సర్‌నాయక్ పాల్గొనడం సంచలనమైంది. ఆందోళనల్లో పాల్గొనడమే కాకుండా ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఎంఎన్ఎస్ ర్యాలీకి ప్రభుత్వం అనుమతినీయకపోడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "నేను ర్యాలీలో పాల్గొంటున్నాను. పోలీసులకు అంత ధైర్యం ఉంటే, అరెస్టు చేస్తే చేసుకోనీయండి. నాది అన్ని వేళలా మరాఠా అస్తిత్వం కోసం పోరాడే వాళ్ల పక్షమే" అని తేల్చి చెప్పారు. వేరే రాష్ట్రాల నుంచి మహారాష్ట్రకు వచ్చిన వ్యాపారులు కూడా స్థానికంగా మరాఠీలోనే మాట్లాడాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. జూలై 1న భయందేర్ ప్రాంతంలో ఓ ఫుడ్ స్టాల్ యజమాని మరాఠీలో మాట్లాడనందుకు ఎంఎన్ఎస్ కార్యకర్త కొట్టారు. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా ఎంఎన్ఎస్ కార్యకర్త చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో మంగళవారం థానేలోని మీరా రోడ్డులో మరాఠా అస్తిత్వ ర్యాలీని నిర్వహించేందుకు మరాఠీ ఏకీకరణ్ సమితి, ఇంకా చాలా సంస్థలు అనుమతి కోరాయి. అయితే ప్రభుత్వం అందుకు నిరాకరించింది. అయినా, ఎంఎన్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఒకే భాషను బలవంతంగా అమలు చేయొద్దు: ఆరెస్సెస్

న్యూఢిల్లీ, జూలై 8: మహారాష్ట్రలో భాషలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో దేశంలోని భాషలన్నీ జాతీయ భాషలేనని ఆరెస్సెస్ స్పష్టం చేసింది. ఒకే భాషను బలవంతంగా అమలు చేయడాన్ని సమర్థించేది లేదని ప్రకటించింది. ఇటీవల జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో ఈమేరకు పేర్కొంది. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో హిందీ అమలుపై వివాదాలు నెలకొన్న నేపథ్యంలో ఈమేరకు స్పష్టతనిచ్చింది. జాతీయ నూతన విద్యావిధానం(ఎన్ఈపీ)లో భాగమైన మూడు భాషల ఫార్ములా నుంచే ఈ వివాదం మొదలైంది. ఎన్ఈపీ ద్వారా హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాగా మహారాష్ట్రలో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ మూడు భాషల ఫార్ములాకి సంబంధించి జారీ చేసిన రెండు ఆదేశాలను అక్కడి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది.

తమిళనాడులో స్కూలు బస్సును ఢీకొన్న రైలు

- ముగ్గురు విద్యార్థుల మృతి.. డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు
- గేటుమ్యాన్‌కు తమిళం రాకపోవడం వల్లే ప్రమాదం: డీఎంకే

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి)/న్యూఢిల్లీ: తమిళనాడులోని కడలూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం సెమ్మంకుప్పం రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న ఓ స్కూలు బస్సును రైలు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతిచెందగా, బస్సు డ్రైవర్, మరో విద్యార్థి గాయపడ్డారు. స్కూల్‌కు వెళ్లడంలో ఆలస్యం కాకుండా ఉండేందుకు మూసివున్న గేటును తెరవాలని బస్సు డ్రైవర్ ఒత్తిడి చేశాడని, దీంతో నిబంధనలకు విరుద్ధంగా గేటుకీపర్ అందుకు అనుమతించాడని దక్షిణ రైల్వే చెబుతుండగా.. బస్సు వచ్చిన సమయానికి గేటు తెరిచే ఉందని డ్రైవర్ శంకర్‌తో పాటు గాయపడిన విద్యార్థి విశ్వేష్ చెప్పారు. మరోవైపు ఈ ప్రమాదంపై ఒక కొత్త కోణంలో రాజకీయ దుమారం రేగింది. క్రాసింగ్ వద్ద నియమించిన రైల్వే గేట్‌మ్యాన్‌కు తమిళం అర్థం కాలేదని అధికార డీఎంకే ఆరోపించింది. స్థానిక భాష తెలియకపోవడం వల్ల కమ్యూనికేషన్ లోపం జరిగిందని, చివరకు అది ఘోర దుర్ఘటనకు దారితీసిందని పేర్కొంది. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ మాట్లాడుతూ 'ఘటనాస్థలిలో ఇప్పటికే ఒక ప్రమాదం జరిగింది. అక్కడ ఉండే వ్యక్తికి తమిళ భాష తెలియకపోవమే అందుకు కారణమని రైల్వే అథారిటీ స్వయంగా చెప్పింది. ఇతరులు ఏం చెప్పారో ఆయనకు అర్థం కావడం లేదు. అదే ఇప్పటి ఘటనలో కూడా జరిగింది' అని పేర్కొన్నారు. అలాంటి ముఖ్యమైన చోట్ల స్థానిక భాష తెలిసిన వారిని నియమించి, ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

ముర్ము.. ముర్మా-కోవింద్.. కోవిడ్

- ప్రస్తుత, మాజీ రాష్ట్రపతుల పేర్లు తప్పుగా పలికిన ఖర్గే

రాయ్‌పూర్, జూలై 8: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్లను ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే తప్పుగా పలికిన వీడియో వైరల్‌గా మారింది. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో ఖర్గే ప్రసంగించారు. ఆ రాష్ట్ర అడవుల్లో భారీ సంఖ్యలో చెట్ల కొట్టివేతను ప్రస్తావిస్తూ.. "మన నీళ్లు, అడవులు, భూములను రక్షించుకోవాలి. ఇందుకోసం మనం ఏకమవ్వాలి. మేం ముర్మా(ద్రౌపది ముర్ము)ను రాష్ట్రపతిని చేశామని బీజేపీ వాళ్లు చెబుతుంటారు..' అని అన్నారు. వెంటనే ముర్ముజీ అని సరిదిద్దుకున్నారు. కొద్దిసేపటికే మళ్లీ.. కోవిడ్(రామ్‌నాథ్ కోవింద్)ను కూడా రాష్ట్రపతిని చేశామని చెబుతుంటారని వ్యాఖ్యానించారు. మన వనరులు, అడవులు, నీరు, భూమిని దోచుకోవడానికే వారికా పదవులు ఇచ్చారని చెప్పారు. అదానీ, అంబానీలాంటి వారు వాటిని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ భగ్గుమంది. ఖర్గే మహిళా వ్యతిరేకి అని.. ఆయన దళిత, గిరిజన వ్యతిరేక మనస్తత్వం బయటపడిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ధ్వజమెత్తారు.

'ఈ కామర్స్'తో ఉగ్ర భూతానికి ఆర్థిక ఊతం

న్యూఢిల్లీ, జూలై 8: ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థలను ఉగ్రవాదులు తీవ్రస్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారని.. వాటిని తమ ఆర్థిక లావాదేవీలకు (టెర్రర్ ఫైనాన్సింగ్‌కు), దాడులకు అవసరమైన పరికరాలు, రసాయనాలు, త్రీడీ ముద్రిత వస్తువుల కొనుగోలుకు ఉపయోగించుకుంటున్నాయని ఎఫ్ఏటీఎఫ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. "కాంప్రహెన్సివ్ అప్‌డేట్ ఆన్ టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్క్స్' పేరిట ఇచ్చిన నివేదికలో ఆ సంస్థ.. మనదేశంలో జరిగిన రెండు ఉగ్ర దాడుల గురించి ప్రస్తావించింది. వాటిలో ఒకటి.. 2019లో పుల్వామాలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను బలిగొన్న ఉగ్రదాడి. మరొకటి.. 2022లో అహ్మద్ ముర్తజా అబ్బాసీ అనే ఉగ్రవాది గోరఖ్‌నాథ్ ఆలయంలోకి చొరబడడానికి ప్రయత్నించి, అడ్డుకున్న ఇద్దరు జవాన్లను గాయపరచిన ఘటన. పుల్వామా దాడికి ఉపయోగించిన 'ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ)' తయారీకి కావాల్సిన అల్యూమినియం పౌడర్‌ను ఈపామ్ అమెజాన్ నుంచి కొనుగోలు చేసినట్టు ఎఫ్ఏటీఎఫ్ పేర్కొంది.

ఈ కాలం పిల్లల్లో.. లెక్కలు, ఎక్కాలు

తెల్వనోళ్లే ఎక్కువ!



ఆరోతరగతిలో ఉన్నా 53% మందికే 10 వరకు ఎక్కాలు తెలుసు

- మూడో తరగతిలో 45% మందికి ఆరోహణ, అవరోహణ క్రమాలు తెలియవు
- కేంద్ర విద్యాశాఖ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 8: దేశంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల్లో ఎక్కువ మంది 'లెక్కలు.. ఎక్కాలు తెల్వనోళ్లే'నని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన తాజా సర్వే వెల్లడించింది. పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. మూడో తరగతి విద్యార్థుల్లో 45% మందికి 99 వరకు ఉన్న అంకెల్లో ఆరోహణ, అవరోహణ క్రమాలను గుర్తించే శక్తి లేదు. ఆరోతరగతి విద్యార్థుల్లో 10 వరకు ఎక్కాలు వచ్చిన వారు 53% మందే కావడం గమనార్హం..! తొమ్మిదో తరగతిలో కూడా.. గణిత ప్రక్రియల పరస్పర సంబంధాలు, వాటిని అన్వయించడంపై కేవలం 53% మందికే అవగాహన ఉందనే కఠోర సత్యం ఈ సర్వేలో వెల్లడైంది. గత ఏడాది డిసెంబరు 4న కేంద్ర విద్యాశాఖ పరిధిలోని.. విద్యావ్యవస్థ పనితీరు, సమీక్ష, విశ్లేషణ - సమగ్రాభివృద్ధి(పరాఖ్) రాష్ట్రీయ సర్వేక్షణ్ ఈ సర్వేను నిర్వహించింది. దేశంలోని 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న 781 జిల్లాలకు చెందిన 74,229 ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో ఈ సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో మొత్తం 21,15,022 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేలో వెల్లడైన అంశాలు..

- మూడో తరగతిలో 55% మంది విద్యార్థులు మాత్రమే 0 నుంచి 99 వరకు ఉన్న అంకెలు/సంఖ్యలను ఆరోహణ, అవరోహణ క్రమాల్లో అమర్చగలుగుతున్నారు.
- ఇదే తరగతికి చెందిన 58% మంది విద్యార్థులు మాత్రమే రెండంకెల సంఖ్యలను కూడడం, తీసివేయడం చేయగలుగుతున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు వెనకబడి ఉన్నారు.
- ఆరోతరగతి విద్యార్థుల్లో 53% మంది మాత్రమే 10 వరకు ఎక్కాలను చెప్పగలుగుతున్నారు. ఈ తరగతిలో ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యార్థుల పరిస్థితి ఘోరంగా ఉంది.
- తొమ్మిదో తరగతిలో 53% మంది విద్యార్థులకే గణిత ప్రక్రియల పరస్పర సంబంధం, వాటిని ఇచ్చిన లెక్కల్లో అన్వయించడంపై అవగాహన ఉంది.
- తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో.. కేంద్ర ప్రభుత్వ బడులకు చెందిన వారు అత్యుత్తమ ప్రదర్శన కనిపిస్తుండగా.. రెండో స్థానాన్ని ప్రైవేటు బడుల విద్యార్థులు ఆక్రమించారు. రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే బడుల విద్యార్థులు మూడోస్థానంలో నిలిచారు.
- ఆయా తరగతుల విద్యార్థులకు భాషలు, గణితంలో పరీక్షలు నిర్వహించగా.. గణితంలో సగటున 46%, భాషల్లో 57% స్కోర్ రావడం గమనార్హం..! పర్యావరణంపై నిర్వహించిన పరీక్షలోనూ 49% స్కోరుతో విద్యార్థులు వెనకబడే ఉన్నారు.
- మూడో తరగతిలో.. గ్రామీణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఆరు, తొమ్మిది తరగతుల్లో మాత్రం.. పట్టణ ప్రాంతాల విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు.

ప్రత్యేక కార్యాచరణ: కేంద్రం

పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 ఫలితాల నేపథ్యంలో విద్యార్థుల్లో ప్రతిభను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. "ఈ సర్వే ఫలితాలు కేంద్ర, ప్రాంతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విద్యార్థుల పనితీరుకు నిదర్శనంగా ఉన్నాయి. పరిస్థితిని గాడిలో పెట్టేందుకు పరాఖ్ ద్వారా జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. జాతీయ ప్రతిభ సర్వేక్షణ్(ఎన్ఏఎస్) పేరుతో గతంలో 3, 5, 8తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాం. ఈ పరీక్షలు మూడేళ్లకోసారి జరుగుతాయి. చివరిసారి పరీక్షలు 2021లో జరిగాయి. తాజా సర్వే నేపథ్యంలో ఈ పరీక్షలపై దృష్టి పెడతాం" అన్నారు.

ఎస్సీ పిల్లలను ఫీజులడిగితే ఊరుకోం

- జరిమానా విధించడంతోపాటు బ్లాక్‌లిస్టులో పెడతాం
- 'శ్రేష్ఠ' రెసిడెన్సియల్ స్కూళ్లకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 8: ప్రైవేటు రెసిడెన్సియల్ స్కూళ్లలో శ్రేష్ఠ పథకం కింద ప్రవేశాలు పొందిన ఎస్సీ విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తుండటంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఇలాంటివి సహించేది లేదని, శ్రేష్ఠ నిబంధనలను ఉల్లంఘించే స్కూళ్లకు జరిమానా విధించడంతోపాటు వాటిని బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించింది. ప్రవేశ రుసుముతోపాటు యూనిఫాంలు, బుక్స్, ఇతర ఉపకరణాల కోసం కొన్ని స్కూళ్ల విద్యార్థుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం, సాధికారికత శాఖ సహాయ కార్యదర్శి రాకేశ్ కుమార్ సోమవారం ఆయా స్కూళ్ల మేనేజ్‌మెంట్లకు ఘాటుగా లేఖ రాశారు. ఫీజులుగానీ, అదనపు చార్జీలుగానీ తొమ్మిది, పదకొండో తరగతుల్లో ప్రవేశాలు పొందిన ఎస్సీ విద్యార్థుల నుంచి వసూలు చేయడానికి వీల్లేదని ఆ లేఖలో స్పష్టం చేశారు. వారికి చెందిన బోధన, వసతులకు సంబంధించిన ఖర్చులను స్కూళ్లకు కేంద్రమే రీయింబర్స్ చేస్తుందని తెలిపారు. నిజానికి, శ్రేష్ఠ పథకాన్ని కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోంది. మంచి ఫలితాలు సాధిస్తున్న ప్రవేటు రెసిడెన్సియల్ స్కూళ్లను ఎంపిక చేసి ఎస్సీ విద్యార్థులకు అందులో ప్రవేశాలు కల్పిస్తున్నారు. జాతీయ ప్రవేశ పరీక్ష(ఎన్ఈటీఎస్) నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ఇంటర్ వరకు ఉచితంగా అత్యంత నాణ్యమైన విద్యను అందిస్తారు.

డ్రీమ్‌లైనర్ అత్యంత సురక్షితం

- పీఏసీ సమావేశంలో ఎయిరిండియా

న్యూఢిల్లీ, జూలై 8: అహ్మదాబాద్‌లో అత్యంత ఘోర విషాదానికి కారణమైన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం పనితీరును ఎయిరిండియా సమర్థించింది. ప్రస్తుతం ఆపరేషన్‌లో ఉన్న అత్యంత సురక్షితమైన విమానాల్లో ఒకటిగా అభివర్ణించింది. ప్రపంచవ్యాప్తంగా వెయ్యికి పైగా డ్రీమ్‌లైనర్లు పనిచేస్తున్నాయని పేర్కొంది. ఈ మేరకు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)కి సమర్పించిన నివేదికలో ఎయిరిండియా పేర్కొందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 'ఎయిర్‌పోర్టుల్లో లెవీ చార్జీలు' అంశంపై చర్చించడానికి ఏర్పాటైన ఈ సమావేశంలో జూన్ 12నాటి ప్రమాద ఘటన ప్రస్తావనకు రావడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. విమానాల్లో భద్రతా ప్రమాణాలపై ఆయా విమానయాన సంస్థలు సమాధానం చెప్పాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఇటీవల విమానాల్లో తరచుగా చోటుచేసుకుంటున్న భద్రతా లోపాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్)తో తక్షణ ఆడిట్ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో పౌర విమానయాన శాఖ, డీజీసీఏ, ఏఏఐ, ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ, బీసీఏఎస్ ఉన్నతాధికారులు, ఎయిరిండియా సీఈవో విల్సన్ క్యాంప్‌బెల్‌తో పాటు ఇండిగో, ఆకాశ ఎయిర్, ఇతర విమానయాన సంస్థల సీనియర్ ప్రతినిధులు హాజరయ్యారు. కాగా,ఎయిరిండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు చేపట్టిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) తన ప్రాథమిక నివేదికను మంగళవారం పౌర విమానయాన శాఖకు సమర్పించింది.

భారతీయ యూజర్లందరికీ అందుబాటులో జెమినీ 2.5 ఏఐ

న్యూఢిల్లీ, జూలై 8: గూగుల్ ఏఐ టూల్ జెమినీ తాజా వెర్షన్ ఇకపై భారతీయ యూజర్లందరికీ అందుబాటులోకి రానుంది. జెమినీ 2.5 వెర్షన్‌ను సెర్చ్‌ఇంజన్‌తోపాటు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. టెక్స్ట్ రూపంలో సమాచారాన్ని కోరినా, వాయిస్ ద్వారా ప్రశ్నించినా.. ఏదైనా ఫొటోను అప్‌లోడ్ చేసినా.. జెమినీ 2.5 సమాచారం అందజేస్తుందని వివరించింది. ప్రత్యేక ట్యాబ్‌లో సెర్చ్ ఫలితాలు కనిపిస్తాయని, వినియోగదారులకు అనుబంధ ప్రశ్నలు వేసే అవకాశాలుంటాయని పేర్కొంది.



ట్రంప్‌నకు నోబెల్ ఇవ్వండి

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిపాదన

వాషింగ్టన్, జూలై 8: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిపాదించారు. ఈ మేరకు నోబెల్ ప్రైజ్ కమిటీకి తాను పంపిన లేఖ ప్రతిని నెతన్యాహూ స్వయంగా సోమవారం ట్రంప్‌కు అందజేశారు. ట్రంప్‌తో విందులో పాల్గొనేందుకు నెతన్యాహూ వైట్‌హౌస్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇరువురూ భేటీ అయ్యారు. అనంతరం ట్రంప్‌ను ఉద్దేశించి నెతన్యాహూ మాట్లాడుతూ 'మిస్టర్ ప్రెసిడెంట్.. నోబెల్ శాంతి బహుమతికి మీరు అర్హులు. అది మీకు తప్పక దక్కుతుంది' అన్నారు. 'ట్రంప్ ఒక దేశం తర్వాత మరొక దేశంలో, ఒక ప్రాంతం తర్వాత మరొక ప్రాంతంలో శాంతిని నెలకొల్పుతున్నారు' అన్నారు. నోబెల్ శాంతి బహుమతి కోసం సుదీర్ఘకాలంగా ఆకాంక్షను వ్యక్తం చేస్తున్న ట్రంప్ తాజా ప్రతిపాదనపై నెతన్యాహూకు కృతజ్ఞతలు తెలిపారు. 'మీరు చాలా అర్థవంతంగా మాట్లాడారు. మీకు చాలా కృతజ్ఞతలు' అన్నారు.

భారత్‌లో మీడియాపై సెన్సార్‌షిప్!

ప్రభుత్వం చెప్పడంతో రాయిటర్స్ హ్యాండిల్ ఆపేశాం.. గంట టైమిచ్చి 2,355 ఖాతాల్ని ఆపేయమన్నారు

ఎక్స్ ఇండియా విభాగం సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ, జూలై 7: భారత ప్రభుత్వం మీడియా సంస్థల 'ఎక్స్' ఖాతాలను స్తంభింపజేయడం ద్వారా మీడియాపై సెన్సార్‌షిప్‌కు పాల్పడుతోందని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఎక్స్ ఆందోళన వ్యక్తం చేసింది. దీన్ని ఎదుర్కొనేందుకు తాము ఇప్పటికే భారతదేశంలో అవకాశమున్న అన్ని చట్టపరమైన మార్గాలను పరిశీలిస్తున్నామని తెలిపింది. ఎక్స్ ఖాతాదారులతో పోలిస్తే తమకు ప్రభుత్వ ఆదేశాలను కోర్టులలో సవాలు చేసే విషయంలో పరిమితులు ఉన్నాయని తెలిపింది. కాబట్టి బాధితులే కోర్టులను ఆశ్రయించాలని పిలుపునిచ్చింది. భారతదేశ సెన్సార్‌షిప్ విధానాలపై కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, ఎక్స్‌కు మధ్య వివాదం నడుస్తోంది. ప్రభుత్వ సెన్సార్‌షిప్ విధానాలను సవాలుచేస్తూ ఇప్పటికే ఎక్స్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. దానిపై తీర్పు వెలువడక ముందే తాజాగా ప్రముఖ వార్తాసంస్థ రాయిటర్స్ ఎక్స్ హ్యాండిల్స్ రెండింటిని ఆపేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో మరోసారి వివాదం రాజుకుంది. భారత ప్రభుత్వం విజ్ఞప్తి మేరకే వాటిని ఇక్కడి ప్రజలకు అందుబాటులో లేకుండా ఆపేశామని ఎక్స్ ఇండియా విభాగం ప్రకటించింది. రాయిటర్స్ ఎక్స్ ఖాతాలు జూలై మూడవ తేదీ సాయంత్రం నుంచి ఆరవతేదీ సోమవారం సాయంత్రం వరకు భారత్‌లో పని చేయలేదు. ఐటీ చట్టం 69(ఎ) నిబంధన కింద 2,355 ఎక్స్ ఖాతాలను గంట సేపట్లో బ్లాక్ చేయాలని భారత ప్రభుత్వం తమను ఆదేశించిందని, అందులో రాయిటర్స్, రాయిటర్స్ వరల్డ్ ఎక్స్ ఖాతాలు కూడా ఉన్నాయని ఎక్స్ తెలిపింది. ప్రభుత్వ ఆదేశంలో ఎలాంటి కారణాలను చూపలేదని చెప్పింది. అయితే, సాంకేతిక కారణాల వల్లే రాయిటర్స్ ఖాతాలు బ్లాక్ అయ్యాయని, వాటిని బ్లాక్ చేసే ఉద్దేశం లేదని, సమస్య పరిష్కారం కోసం ఎక్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని గత ఆదివారం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎక్స్ ఇండియా విభాగం స్పందించింది. ఇది సాంకేతిక సమస్య కాదని, రాయిటర్స్ రెండు ఖాతాలే కాకుండా వాటితో పాటు మొత్తం 2,355 ఖాతాలను బ్లాక్ చేయమని ఆదేశాలు రావడం వల్లే తాము చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. అయితే, ఎక్స్ ఆరోపణలపై భారత ప్రభుత్వం ఖండించింది. జూలై 3న ఎక్స్ ఖాతాలను బ్లాక్ చేయాలని తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెప్పింది. మీడియా సంస్థల ఖాతాలను బ్లాక్ చేసినట్లు తెలియగానే వాటిని అన్‌బ్లాక్ చేయాలని సమాచారం ఇచ్చామని వెల్లడించింది. ఆ తర్వాత ఎక్స్ వాటిని అన్‌బ్లాక్ చేయడానికి 21 గంటల సమయం తీసుకుందని తెలిపింది. తామే వెంటబడి వాటిని అన్‌బ్లాక్ చేయించామని చెప్పింది. రాయిటర్స్ ఖాతాలను బ్లాక్ చేయించాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేసింది. ఎక్స్ చెబుతున్న జాబితా మే 9న ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఇచ్చిన ఆదేశాలని, వాటిని అప్పుడు అమలు చేయకుండా ఇప్పుడు చేశారని అధికారులు చెబుతున్నారు. అయితే, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లకుండా చూసేందుకు భారత ప్రభుత్వం 8,000 ఖాతాలను బ్లాక్ చేయమని ఆదేశించిందని మే 9వ తేదీనే ఎక్స్ ప్రకటించింది. వాటిని అమలు చేశామని అదే రోజు చెప్పింది. కాగా, ఖాతాల బ్లాకింగ్ అంశంపై ఎక్స్ గత మార్చిలో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. ఇంటర్నెట్‌లో అభ్యంతరకరమైన పోస్టులను ఐటీ చట్టంలోని 69(ఎ) ద్వారా ఒక కమిటీ సూచించిన తర్వాత తొలగించాలని వాదించింది. కేంద్రం 79(3)(బి) సెక్షన్‌ను ఉపయోగించి సహయోగ్ పోర్టల్ ద్వారా తొలగించాల్సిన అంశాలను ఏకపక్షంగా నిర్దేశిస్తోందని తెలిపింది. ఈ కేసులో మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. సహయోగ్ పోర్టల్‌తో ప్రభుత్వ అధికారికి తన సొంత నిర్ణయంతో ఇష్టం వచ్చినట్లు ఏ ఖాతానైనా బ్లాక్ చేసే అధికారం లభించిందని ఎక్స్ వాదించింది.

బ్రిక్స్ దేశాలపై 10% అదనపు సుంకం

- డాలర్‌ను బలహీన పరిచేందుకు బ్రిక్స్ యత్నం
- అందుకే అదనపు సుంకం
- భారత్‌కు మినహాయింపు ఉండదు: ట్రంప్



వాషింగ్టన్, జూలై 8: బ్రిక్స్ సభ్యదేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు విరుచుకుపడ్డారు. మంగళవారం వైట్‌హౌస్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశం తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్‌'లో పలు నిర్ణయాలను వెల్లడించారు. డాలర్‌ను బలహీన పరిచేందుకు బ్రిక్స్ ప్రయత్నిస్తోందని, దానికి ప్రతిగా ఆ దేశాలపై 10% అదనపు దిగుమతి సుంకం విధిస్తానని పునరుద్ఘాటించారు. ఇందులో భారత్ కూడా ఉంటుందని, ఎవరికీ మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. "అమెరికా డాలర్ రారాజు. అది అలాగే కొనసాగుతుంది. దాన్ని సవాలు చేయాలనుకున్న వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. "అసలు బ్రిక్స్ అనేది ఏర్పాటైందే అమెరికాకు నష్టం కలిగించడానికి..! డాలర్‌ను క్షీణింపజేయడానికి..! అయితే.. బ్రిక్స్ దేశాలు అమెరికాకు నిజమైన ప్రమాదం కాదని నేను విశ్వసిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 14 దేశాలకు ట్రంప్ సుంకాలను విధిస్తూ లేఖలు రాసిన విషయం తెలిసిందే..! ఈ క్రమంలో భారత్‌తో ఒప్పందం జరుగుతుందని ఆయన ప్రకటించారు. ఆగస్టు తర్వాత భారత ప్రధాని మోదీతో కలిసి తుది ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశాలున్నట్లు వివరించారు. ఆయా దేశాలపై ఈ నెల 9 నుంచి సుంకాలు అమలవుతాయని ట్రంప్ ప్రకటించగా.. ఆ తేదీని ఆగస్టు 1కి పొడిగించారు. అంతలోనే బ్రిక్స్ దేశాలపై 10% అదనపు సుంకాన్ని ప్రకటిస్తూ.. భారత్ మినహాయింపు కాదని పేర్కొనడం గమనార్హం..!

ఔషధ రంగంపై 200% బాదుడు

ఫార్మాస్యూటికల్ దిగుమతులపై కూడా ట్రంప్ భారీగా– 200% వరకు సుంకం విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే, ఈ సుంకాలను వెంటనే అమలు చేయకుండా.. 18 నెలల పాటు గడువు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ గడువు కాలం ముగిసే లోపు ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తి కేంద్రాలను అమెరికాలో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వారంలోనే విదేశీ రాగి దిగుమతులపై 50% సుంకం విధించే ఉత్తర్వుపై సంతకం చేయనున్నట్లు తెలిపారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఉన్న సుంకాల రేట్లకు అనుగుణంగా రాగిపైనా సుంకం ఉంటుందన్నారు.

67 మందిని కాపాడిన భౌభౌ!

మండి, జూలై 8: భారీ వర్షాలతో అతలాకులతమైన హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ పెంపుడు కుక్క అరుపు 67మందిని కాపాడింది. జూన్ 30న అర్ధరాత్రి సియతి గ్రామంలో నరేంద్ర అనే వ్యక్తి ఇంట్లో కుక్క పెద్దగా అరవడం ప్రారంభించింది. నిద్రలేచిన నరేంద్ర వెళ్లి చూడగా.. గోడకు పెద్ద పగుళ్లు ఏర్పడి, ఇంట్లోకి నీరు వస్తున్నాయి. వెంటనే కుక్కతో పాటు కిందకు పరిగెత్తి, అందరినీ నిద్రలేపానని నరేంద్ర తెలిపారు. ఆ తర్వాత గ్రామంలోని ఇతరులను కూడా నిద్రలేపి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని చెప్పానన్నారు. అలా వారు వెళ్లారో లేదో.. కొద్దిసేపటికి గ్రామంపై కొండచరియలు విరిగిపడ్డాయి..

జర్మనీ విమానంపై చైనా యుద్ధనౌక లేజర్!

బెర్లిన్, జూలై 8: ఎర్ర సముద్రం మీదుగా ఎగురుతున్న తమ విమానాన్ని.. చైనా మిలటరీకి చెందిన యుద్ధనౌక ఇటీవలే లేజర్ కిరణాలతో టార్గెట్ చేసిందని జర్మనీ ఆరోపించింది. తమదేశంలోని చైనా రాయబారిని పిలిపించి.. ఈ ఘటనపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఎర్రసముద్రంలో తిరిగే వాణిజ్య నౌకలపై యెమెన్‌కు చెందిన హూతీ రెబెల్స్ దాడులు చేస్తున్న నేపథ్యంలో.. వాటిని రక్షించేందుకు యూరోపియన్ యూనియన్ ఎర్ర సముద్రంపై 'ఆపరేషన్ యాస్పైడ్స్' పేరిట నిఘా చర్యలు చేపట్టింది. నిఘా విధుల్లో ఉన్న తమ విమానంపై ఎలాంటి హెచ్చరికలూ చేయకుండా, కారణం కూడా చెప్పకుండా చైనా లేజర్ కిరణాలను ప్రయోగించిందని జర్మనీ మండిపడింది.

సాగర్‌కు ముప్పు పొంచి ఉంది!

» ప్రాజెక్టు కుడివైపు ఎస్పీఎఫ్ మోహరింపునకు అనుమతివ్వండి

» కృష్ణా బోర్డుకు తెలంగాణ సర్కార్ లేఖ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఆనకట్టకు 1990 నుంచి ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందని, ఈ క్రమంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దీన్ని 'ఏ' కేటగిరిలో పెట్టిందని, ఈ నేపథ్యంలో రిజర్వాయర్‌ను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని తెలంగాణ రాష్ట్రం పేర్కొంది. ఇదే అంశంపై కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) మహమ్మద్ అంజద్ హుస్సేన్ ఈనెల 4వ తేదీన లేఖ రాశారు. సాగర్ కుడివైపు(ఏపీ)లో పాయింట్ నెం. 515, 420, 250ల వద్ద రక్షణ లేదని, సీఆర్‌పీఎఫ్ బలగాలు కేవలం ప్రధాన డ్యామ్ రక్షణకే పరిమితమయ్యాయని గుర్తు చేశారు. దాంతో ఆనకట్టకు చుట్టు పక్కల రక్షణ వ్యవస్థ అవసరమని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఎడమ గట్టువైపు 12 పోస్టులో 70 మందికి పైగా ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు రక్షణగా ఉన్నారని, కొన్నినెలలుగా ప్రాజెక్టు కుడివైపు మూడు గార్డు పోస్టుల(515, 420, 250) వద్ద రక్షణ కోసం సిబ్బంది లేరని పేర్కొన్నారు. డ్యామ్ సేఫ్టీ చట్టం-2021 ప్రకారం తెలంగాణ ప్రభుత్వం 2023 నవంబరు 30కి ముందు, తర్వాత సాగర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) పనులు సమర్థంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అయితే 3 పాయింట్లలో కాపలా కోసం ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక అధికారిని ఎస్పీఎఫ్ పంపించగా.. కృష్ణాబోర్డు అనుమతి లేకుండా ఆ పోస్టుల్లో కాపలాకు అనుమతించబోమని సీఆర్‌పీఎఫ్ అడ్డుకుందని గుర్తు చేశారు. దాంతో సాగర్‌కు పొంచి ఉన్న ముప్పు నేపథ్యంలో ఎస్పీఎఫ్ బలగాలు కాపలా కాయడానికి అనుమతించాలని ఈఎన్‌సీ కోరారు.

8 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీలు

» 13 నుంచి అందుబాటులోకి..

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జోన్ పరిధిలోని వివిధ మార్గాల్లో నడుస్తున్న ముఖ్యమైన 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీలను జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతీ రైలుకు ఒక త్రీటైర్ ఏసీ (ఎకానమీ) బోగీని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్(17233/17234) రైళ్లు, సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201/17202), కాచిగూడ-విజయవాడ మధ్య నడిచే శాతవాహన(12713/12714), విజయవాడ- చెన్నై మధ్య నడిచే పినాకిని ఎక్స్‌ప్రెస్(12711/12712) రైళ్లకు అదనపు ఏసీ బోగీ సదుపాయం ఈ నెల 13 నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

దాతృత్వం చాటుకున్న గుట్ట ఆలయ ఈవో

» అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం ఇచ్చేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆలయంలో అన్నప్రసాద వితరణకు గత నెల రూ.3 లక్షలు విరాళంగా ఇచ్చిన ఆయన, తాజాగా మరో రూ.లక్షను అందజేశారు. ఉద్యోగ విరమణ పొందేవరకు ప్రతినెలా తన వేతనం నుంచి రూ.లక్షను విరాళంగా అందజేయనున్నట్లు వెంకట్రావు ప్రకటించారు. ఈ మేరకు ఆయన మంగళవారం క్యూఆర్ కోడ్ ద్వారా ఆలయ ఖజానాకు రూ.లక్ష జమ చేశారు.

పుట్టపాక చేనేతకు జాతీయ అవార్డులు

» యంగ్ వీవర్‌లో పవన్, మార్కెటింగ్‌లో నర్మదకు పురస్కారాలు





గూడ పవన్, గజం నర్మద

సంస్థాన్‌నారాయణపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక చేనేతకు జాతీయ గుర్తింపు లభించింది. కేంద్ర చేనేత, జౌళి శాఖ సోమవారం ప్రకటించిన అవార్డుల్లో పుట్టపాకకు చెందిన ఇద్దరికి పురస్కారాలు వరించాయి. యంగ్ వీవర్ విభాగంలో గూడ పవన్ అనే చేనేత కళాకారుడు, మార్కెటింగ్ విభాగంలో గజం నర్మద అనే మహిళ పురస్కారానికి ఎంపికయ్యారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతులమీదుగా వీరు ఈ పురస్కారాలను అందుకోనున్నారు. కాగా, పుట్టపాక గ్రామానికి చెందిన గూడ పవన్.. బంతిపూలు, దానిమ్మ పండ్లు, వేర్లు వనమూలికలతో తయారుచేసిన సహజ సిద్ధమైన రంగులను మల్బరీ పట్టు దారానికి అద్ది తేలియా రుమాల్‌తో పట్టుచీరను తయారుచేశారు. 16 ఆకృతులు అద్ది మడతలు పడకుండా ఆరు నెలల పాటు శ్రమించి చీరను రూపొందించారు. రూ.75 వేలు ఖరీదు చేసే ఈ చీర పవన్‌కు పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. ఇక, పుట్టపాకకు చెందిన గజం నర్మద తన భర్త నరేందర్ సహకారంతో హైదరాబాద్ కొత్తపేటలో నరేంద్ర హ్యాండ్లూమ్స్ పేరుతో చేనేత వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నారు. 2013 నుంచి వ్యాపారంలో ఉన్న నర్మద.. ఏడాదికి రూ.8 కోట్ల విలువైన చేనేత వస్త్రాలను విక్రయిస్తూ దాదాపు 300 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. దీంతో మార్కెటింగ్ విభాగంలో ఆమె అవార్డుకు ఎంపికయ్యారు.

సిగాచీ'ని సందర్శించిన ఎన్డీఎంఏ బృందం

» ఆస్పత్రిలో మరో ఇద్దరు మృతి.. 44కు పెరిగిన మృతుల సంఖ్య

పటాన్‌చెరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఘోర ప్రమాదం సంభవించిన సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ ఫార్మా ఫ్యాక్టరీని మంగళవారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ) అధికారుల బృందం సందర్శించింది. ప్రమాద స్థలంలో అణువణువు పరిశీలిస్తూ ఘటన వివరాలను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లా అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదం తీరును బృందం సభ్యులకు వివరించారు. కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు కార్మికులు మృతిచెందడంతో ఈ ప్రమాద మృతుల సంఖ్య 44కు చేరింది. బీరంగూడ పనేషియా, పటాన్‌చెరు ధ్రువ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఆరిఫ్ (20, బిహార్), అఖిలేశ్వర్ (28, ఉత్తరప్రదేశ్) మంగళవారం మృతిచెందారు. కాగా, గల్లంతైన 8 మంది కార్మికుల జాడ ఇప్పటికీ తెలియలేదు.

బిరబిరా కృష్ణమ్మ!

(మొదటి పేజీ తరువాయి)



నాలుగు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం డ్యాం నుంచి కిందకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

దాటుకొని సాగర్‌వైపు పరుగులు పెడుతోంది. నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1.06 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుదుత్పత్తితో కలుపుకొని సాగర్‌కు 1.72 లక్షల క్యూసెక్కులు వెళుతున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు తీసిన లెక్కల ప్రకారం.. శ్రీశైలం ప్రాజెక్టుకు 2.13 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు 198.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరద ఆధారంగా నీటి విడుదలలో పెంపు, తగ్గింపు చేయనున్నారు. ఎగువన ఉన్న ఆలమట్టి ప్రాజెక్టుకు 1.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.15 లక్షల క్యూసెక్కులను నారాయణపూర్ రిజర్వాయర్‌కు వదులుతున్నారు. నారాయణపూర్‌కు 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 30 గేట్ల ద్వారా 1.12 లక్షల క్యూసెక్కులను జూరాలకు విడుదల చేస్తున్నారు. తుంగభద్రపై ఉన్న సుంకేసులకు 61 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 16 గేట్ల ద్వారా 63,264 క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం వద్ద 2.13 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కులు తరలిస్తుండగా మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి 1600 క్యూసెక్కులను పంపింగ్ చేస్తున్నారు. బీమా నదిపై మహారాష్ట్రలోని ఉజ్జయిని ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 5 వేల క్యూసెక్కులను కిందికి వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు 1.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 1.26 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఆలమట్టి నుంచి పులిచింతల దాకా అన్ని జలాశయాల కింద జలవిద్యుత్ ఉత్పాదన పరుగులు పెడుతోంది. 27 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను తెలంగాణ జెన్‌కో ఉత్పత్తి చేసింది.

పెరుగుతున్న సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి వరద ఇలాగే కొనసాగితే 10 రోజుల్లో సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఎత్తే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 531.70 అడుగులుగా నమోదైంది. సాగర్ నుంచి ఎడమ కాలువ ద్వారా 3,090 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,500 క్యూసెక్కులు... మొత్తం 4,590 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ కుడి, వరద కాలువలకు ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి నీటి విడుదల లేదు. కాగా, 24 దేశాలకు చెందిన పర్యావరణ ప్రతినిధులు మంగళవారం నాగార్జునసాగర్‌లో పర్యటించారు. హైదరాబాద్‌లోని పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థలో 'ప్రాజెక్టుల అభివృద్ధి-పర్యావరణం-సామాజిక ప్రభావం' అనే అంశంపై శిక్షణకు హాజరైన వీరు... క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సాగర్ ప్రాజెక్టుకు వచ్చారు.

ప్రాజెక్టుల వివరాలు (నీటి నిల్వ టీఎంసీల్లో- ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో)

ప్రాజెక్టు పేరు	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్ ఫ్లో	ఔట్ ఫ్లో
ఆలమట్టి	129.72	87.61	1.11.472	1,15,000
నారాయణపూర్	37.64	26.86	1,15,000	1,12,577
ఉజ్జయిని	117.24	110.63	20,167	5097
జూరాల	9.66	4.25	1,25,000	1,26,844
తుంగభద్ర	105.79	75.90	52,055	53,017
శ్రీశైలం	215.81	195.39	2,13,824	1,94,111
నాగార్జునసాగర్	312.05	162.12	1,14,146	4590
పులిచింతల	45.77	15.22	0	7000
జైక్వాడి	102.73	69.98	43822	119
శ్రీరామ్‌సాగర్	80.50	19.22	5201	672
మిడ్‌మానేరు	27.50	6.90	200	110
కడెం	4.70	2.45	1909	86
శ్రీపాద ఎల్లంపల్లి	20.18	8.73	980	603



నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌పై 24 దేశాల ప్రతినిధులు

గోదావరితో ఉభయ రాష్ట్రాలు సుభిక్షం

ఏటా 2వేల టీఎంసీలు సాగరం పాలు.. చెరో 200 టీఎంసీలు వాడుకున్నా చాలు

» బనకచర్ల సాకారమైతే కరువు అనే మాటే ఉండదు

» రాయలసీమ నుంచి దుర్భిక్షాన్ని తరిమి వేస్తాం

» మళ్లీ మేమే వచ్చినట్లైతే పోలవరం పూర్తయ్యేది

» నంద్యాల జిల్లా పర్యటనలో చంద్రబాబు వెల్లడి



కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి. పక్కన మంత్రి నిమ్మల

నంద్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నదీ జలాలే రాష్ట్రాలకు సంపద, అభివృద్ధి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో మంగళవారం పర్యటించిన చంద్రబాబు.. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నుంచి కృష్ణా జలాలను దిగువకు విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. 'గోదావరి నుంచి ఏటా సముద్రంలోకి రెండు వేల టీఎంసీలు కలుస్తున్నాయి. అందులో 200 టీఎంసీలు చొప్పున ఏపీ, తెలంగాణ వాడుకుంటే రెండు తెలుగు రాష్ట్రాలూ సుభిక్షమవుతాయి. పోలవరం నుంచి బనకచర్లకు నీరు రావాలి. గోదావరి నీరు బనకచర్ల వరకు వస్తే కరువు అనే మాటే ఉండదు. రెండు తెలుగు రాష్ట్రాలూ కరువు కాటకాలకు దూరంగా ఉండాలన్నదే నా తపన" అని ఆయన తెలిపారు. ముందుగా శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీశైలం జలాశయంలో కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చి, గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. అనంతరం శ్రీశైలం రిజర్వాయర్ నాలుగు గేట్లను ఎత్తి కృష్ణా జలాలను దిగువన సాగర్‌కు విడుదల చేశారు. రాయలసీమను రతనాల సీమగా మార్చడమే తన సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమలో కరువు లేకుండా చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే పోలవవరం ఇప్పటికే పూర్తి చేసి తెలుగుజాతికి అంకితం చేసేవాళ్లమని తెలిపారు. "ఉమ్మడి రాష్ట్రంతోపాటు, విభజన తర్వాత కూడా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు నాకు ఇచ్చిన గౌరవం చరిత్రలో ఎవరికీ దక్కలేదు. సమైక్య రాష్ట్రంలో 9 ఏళ్లు సీఎం, 10 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నా. విభజన తరువాత రెండోసారి సీఎం అయ్యాను. నన్ను బలమైన శక్తిగా మార్చిన తెలుగు రాష్ట్రాల ప్రజలకు జీవితాంతం కృతజ్ఞుడనై ఉంటాను' అని తెలిపారు. తాను రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలని కోరుకుంటున్నట్టు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మా ఇంట్లో పని చేయాల్సిందే లేకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తా

» కాళోజీ యూనివర్సిటీ వీసీ బెదిరింపులు

» వర్సిటీ ఎదుట ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ధర్నా



యూనివర్సిటీ ముందు ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

వరంగల్ మెడికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని తన ఇంట్లో పని చేయాలని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పీవీ నందకుమార్ ఒత్తిడి చేస్తున్నారని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. తాను చెప్పినట్టు వినకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీసీ తీరును నిరసిస్తూ యూనివర్సిటీ ఎదుట మంగళవారం బాధితులు ధర్నా చేశారు. తాము కొన్నేళ్లుగా వర్సిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని తన ఇంట్లో పని చేయాలని ఐదుగురు సిబ్బందిని వీసీ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. చాలీచాలని జీతాలతో హైదరాబాద్‌లోని వీసీ ఇంట్లో తాము ఎలా పని చేస్తామని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాదాసు రూప ప్రశ్నించారు. వీసీ వేధింపులు ఆపకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వాట్సప్ గ్రూపుల్లో వేధించినా ర్యాగింగే

» క్రమశిక్షణ చర్యలు తప్పవు.. యూజీసీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 8: విద్యాసంస్థల్లో కొత్తగా చేరిన విద్యార్థులను వాట్సప్ గ్రూపుల ద్వారా వేధించినా దాన్ని ర్యాగింగ్‌గానే పరిగణిస్తామని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్పష్టం చేసింది. ర్యాగింగ్ నిరోధక నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని తెలిపింది. విద్యాసంస్థల్లో సీనియర్లు అనధికారికంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని జూనియర్లను మానసికంగా వేధిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపింది. ఇలా చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ర్యాగింగ్‌ను అరికట్టని విద్యాసంస్థలకు నిధులు నిలిపివేస్తామని హెచ్చరించింది. జుత్తు కత్తిరించుకోవాలని ఒత్తిడితేవడంతోపాటు, ఎక్కువ గంటల పాటు నిద్ర పోకుండా ఉండాలంటూ జూనియర్లను వేధిస్తున్నారని, వాటిని కూడా తీవ్రంగా పరిగణిస్తామని తెలిపింది.

భర్తను చంపిన ఇద్దరు భార్యలు



కనకయ్య(ఫైల్)

» తమపై ఎత్తిన గొడ్డలితోనే ప్రతి దాడి

» జనగామ జిల్లా పిట్టలోనిగూడెంలో ఘటన

» ఆ ఇద్దరు భార్యలతో పాటు మరో ఇద్దరి అరెస్టు

» రెండు నెలల క్రితం డబ్బుల కోసం మొదటి భార్య తల్లిని చంపి పరారీలో ఉన్న మృతుడు

లింగాలఘణపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై చిత్రహింసలు పెడుతున్న భర్తపై అతని ఇద్దరు భార్యలు ఎదురు తిరిగారు. తమపై దాడి చేసేందుకు భర్త ఎత్తిన గొడ్డలితోనే ప్రతి దాడి చేసి అతడిని హతమార్చారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం ఏనెబావి శివారు పిట్టలోనిగూడెంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో కాలియ కనకయ్య (30) హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టలోనిగూడెంకు చెందిన కాలియ కనకయ్య (30)కు చొక్కమ్మ, మరో బాలిక(16) ఇద్దరు భార్యలు ఉన్నారు. వీరు తోటలను గుత్తకు తీసుకుని కూలీ పనిచేస్తూ సంచార జీవితాన్ని గడుపుతుంటారు. మద్యానికి బానిసైన కనకయ్య.. మే 18న యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాలలోని ఓ మామిడితోటలో కూలీగా పని చేస్తున్న సమయంలో డబ్బు కోసం పెద్ద భార్య తల్లి గుగులోత్ జున్నుబాయ్‌ను హత్య చేశాడు. నాటి నుంచి పరారీలో ఉన్న కనకయ్య.. మంగళవారం తెల్లవారుజామున పిట్టలోని గూడెంలోని భార్యల వద్దకు వచ్చాడు. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కనకయ్య.. చంపేస్తానంటూ ఇద్దరు భార్యలపై గొడ్డలి ఎత్తాడు. ఎదురుతిరిగిన భార్యలు ఆ గొడ్డలి లాక్కొని కనకయ్యపై దాడి చేయగా అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు నిందితులు చొక్కమ్మ, గౌరమ్మతో పాటు కనకయ్యకు వరసకు బావమరుదులైన జనార్దన్, శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. కాగా, మద్యం మత్తులో కనకయ్య మానవ మృగంలా ప్రవర్తించేవాడని స్థానికులు చెబుతున్నారు.

పిల్లల కిడ్నీల్లో రాళ్లు!

» తక్కువ నీళ్లు తాగడం.. ప్రాసెస్డ్ ఫుడ్ కారణం

» ఉస్మానియా యూరాలజీ విభాగం పరిశీలన

» ఏడాదిన్నరలో 109 మంది పిల్లలకు సర్జరీలు

» ఆరు నెలల శిశువుకూ విజయవంతంగా చికిత్స



డాక్టర్ ఎస్ ఆనంద్

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు నీళ్లు తక్కువగా తాగడం... ప్రాసెస్డ్ ఆహారం అధికంగా తీసుకుంటుండడంతో కిడ్నీల్లో రాళ్లు ఏర్పడుతున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి యూరాలజీ విభాగం తన ప్రాథమిక పరిశీలనలో గుర్తించింది. ఏడాదిన్నరలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఉస్మానియాకు చికిత్స కోసం వచ్చిన దాదాపు 109 మంది పిల్లలకు కిడ్నీలో రాళ్లను తొలగించారు. వీరంతా 12 ఏళ్లలోపు వారు. పిల్లలకు వారి వయసుకు అనుగుణంగా వివిధ ఆధునిక పద్ధతుల్లో చికిత్స అందించామని, దీనికి వారిని మూడు విభాగాలు (0-5, 6-10, 11-17)గా విభజించామని ఉస్మానియా యూరాలజిస్టు డాక్టర్ ఎస్.ఆనంద్ తెలిపారు. పిల్లలకు కూడా తక్కువ కోతతో శస్త్రచికిత్స చేయడం సురక్షితమేనని పేర్కొన్నారు. ప్యాకెట్లలో లభించే చిప్స్ లాంటి ప్రాసెస్డ్ ఫుడ్‌లో ఉప్పు ఎక్కువగా ఉండడం, దానికి తోడు తక్కువ నీళ్లు తాగుతుండడంతో పిల్లల కిడ్నీల్లో రాళ్లు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ అలవాట్ల వల్ల యూరిక్ యాసిడ్ పెరుగుతుందని, జీవక్రియలో సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అయిదారుగురు పిల్లల్లో రెండు కిడ్నీల్లో రాళ్లు ఏర్పడ్డాయన్నారు. చిన్నపిల్లలకు సర్జరీ చేయడం సవాళ్లతో కూడుకున్నదని, ఏడాదిలోపు శిశువులకు కూడా విజయవంతంగా చేయడం గర్వకారణమని ఆయన అన్నారు. ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా పిల్లలకు రాళ్లు ఏర్పడుతున్నట్లు గుర్తించామని డాక్టర్ ఎస్.ఆనంద్ తెలిపారు.

ఏడాది కాలంగా కుల బహిష్కరణ

ఇల్లెందు పోలీసులకు ఐదు ఆదివాసీ కుటుంబాల ఫిర్యాదు

ఇల్లెందు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని భూ వివాదానికి సంబంధించి కులపెద్దల మాటకు కట్టుబడి లేరన్న కారణంతో ఐదు ఆదివాసీ కుటుంబాలను సంవత్సరకాలంగా బహిష్కరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబాల వారిని వేడుకలకు పిలవకపోవడంతోపాటు ఆ కుటుంబాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా గ్రామస్థులు వెళ్లకుండా కట్టడి చేశారు. చివరకు వ్యవసాయ పనుల్లోనూ ఎవరూ సాయపడకుండా, వారి పొలాల్లోకి కూలికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో, బాధితులు మంగళవారం కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ముడిగె రాములు, ముడిగె సీతమ్మ, సుగుణ, లక్ష్మీనారాయణ తదితరులు సీపీఎం కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఇల్లెందు మండలం పాతపూసపల్లిలోని తమ ఎనిమిదిన్నర ఎకరాల పట్టా భూమిని వేరే వారికి ఇవ్వాలన్న గ్రామపెద్దల తీర్పును వ్యతిరేకించామన్న కారణంతో కుల బహిష్కరణ చేశారని తెలిపారు. గ్రామ పెద్దలైన సుర్దపాక వెంకట నారాయణ, వర్సా అవినాశ్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు ఏడాదిగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. తమ ఇళ్లలో మహిళ చనిపోతే దహనసంస్కారాలకు కూడా సహకరించలేదని వాపోయారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే ఎందుకిచ్చారంటూ అధికారులను బెదిరించారని బాధితులు ఆరోపించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దలైలామా ఆకాంక్ష

హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో టిబెటన్ల ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంతో మంది ప్రముఖులు దేశవిదేశాలనుంచి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమెరికా సహా పలు దేశాల ప్రతినిధులు, నాయకులు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులు, వేలాదిమంది టిబెటన్లు తరలివచ్చారు. ప్రేమ, కరుణ, సహనం ఇత్యాది సద్గుణాలకు ప్రతిరూపంగా దలైలామాను అభివర్ణిస్తూ 140కోట్లమంది భారతీయుల తరఫున ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియచేశారు. కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు, అరుణాచల్ ముఖ్యమంత్రి పెమాఖండూ ఇత్యాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యంలో, ఎప్పటిలాగానే చైనా మరోమారు తన అభ్యంతరాలను, ఆక్షేపణలను తెలియచేసింది. టిబెట్‌తో ముడివడిన వ్యవహారాలమీద చైనా వైఖరి సుస్పష్టం, బీజింగ్ అభిప్రాయాలను భారత్ కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సిందే అని చైనా వ్యాఖ్యానించింది. ఈ వేడుకలకు కొద్దిరోజుల ముందు, తన వారసుడి ఎంపికకు సంబంధించి దలైలామా వెలువరించిన సందేశం, దానిపై భారతప్రభుత్వ వైఖరి చైనాకు ఆగ్రహం కలిగించిన విషయం తెలిసిందే. చైనాతో ఇప్పుడున్న వివాదాలకు 15వ దలైలామా ఎంపిక అంశం కూడా తోడైరాబోయేరోజుల్లో ఇరుదేశాల మధ్యా మరింత దూరం, వేడీ పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కోరికలు కూడదని చెప్పిన బౌద్ధంలో ఈ వ్యాఖ్యలేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు గానీ, తాను మరో నలభైయేళ్ళు జీవించాలని దలైలామా అనుకుంటున్నారు. అవలోకితేశ్వరుడి ఆశీస్సులతో బౌద్ధానికీ, భక్తులకూ మరిన్ని దశాబ్దాలు సేవ చేసుకోవాలని కోరుకుంటున్నారు. గత ఏడాది కూడా ఆయన తన జీవితకాలం గురించి వ్యాఖ్యలు చేస్తూ, నూటపదేళ్ళకంటే ఎక్కువే జీవిస్తానన్నారు. కచ్చితంగా 113సంవత్సరాలు ఉంటానని ఐదేళ్ళక్రితమే మరో లెక్కగట్టారు. మొత్తానికి తాను అధికకాలం నిండుగా జీవించి బౌద్ధానికి సేవలందించాలన్నది అభిలాష. ఎక్కువకాలం జీవించాలని దేవుడినుంచి సంకేతాలందాయని కూడా అంటున్నందున, ఆయన అభీష్టం నెరవేరాలనే అంతా కోరుకుంటున్నారు. ఇక, తన ఆధ్యాత్మిక వారసత్వ ఎంపిక అంశాన్ని 90వ పుట్టినరోజు సందర్భంలో నిర్ణయిస్తానని పద్నాలుగు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీకి అనుగుణంగానే ఇటీవలి ఆయన ప్రకటన వెలువడిందనుకోవాలి. భారతదేశం కేంద్రంగా పదేళ్ళక్రితం ఆరంభించి, స్విట్జర్లాండ్‌లో రిజిస్టర్ చేసిన తన ట్రస్టుకే భావి దలైలామాను నిర్ణయించే అధికారం ఉంటుందని ఆయన విస్పష్టంగా ప్రకటించారు. ఇందులో వేరెవరిపాత్రకూ తావులేదని చైనాను జీరోచేశారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రకటనకోసమే ఎదురుచూస్తున్న చైనా సహజంగానే ఘాటుగా స్పందించింది. భావి దలైలామా చైనా ప్రధాన భూభాగంలో జన్మించినవాడై ఉండాలని, చైనా చట్టాలకు, నిబంధనలకు లోబడి లామా వారసత్వం కొనసాగాలని ఆ దేశం వెంటనే ప్రకటించింది. బంగారు కలశం నుంచి లాటరీతీసి లామాను ఎంపికచేసే రెండువందలయాభై ఏళ్ళనాటి విధానాన్ని చైనా ప్రతిపాదిస్తోంది.

తన మాతృభూమికోసం, ప్రజలకోసం చైనాతో సాగించిన ఏడుదశాబ్దాల పోరాట అనుభవాలతో దలైలామా ఈ ఏడాదిమార్చిలో విడుదల చేసిన గ్రంథంలో, తన పునర్జన్మ చైనా ప్రధాన భూభాగానికి ఆవల జరుగుతుందని తేల్చేశారు. తద్వారా, చైనా భావి ఎంపికని వీసమెత్తు విలువలేనిదిగా మార్చేశారు. 1995లో ఆయన తన తరువాతి స్థానమైన పంచన్ లామాగా నియమించిన ఆరేళ్ళబాలుడిని చైనా ముప్పయేళ్ళుగా టిబెటన్లకు కనిపించకుండా చేసింది. పోటీగా చైనా నియమించిన వ్యక్తికి టిబెట్‌లో ఏమాత్రం గౌరవాభిమానాలు లేవు. ఈయన టిబెట్‌లో కాక, బీజింగ్‌లో ఉంటూ, అప్పుడప్పుడు వెళ్ళివస్తూ చైనాపెద్దల ఆదేశాలకు అనుగుణంగా టిబెట్‌ను ఆధ్యాత్మికంగా విలీనం చేసే పనిలో ఉన్నారు. ఈయనను పీఠాధిపతిగా చైనా ప్రతిష్ఠించబోతున్నదని వార్తలు వస్తున్న తరుణంలో వ్యవహారం ముదిరిపాకన పడుతున్నదని అర్థం. పరిణామాలు ఎలా మారినా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న టిబెటన్ల ఆధ్యాత్మిక కేంద్రంగా హిమాచల్‌లోని ధర్మశాల కొనసాగబోతున్నది. ప్రస్తుతానికి భారత ప్రభుత్వం ఈ వివాదంమీద ఎక్కువగా మాట్లాడకపోయినప్పటికీ, అవసరమైన తరుణంలో అది ఏ మాత్రం వెనక్కుతగ్గదని ఆశించాలి.

విభిన్న భాషలు, వివిధ సంస్కృతులు మన విశిష్టత. భారతీయులు స్వదేశంలో ఉన్నా, విదేశాలలో ఉన్నా తమ మాతృభాషతో పాటు అనుసంధాన భాషగా హిందీని స్వచ్ఛందంగా నేర్చుకోవాలి. సంకుచిత రాజకీయ కారణాలకు అతీతంగా జాతి నిర్మాణంలో ఈ భాషా బంధం బలపడాలి.

జాతి నిర్మాణంలో హిందీ బంధం

జీవనోపాధికి కన్న ఊరు, మాతృదేశం విడిచి సుదూర సీమలకు వెళ్లిన తర్వాత తల్లి భాష, స్వీయ జాతీయ సంస్కృతి ప్రాధాన్యం తెలిసివస్తుంది. ప్రపంచంలో 193 దేశాలున్నాయి. ఇంచుమించు ఈ సమస్త దేశాల వారు గల్ఫ్ రాజ్యాలలో, ముఖ్యంగా దుబాయిలో ఉంటున్నారు. ఒక్క భారతీయులు మినహా ఇతర జాతీయులు అందరూ తమ తమ భాషలలో పరస్పరం సంభాషించుకుంటారు. ఇటువంటి అవకాశం భారతీయులకు లేదు.

హిందీ లేదా ఆంగ్లం రాని ఒక భారతీయుడు తన భాష తెలియని తోటి స్వదేశస్థుడితో అరబ్బీ భాషలో మాత్రమే మాట్లాడగలుగుతాడు. చివరకు తమ ఫిర్యాదులతో భారతీయ దౌత్య కార్యాలయాలకు వచ్చే దక్షిణ భారత ప్రవాస కార్మికులు

గల్ఫ్ లేఖ

అనేక మంది అరబ్బీ భాషలోనే తమ గోడు చెప్పుకోవడం కద్దు. క్రింది స్థాయి దౌత్య సిబ్బంది అరబ్బీ నుంచి హిందీ భాషలోకి అనువదించి అధికారులకు వివరిస్తారు. తెలుగు ప్రవాసులు లేదా ఉత్తరాది వారు ఉదయం వేళ అల్పాహారానికై మలయాళీలు నిర్వహించే హోటల్‌కు వెళ్ళి అరబ్బీలో ఆర్డరు ఇస్తారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన మహిళ ఒకరు తెలుగు మినహా మరే భాష రాకపోవడంతో సుమారు ఒక సంవత్సరం జైలులో మగ్గిపోవలసివచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అలోక్ తివారీ సౌదీ అరేబియాలోని ఒక విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు. ఆయనకు తెలుగు మిత్రులు ఎక్కువ. ఒకసారి ఆయన కుటుంబసమేతంగా తెలంగాణ పర్యటనకు వెళ్లారు. అయితే భాషాపరమైన ఇబ్బందితో అర్ధాంతరంగా ఆయన తన పర్యటనను ముగించుకోవలసివచ్చింది. బహుళ జాతి సంస్థలలో పనిచేసే నానా దేశాల వారు మధ్యాహ్న భోజన విరామంలో ఆయా జాతీయులు అందరూ కలిసి ఒక్కచోట తమ తమ భాషలలో మాట్లాడుకొంటుండగా, భారతీయులు మాత్రం ప్రాంతాలవారీగా విడిపోతుంటారు. మలయాళీలు ఒక బృందంగా, ఉర్దూ మాట్లాడే హైదరాబాదీలు



మరో సమూహంగా విడిపోతుంటారు. హిందీ భాష రాని కారణంగా ఐ.టి నిష్ణాతులైన తెలుగు ఇంజినీర్లు తాము పని చేస్తున్న సంస్థలలో తోటి భారతీయులతో కలివిడిగా ఉండలేకపోతున్నారు. ఇది వారిని సామాజికంగా ఏకాకులను చేస్తోంది.

ఈ నేపథ్యంలో హిందీ ప్రాధాన్యాన్ని తెలుసుకోవల్సిన ఆవశ్యకత ఉంది. విశాల భారతావని విభిన్న భాషలు, వైవిధ్య భరిత జీవనరీతులకు నెలవు. జాతీయ భాషా వివాదంలో మొదటి నుంచి హిందీని ఆ భాషేతరులపై బలవంతంగా రుద్దుతున్న ఒక అన్య భాషగా చిత్రీకరిస్తున్నారు. తమ భావజాల వ్యాప్తి కొరకు ఒక దేశం–ఒకే విధానంను అనుసరిస్తున్న భారతీయ జనతా పార్టీకి హిందీ మాట్లాడే రాష్ట్రాలలో రాజకీయ అధిపత్యం ఉన్నది. హిందీయేతర రాష్ట్రాలలో ఆ పార్టీ ప్రాబల్యం అంతగా లేదు. నూతన జాతీయ విద్యావిధానం క్రింద హిందీని వ్యూహాత్మకంగా అమలుపరుస్తున్నారనే బలమైన అభిప్రాయం నెలకొంటున్న నేపథ్యంలో మరాఠీ భాషా రాష్ట్రమైన మహారాష్ట్రలో హిందీ అమలు విషయమై ఉత్తర్వు జారీ చేయడం, ఉపసంహరించుకోవడం రెండూ జరిగాయి. ఇప్పటికే తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం హిందీ అమలును పూర్తిగా రాజకీయ కోణం నుండి ఎదుర్కొంటూ బీజేపీని ఇరకాటంలో పెడుతోంది. తాము అధికారంలో ఉన్న మహారాష్ట్రలో సైతం హిందీకి వ్యతిరేకత రావడం బీజేపీ ప్రాబల్యానికి విఘాతమని చెప్పవచ్చు. అంత మాత్రాన హిందీ భాష వ్యాప్తికి బీజేపీ తన కృషిని విరమిస్తుందనుకోవడం పొరపాటు. అలాగని హిందీని వ్యతిరేకించడం కూడా పొరపాటే. ఒక సువిశాల దేశంలోని అనేక ప్రాంతాలలో నలుగురికి తెలిసే భాషను నెర్చుకోవడంలో తప్పేమీ లేదు. నేర్చుకోవాలి కూడా. పూర్తిగా అరబ్బీ దేశమైన సౌదీ అరేబియా తమ విద్యార్థులకు చైనీస్ భాషను బోధిస్తోంది. మహమ్మద్ రఫీ మధుర గీతాలను వినే మనం హిందీని తూర్పారపట్టడం ఏమిటి? దీన్ని మానుకోవాలి.

ఒక దేశం– ఒకే భాష అనేది ఒక విఫల ప్రయోగం. ప్రఖ్యాత ఆంగ్ల రచయిత జార్జి బెర్నార్డ్ షా వ్యాఖ్యానించినట్లుగా అమెరికా, బ్రిటన్ రెండూ ఆంగ్లం మాట్లాడే రాజ్యాలయినా ఒకే జాతికి చెందినవి కావు. అలాగని అరబ్బులు అందరిదీ ఒకే భాష, ఒకే సంస్కృతి అయినా 22 దేశాలుగా విడిపోయి ఉన్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం మొదలు మహారాష్ట్ర–కర్ణాటక సరిహద్దు వివాదం దాకా ఎన్నో ఘర్షణలు భాషతో ముడిపడి ఉన్నాయి. తెలుగు భాష ఒక్కటయినా, యాస అనేది ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిందనేది మరిచిపోకూడదు. విభిన్న భాషలు, వివిధ సంస్కృతులు మన విశిష్టత. భిన్నత్వంలో ఏకత్వానికి భారత దేశమే యావత్ ప్రపంచానికి మార్గదర్శి. భారతీయులు స్వదేశంలో ఉన్నా, విదేశాలలో ఉన్నా తమ మాతృభాషతో పాటు భారతీయ అనుసంధాన భాషగా హిందీని స్వచ్ఛందంగా నేర్చుకోవడానికి ముందుకు రావాలి. సంకుచిత రాజకీయ కారణాలకు అతీతంగా జాతి నిర్మాణంలో ఈ భాషాబంధం బలపడాలి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మూలాలు విస్మరిస్తే మనుగడ కష్టం!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

జాతీయ పార్టీలు– భారత జాతీయ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ– రెండూ తమ రూపురేఖల్ని దిద్దుకునే క్రమాన్ని వేగవంతం చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీలో వివిధ రాష్ట్రాల అధ్యక్షుల నియామకంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ముద్ర స్పష్టంగా కనబడుతోంది. సంస్థాగత నియామకాల్లో మొదటి నుంచీ సిద్ధాంతాలకు కట్టుబడినవారు, అధికారంలో లేకపోయినా పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్న విషయమై సంఘ్, బీజేపీల మధ్య ఒక అవగాహన ఏర్పడినట్లు జరుగుతోన్న పరిణామాలు విశదం చేస్తున్నాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, ఏబీవీపీ, యువ మోర్చాలతో బలమైన సంబంధం ఉన్న ఎన్.రామచందర్ రావు, మాధవ్‌లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడమే ఇందుకు నిదర్శనం. మాధవ్ తండ్రి పి.వి. చలపతిరావు నిబద్ధ సంఘీయుడు. పదేళ్ల వయస్సు నుంచే ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన చరిత్ర ఆయనకు ఉన్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా, ఎమ్ఎల్సీగా కూడా ఆయన పనిచేశారు రామచందర్ రావుకు అలాంటి నేపథ్యం ఏమీ లేదు. ఇంటా, బయటా ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ విద్యార్థి దశనుంచే ఒక భావజాలానికి కట్టుబడి రకరకాల దాడులను ఎదుర్కొని నిలబడిన చరిత్ర ఆయనది. ఏపీ, తెలంగాణలోనే కాదు, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, హిమాచల్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో సంఘ్ నేపథ్యం ఉన్నవారికే పార్టీ పగ్గాలు అందించారు. దేశంలో హిందుత్వ భావజాలం విస్తరిస్తున్నందువల్ల వ్యక్తులు, కులాలకు అతీతంగా భారతీయ జనతా పార్టీని ఒక సైద్ధాంతిక పార్టీగా బలోపేతం చేయగలమనే విశ్వాసం ఆ పార్టీ నేతల్లోను, సంఘ్ పెద్దల్లోనూ కనబడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశంలో నలుమూలలా హిందూ సమ్మేళనాలు ఏర్పాటు చేసి హిందువులను సంఘటితం చేయాలని గత వారం ఢిల్లీలో జరిగిన మూడు రోజుల ప్రాంత ప్రచారక్ సమావేశం పిలుపునిచ్చింది.

సామాజిక, రాజకీయ సమీకరణాలకు భిన్నంగా మత ప్రాతిపదికగా ఒక పార్టీని పటిష్ఠం చేయడం సాధ్యమవుతుందా? ప్రజల్లో విస్తృత ఆమోదయోగ్యత ఉంటుందా? ఇతర రాజకీయ పార్టీల నుంచి బీజేపీలో చేరినవారు అందులో ఇమడగలుగుతారా అన్న చర్చ భారతీయ జనతా పార్టీలో ఎప్పటి నుంచో జరుగుతోంది. బీజేపీలో చేరేందుకు ఒకప్పుడు తెలుగుదేశం మాజీ నేత పి.ఉపేంద్ర ఆసక్తి చూపినప్పుడు 'మా పార్టీలో నీవు ఇమడగలవా ఆలోచించుకో' అని మాజీ ప్రధాని వాజపేయి హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉపేంద్ర తన ఆత్మకథలో రాసుకున్నారు. వాజపేయి మాటలను రుజువు చేస్తూ ఆయన ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అయితే అప్పటి బీజేపీ వేరు, ఇప్పటి బీజేపీ వేరు అని వాదించేవారున్నారు.

బీజేపీ హిందుత్వ భావజాలానికి భిన్నంగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం అజెండాగా ముందుకు సాగుతోంది. తెలంగాణలో ఇటీవల మంత్రివర్గ విస్తరణలో మాల, మాదిగ, బీసీ నేపథ్యం ఉన్న వారికి అవకాశం కల్పించారు. తెలంగాణ, బిహార్, జార్ఖండ్, ఒడిషా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, హరియాణాలలో దళిత లేదా బీసీ వర్గాలకు చెందిన వారినే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియమిస్తే చత్తీస్‌గఢ్ పార్టీ సారథ్యాన్ని ఆదివాసీకి అప్పగించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన భూపేష్ బఘేల్, సచిన్ పైలట్‌లను పార్టీ ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు 13 మందిలో ఆరుగురు దళిత, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందినవారు. దీన్ని బట్టి చూస్తే సాధ్యమైనంత మేరకు పార్టీలో అగ్రవర్ణాల సంఖ్యను తగ్గిస్తూ పార్టీని సైద్ధాంతికంగా, సంస్థాగతంగా సామాజిక న్యాయానికి ప్రతీకగా మార్చాలని రాహుల్ ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్‌ను బహుజనుల పార్టీగా, బీజేపీని అగ్రవర్ణాల పార్టీగా చిత్రించేందుకు ఆయన అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు. కులగణనను ఆయన ఒక ప్రచారాంశంగా మార్చారు. రాజ్యాంగానికీ, మనుస్మృతికీ మధ్య వైరుధ్యంపై చర్చను రేకెత్తిస్తున్నారు. కాని ఈ ప్రయోగం విజయవంతం అవుతుందా? బీజేపీకి, కాంగ్రెస్‌కూ మధ్య సైద్ధాంతిక వైరుధ్యం ఉన్నదని ప్రజలు, ముఖ్యంగా సామాన్యులు ఎంతవరకు భావిస్తున్నారు? దళితులను, బలహీన వర్గాలను పార్టీ పోస్టుల్లో నియమించినంత మాత్రాన అగ్రవర్ణాలు, పలుకుబడిగలిగిన వారి ప్రభావం లేకుండా పోతుందా? అన్న ప్రశ్నలు పార్టీ నేతల్లో తచ్చాడుతున్నాయి.

ఏది ఏమైనా భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు రెండు సైద్ధాంతిక ఆలోచనా విధానాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నించడం ఆహ్వానించదగిన పరిణామం. కష్టపడకుండా వచ్చిన సంపద, వ్యక్తిత్వం లేని జ్ఞానం, నైతికత లేని వ్యాపారం, విలువల్లేని రాజకీయాలు మంచివి కావని ఒక మేధావి అన్నారు. ఈ రెండు పార్టీలు తమ ఆర్థిక, సామాజిక విధానాలను ప్రజలు మరింత స్పష్టంగా అర్థం చేసుకునే విధంగా అజెండాలను రూపొందించగలగడం అవసరం. చాలా కాలంగా రెండు పార్టీల ఆర్థిక విధానాలకు పెద్దగా తేడా లేదనే అభిప్రాయం ప్రజల్లో నెలకొన్నది. కాంగ్రెస్ అనుసరించిన ఆర్థిక విధానాలనే తాము మరింత వేగవంతంగా అమలు చేశామని భారతీయ జనతా పార్టీ నేతలు చెప్పుకున్నారు. ఆర్థిక విధానాల విషయంలోనే కాదు, అనేక ఇతర అంశాలలో కూడా కాంగ్రెస్ అనుసరించిన పంథాకు, బీజేపీ అనుసరిస్తున్న పంథాకు తేడా లేదని చెప్పేందుకు ఆస్కారం కలిగింది. తమ అజెండాల భిన్నత్వాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా జాతీయ పార్టీలు రెండూ మరింత బలంగా ప్రయత్నిస్తే వచ్చే ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారుతాయనడంలో సందేహం లేదు.

జాతీయ పార్టీల తీరుతెన్నులు ఇలా ఉంటే అనేక ఇతర పార్టీలు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలకు అసలు సైద్ధాంతిక స్పష్టత ఉన్నదా అని అనుమానం కలుగుతోంది. మొదటి ఐదు సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతానికి పైగా ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ బలహీనపడ్డ తర్వాతే దేశంలో ప్రాంతీయ పార్టీల ఎదుగుదలకు ఆస్కారమేర్పడింది. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీల కూటమి చేతుల్లో పరాజయం పాలైంది. 1984 తర్వాత కాంగ్రెస్ మెజారిటీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేని దుస్థితి ఎదుర్కొంటూ వచ్చింది. 1998 నాటికి 177 పార్టీలు రంగంలో ఉన్నాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 19 పార్టీల కలయికతో ఏర్పడితే



కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును ప్రాంతీయ పార్టీలకే కాక, బీజేపీకి సైతం కోల్పోతూ బలహీనపడింది. వివిధ సామాజిక వర్గాల ప్రయోజనాలను పరిష్కరించగల నాయకత్వాన్ని అందించలేకపోవడం వల్లే కాంగ్రెస్ ప్రాభవం అడుగంటింది. సోషలిజం, లౌకికవాదం వంటి మూలభావనలను విడనాడడం వల్లే తన సంప్రదాయ ఓటు బ్యాంకును కాంగ్రెస్ కోల్పోతూ వచ్చింది. ప్రాంతీయ పార్టీలు తమ సంస్థాపక ఆశయాలకు తిలోదకాలు ఇవ్వడం వల్లే అవి ఇప్పుడు అస్తిత్వ పరీక్ష నెదుర్కొంటున్నాయి.

1998లో వాజపేయి నేతృత్వంలో 23 పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పాటయింది. ప్రాంతీయ వాదంతో పాటు ప్రాంతీయ పార్టీలు బలోపేతమయ్యాయి. వెనుకబాటుతనం, అస్తిత్వ రాజకీయాలు వంటి వాటికి ప్రజలు ప్రాధాన్యతనిచ్చారు.

కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును ప్రాంతీయ పార్టీలకే కాక, బీజేపీకి కూడా హస్తగతం చేస్తూ బలహీనపడింది. దేశ ప్రజానీకంలోని వివిధ వర్గాల ప్రయోజనాలను పరిష్కరించగల నాయకత్వాన్ని అందించలేకపోవడం వల్లే కాంగ్రెస్ బలహీనపడింది. సోషలిజం, లౌకికవాదం వంటి తన మూలభావనలకు దూరంగా పోవడం వల్లే కాంగ్రెస్ తన సంప్రదాయ ఓటు బ్యాంకును కోల్పోతూ వచ్చింది. తన ప్రాభవాన్ని మళ్లీ పునరుద్ధరించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. విచిత్రమేమంటే ప్రాంతీయ పార్టీలు కూడా తమ మూల భావనలకు దూరం పోవడం వల్లే అస్తిత్వ పరీక్షలో పడ్డాయనడంలో సందేహం లేదు. ఇవాళ డీఎంకే, అన్నాడీఎంకే, బీజేడీ, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, బీఆర్ఎస్‌తో పాటు అనేక ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షలో ఉన్నాయి. డీఎంకే వచ్చే ఎన్నికల్లో తన అస్తిత్వాన్ని, ప్రాంతీయ ప్రత్యేకతను నిలబెట్టుకునేందుకు రకరకాల ప్రయోగాలు చేసే పరిస్థితిలో చిక్కుకుంది. జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే స్వంతంగా తన కాళ్లపై నిలబడలేక బీజేపీతో చేతులు కలపాల్సి వస్తోంది. ఒకప్పటి ద్రవిడ అస్తిత్వం ఇవాళ తమిళనాడులో ప్రశ్నార్థకమైన దశలో ఉన్నది. 1997లో ఉనికిలోకి వచ్చిన బిజూ జనతాదళ్‌ను ఒడిషా అస్తిత్వానికి ప్రతీకగా ప్రజలు గుర్తించకపోవడంతో 18వ లోక్‌సభలో ఆ పార్టీ ఒక్క సీటు కూడా పొందలేకపోయింది. దళితుల స్వరంగా నిలిచిన బహుజన్ సమాజ్ పార్టీని ఇప్పుడు దళితులే తమ పార్టీగా భావించకపోవడంతో యూపీ రాజకీయాల్లో పూర్తిగా పట్టుకోల్పోయింది. అదే పరిస్థితి బిహార్‌లో లోక్ జన్‌శక్తి ఎదుర్కొంటోంది. హరియాణా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన లోక్‌దళ్, తన వ్యవస్థాపకుడు చరణ్‌సింగ్ ఆదర్శాలను కొనసాగించలేక ముక్కలు చెక్కలైంది. మహారాష్ట్ర ప్రజలు ఒకప్పుడు శివసేన పార్టీని ప్రాంతీయాభిమానానికి, దుందుడుకు హిందూత్వకు ప్రతీకగా భావించేవారు. కాని ఇప్పుడు ఈ పార్టీ కూడా తన సైద్ధాంతిక పునాది కోల్పోవడంతో పాటు అవకాశవాద రాజకీయాల కారణంగా చీలిపోయింది.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి దాదాపు పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి కూడా అనేక ప్రాంతీయ పార్టీల మాదిరి తన మూల భావనలకు దూరంగా వైదొలగడమే ప్రస్తుతం అస్తిత్వ పరీక్ష నెదుర్కోవడానికి కారణం. తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వానికి చిహ్నంగా భావించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఇప్పుడెక్కడ ఉన్నది? దేశంలో కీలక పాత్ర పోషించగలమన్న అత్యాశతో పార్టీ పేరు మార్చుకుని, ఢిల్లీలో భవనాలను ప్రారంభించినంత మాత్రాన జాతీయ స్థాయి గౌరవం లభిస్తుందా? కోట్లాది ప్రజల మనోభావాలకు ప్రతీకగా మారాల్సిన ఒక పార్టీ మాత్రమే కాదు మొత్తం రాష్ట్రం ఒకరిద్దరు వ్యక్తుల ఇష్టారాజ్యంగా మారిన క్రమాన్ని, ప్రజాస్వామిక విలువలకు తావులేని పరిస్థితులను, మనం చూశాం. కుటుంబ సభ్యులందరూ 'ప్రజా సేవ' కోసం తాపత్రయపడిన తీరునూ గమనించాం. అధికారంలో కొద్ది రోజులు లేనంత మాత్రాన అసహనం. అరాచకత్వం, అభద్రత, అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతున్న బీఆర్ఎస్ ఒకప్పటి టీఆర్ఎస్‌లా ప్రజల మద్దతును సాధించుకుని, అధికారానికి అర్హత సంపాదించగలుగుతుందా లేక అంతరిస్తున్న ప్రాంతీయ పార్టీల జాబితాలో చేరుతుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రజావ్యతిరేక విధానాలకు ప్రతిఘటన

నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయి. కార్మికుల వేతనాలు 2017–18 స్థాయి కంటే పడిపోయాయి. మరొక వైపు, కార్పొరేట్ కుటుంబాల ఆస్తులు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి నాలుగు కార్మిక కోడ్‌లను అమలుచేయాలని ప్రయత్నించారు. కార్మికులు పోరాడి, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులన్నిటినీ రద్దు చేయాలని భావించారు. రాజ్యాంగ స్ఫూర్తినీ, సుప్రీంకోర్టు తీర్పులనూ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలన్నిటినీ భూస్థాపితం చేయ సంకల్పించారు. కార్మిక కోడ్‌లు అమలులోకి వస్తే ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనాలు, సామాజిక భద్రత, సంఘం పెట్టుకునే హక్కు, సంఘాల రిజిస్ట్రేషన్లు–గుర్తింపు, సమిష్టి బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆందోళనలు చేసే హక్కులు అన్నీ తీవ్రమైన ప్రమాదంలో పడిపోతాయి.



దేశంలో మొత్తం పౌరహక్కుల పైనే తీవ్రమైన దాడి జరుగుతోంది. కార్మిక వర్గ హక్కులపై జరుగుతున్న దాడిని దీనిలో భాగంగానే చూడాలి. యూఏపీఏ, పీఎంఎల్ఏ, బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) చట్టాలను పౌర హక్కులపై దాడికి ప్రయోగిస్తున్నారు. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111 ప్రకారం, కార్మికులు సంఘటితంగా తమ హక్కులను డిమాండ్ చేస్తే, దాన్ని సంఘటిత నేరంగా పరిగణించి, తీవ్రమైన జైలుశిక్షలు, పెనాల్టీలు విధించవచ్చు. రైతాంగ హక్కులపై ప్రయోగించటానికి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారు. రైతు సంఘాల సుదీర్ఘ, సమరశీల పోరాటాల ఫలితంగా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, మరో రూపంలో ఆ రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పంటల గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని రైతాంగం చేస్తున్న డిమాండ్ పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ ఈ చర్యలన్నీ, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే! చట్టాల సంస్కరణలతో పాటు, అనేక భారాలు వేసి, ప్రజల నుంచి కొల్లగొట్టి వసూలు చేస్తున్న పన్నుల నుంచి ఇటీవల కార్పొరేట్లకు మరికొన్ని ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. కానీ కార్మికులకు మాత్రం ఎటువంటి ప్రోత్సాహకాలు ఉండవు. పాతపెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) తిరిగి ప్రవేశపెట్టాలని లక్షలాదిమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. కానీ పాలకులు పట్టించుకోవటంలేదు. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం(1995) కింద కనీస పెన్షన్ పెంచాలనీ, ఈ పథకాన్ని మెరుగు పరచాలన్న డిమాండునూ పట్టించుకోవడం లేదు.

బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించివేస్తూ, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థల విచ్చలవిడి ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారు. ఎల్ఐసీలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించారు. తపాలారంగంలో ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని దెబ్బతీసే విధంగా పోస్టల్ చట్టానికి సవరణలు తీసుకొచ్చారు. కీలకమైన, దేశ భద్రతా అంశాలకు వాటిల్లబోయే ముప్పును కూడా పట్టించుకోవడం లేదు. రక్షణ, అంతరిక్షం, బ్యాంకులు, రైల్వే, పోస్టల్, విద్యుత్, పెట్రోలియం, జనరల్ ఇన్సూరెన్స్, బొగ్గు, ఉక్కు, విద్యుత్, స్పెక్ట్రం, భూగర్భంలోని ఖనిజాలు, సర్వం ప్రైవేట్ మయం చేస్తున్నారు.

ప్రభుత్వం, యాజమాన్యాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించే అధికారిక త్రైపాక్షిక వేదిక ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 1942 నుంచి ఇప్పటికి 46 సమావేశాలు జరిగాయి. చివరి సమావేశం 2015లో జరిగింది. గత 10సంవత్సరాలుగా, కేంద్ర కార్మిక సంఘాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, కేంద్ర ప్రభుత్వం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం జరపటం లేదు.

ఈ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. దేశ సరిహద్దులలో నెలకొన్న పరిస్థితుల వల్ల మే నెల 20న జరగాల్సిన సమ్మెను జూలై 9కి వాయిదా వేశారు. నాలుగు కార్మిక కోడ్‌ల రద్దుతో పాటు, రూ.26,000 కనీస వేతనం, 8 గంటల పనిదినం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆశా, అంగన్వాడి తదితర స్కీం వర్కర్స్ రెగ్యులరైజేషన్, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశ నిర్వహణ, మరికొన్ని డిమాండ్ల సాధన కోసం ఈ సమ్మె జరుగుతున్నది. సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఈ కార్యాచరణలో పాల్గొనాలని నిర్ణయించటమే గాక, అదే రోజున గ్రామీణ బంద్‌కు పిలుపునివ్వటం ముదావహం.

● వెలుగూరి రాధాకృష్ణమూర్తి
ఏఐటీయూసీ నాయకులు

ఏబీవీపీ నుంచి ఎదిగినవారెందరో...

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేడు మన దేశంలో క్రియాశీలమైన విద్యార్థి సంఘం. దేశంలోని యువతను సంఘటితపరిచి వారిలో దేశభక్తి, దేశాభివృద్ధి పట్ల నిష్ఠను పాదుకొల్పడం, వారిలో 'జ్ఞానం, శీలం, ఏకత'లే ధ్యేయంగా ఏబీవీపీ పనిచేస్తోంది. బాల్‌రాజ్ మధూక్, యశ్వంతరావు కేల్కర్, దత్తాజీ డిండోల్కర్, సమైక్య ఆంధ్రప్రదేశ్ నుంచి జనమంచి గౌరీశంకర్ లాంటి ఎందరో మహామహులు ఏబీవీపీకి పునాదులు వేశారు. ఏబీవీపీ 1948లోనే ఢిల్లీ యూనివర్సిటీలో అతికొద్ది మందితో తన ప్రస్థానాన్ని కొనసాగించినా, 1949 జూలై 9 నుంచి అధికారికంగా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నేటితో 76 వసంతాలు పూర్తి చేసుకుని 77వ అమృతోత్సవ సంబరాల్లోకి ఏబీవీపీ అడుగుపెడుతోంది.

ఏబీవీపీ నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి, తర్వాత జాతీయ స్థాయిలో గొప్ప నేతలుగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వరకూ అలా ఎదిగినవారే. ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇలా ఏబీవీపీ నుంచి నాయకులుగా ఎదిగినవారు చాలా మందే ఉన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఇద్దరూ తమ రాజకీయ ప్రస్థానాన్ని ఏబీవీపీ నుంచే ప్రారంభించారు.



ఎమర్జెన్సీ కాలంలో ఏబీవీపీ కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో వామపక్షవాదులు, నక్సల్స్ దాడులకు పాల్పడ్డారు. జేఎన్‌టీయూ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ వంటి చోట్ల ఎంతో మంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఏబీవీపీ దేశభక్తి, నిబద్ధతతో ముందుకు సాగుతోంది. సభ్యత్వం, దేశవ్యాప్తంగా వివిధ నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా ప్రపంచంలోనే నెంబర్ 1 స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా ఏబీవీపీ గుర్తింపు పొందింది.

ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (SFD) ఫోరం ద్వారా విద్యార్థులకు ప్రకృతిపై ప్రేమను పెంచి, జల్, జంగల్, జన్వర్, జన్, జమీన్‌ల పరిరక్షణకు నేడు దేశవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని 'వృక్ష మిత్ర' అభియాన్ ద్వారా నిర్వహిస్తున్నది. రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికులు, గల్ఫ్ కార్మికులు, సంచార జాతులపై సర్వే, ఫ్లోరోసిస్ బాధితుల కోసం సర్వే నిర్వహించి వారి సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రధానపాత్ర పోషిస్తోంది.

థింక్ ఇండియా, వరల్డ్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టూడెంట్స్ & యూత్, మెడికల్ & డెంటల్ విద్యార్థుల ఫోరం వంటి మొత్తం 15 ఫోరమ్స్ ద్వారా పలు కోర్సుల్లోని విద్యార్థుల అభ్యున్నతికి ఏబీవీపీ కృషి సలుపుతోంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, భాషా, జీవన వైవిధ్యాన్ని పరిచయం చేయడం కోసం ఏబీవీపీ SEILను చేపట్టింది.

1975లో ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ఏబీవీపీ క్రియాశీలక పాత్ర పోషించింది. చలో అస్సాం కార్యక్రమం ద్వారా 'సేవ్ అస్సాం సేవ్ ఇండియా' పేరుతో లాయర్స్ గ్రౌండ్స్‌లో సత్యాగ్రహం చేసింది. 1983 నుంచి బంగ్లాదేశ్ చొరబాటుదార్లకు వ్యతిరేకంగా ఏబీవీపీ నిరంతరం జనజాగరణ, ఆందోళన నిర్వహిస్తూనే ఉంది. ఏబీవీపీ పోరాట ఫలితమే 'నూతన జాతీయ విద్యా విధానం'. ఓటు హక్కు వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషించింది.

కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచింది. బ్లడ్ డొనేషన్ క్యాంపులు, చెట్లు నాటడం, స్టడీ సర్కిల్, ఉచిత కోచింగ్ సెంటర్స్ లాంటివి ఏర్పాటు చేయడం, BC, SC, ST విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తోంది. దేశ నాయకులను స్మరిస్తూ వివేకానంద, డా.బీ.ఆర్. అంబేడ్కర్ వంటి వారి సంస్మరణ దినాలను ఘనంగా నిర్వహిస్తోంది. నేటి విద్యార్థి రేపటి పౌరుడు అన్నది గత నినాదం. నేటి విద్యార్థి నేటి పౌరుడే అనే స్ఫూర్తితో ప్రస్తుతం సమాజంలోని అనేక సమస్యలపై అవగాహనతో స్పందిస్తూ, పరిష్కారాలను చూపే విధంగా విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే విద్యార్థి పరిషత్ ధ్యేయం. విద్యార్థిని టెక్నాలజీ, వైద్య, సామాజిక, కళా మొదలైన రంగాల్లో సమాజంతో మమేకం చేస్తూ ప్రత్యక్షంగా అనుభూతి చెందేలా వారిలో ఎటువంటి తారతమ్య బేదాలు లేకుండా, ఏకాత్మ భావనను పెంపొందించే విధంగా ఏబీవీపీ కృషి చేస్తోంది.

■ జీవన్
ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు


కేసముద్రం బహిరంగసభలో అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు


సోమ్లా తండాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

సంక్షేమ పథకాల్లో తెలంగాణ టాప్

- ప్రజా ప్రభుత్వ పాలనలో సంతోషంగా ప్రతీ కుటుంబం
- దేశంలో ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్
- గత ప్రభుత్వ అప్పులు చెల్లిస్తూనే ఎన్నికల హామీల అమలు
- సీఎం సహా మంత్రులం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో రూ.400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సోమ్లాతండా, కేసముద్రంలో హోరెత్తిన బహిరంగ సభలు
- డిప్యూటీ సీఎం సహా ఆరుగురు మంత్రుల రాక
- అంతా తానై నడిపించిన సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి


కేసముద్రం బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహబూబాబాద్/కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణ రైజింగ్ వైపే చూస్తు న్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా సోమ్లా తండాలో రూ.100 కోట్లు, కేసముద్రం పట్టణంలో రూ.300 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు మంగళవారం మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అధ్యక్షతన ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సభల్లో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడంతో సంతోషంగా ఉన్నాయని చెప్పారు. మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఈ నెల 12 నుంచి డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం రూ.8 వేల కోట్లతో రాజీవ్ యువ వికాస పథకాన్ని ఉత్సవంలా చేపడుతామని స్పష్టం చేశారు.

ప్రజల గురించి ఆలోచించే ఏకైక పార్టీ

దేశంలో ప్రజల గూర్చి ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో (మిగతా 6వ పేజీలో...)

హోరెత్తిన కాంగ్రెస్ సభలు

- మంత్రుల ప్రసంగాలతో ఎన్నికల జోష్
- పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం
- స్థానిక సమరానికి శంఖారావం
- సోమ్లాతండా, కేసముద్రం సభలకు భారీ జనసమీకరణ

7

మా ప్రభుత్వ పథకాలు చరిత్రాత్మకమైనవి...

- ప్రజల అభిమానంతోనే అధికారంలోకి వచ్చాం
- కేసముద్రం సర్వతోముఖాభివృద్ధికి కృషి
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ఆశీర్వదించాలి
- సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అప్పుల తెలంగాణలో పథకాలు అమలు చేయడం ఆషామాషీ కాదని, చరిత్రలో ఎవరూ అమలు చేయని విధంగా పథకాలు రూపొందించి పేదలకు అందిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో మహబూబాబాద్‌తోపాటు కేసముద్రాన్ని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు (మిగతా 6వ పేజీలో...)


పిట్టలోనిగూడెంలో హత్యకు గురైన కనకయ్య (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ప్రాణ రక్షణ కోసం సివంగులయ్యారు...

- తమను చంపబోయిన తాగుబోతు భర్తను కడతేర్చిన భార్యలు
- 50 రోజుల కిందటే మొదటి భార్య తల్లిని కడతేర్చి మళ్లీ వచ్చిన కిరాతకుడు
- గొడ్డలితో దాడికి యత్నిస్తుండగా అడ్డుకొని తిరగబడిన భార్యలు
- తలపై గాయాలతో మృతి
- ఇద్దరు భార్యల్లో ఒకరు మైనర్
- జనగామ జిల్లాలో విషాద ఘటన


హత్యకు ఉపయోగించిన గొడ్డలితో పెద్దభార్య చొక్కమ్మ

లింగాల ఘణపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అతడు మద్యానికి బానిసై మానవ మృగంగా తయారయ్యాడు.. వావి వరుసలు లేకుండా అఘాయిత్యాలకు పాల్పడే స్థాయికి దిగజారాడు.. అతడి చూస్తే గూడెం గూడెమంతా భయంతో వణికిపోయేది.. 50రోజుల క్రితం తాగిన మైకంలో మొదటి భార్య తల్లిని పొట్టన పెట్టుకోవడమే కాకుండా, తాజాగా తన ఇద్దరు భార్యల వద్దకు వచ్చి వారిపైనా దాడికి యత్నించాడు. ఆత్మ రక్షణ కోసం వారు ప్రతిదాడి చేయగా, ఆ మృగం అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం ఏనెబావి శివారు పిట్టలోనిగూడెంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. తాగుబోతు భర్త తీరుతో అమాయకులైన ఇద్దరు మహిళలు జైలు పాలయ్యే పరిస్థితి వచ్చింది. మృతుడి ఇద్దరు భార్యల్లో ఒకరు 16 ఏళ్ల మైనర్ కావడం విషాదం. పోలీసుల కథనం ప్రకారం.. పిట్టలోనిగూడెంకు చెందిన కాలియా కనకయ్య(30)కు శిరీష అలియాస్ చొక్కమ్మ, బాలిక(16) ఇద్దరు భార్యలు. మామిడి తోటలను లీజుకు తీసుకుని కూలి పనులు చేస్తూ సంచార జీవితాన్ని గడుపుతున్నాడు. మే 18న యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాలలో మామిడితోటలో కూలీగా పనిచేస్తున్న తన అత్త (మిగతా 7లో...)

కనకయ్యది విశృంఖల ప్రవర్తన..

కనకయ్య పేరు వింటేనే గ్రామస్థులు వణికిపోయే వారు. సంచార జీవితాన్ని గడుపుతూ నల్లగొండ, సిద్దిపేట, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో మామిడి తోటల లీజు కోసం తిరుగుతుండేవాడు. అతడు గ్రామానికి ఎప్పుడు వచ్చినా బహిర్భూమి కోసం వచ్చే ఒంటరి మహిళలను టార్గెట్ చేసి అత్యాచారానికి పాల్పడేవాడని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే ఆరుగురిపై అత్యాచారం చేశాడని పేర్కొంటున్నారు. కొడుకు చేష్టలను అడ్డుకునేందుకు కనకయ్య తండ్రి అమితాబచ్చన్ ప్రయత్నించడంతో తండ్రిపై దాడిచేసి కాళ్లు చేతులు విరగ్గొట్టి పరారైపోయాడు. కనకయ్య ప్రవర్తనను సంచార జాతుల వారు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా పెద్ద మనుషుల సమక్షంలో చర్చించుకునేవారని స్థానికులు పేర్కొంటున్నారు.



సర్వమంగళ రూపంలో భద్రకాళి

భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 13వ రోజు మంగళవారం ఉదయం 5 గంటలకు నిత్య పూజ అనంతరం అర్చకులు ఉత్సవమూర్తిని మాత్రా రూపంలో, అమ్మవారిని సర్వమంగళా రూపంలో అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ రూపంలో అమ్మవారిని ఆరాధిస్తే శుభాలు జరుగుతాయని అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితికి చెందిన భక్తులు ఓసిటీ నుంచి దేవాలయం వరకు ర్యాలీగా తరలి వచ్చి అమ్మవారికి కూరగాయలు సమర్పించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, సుగుణ, క్రాంతి, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఈవో శేషు భారతి పాల్గొన్నారు. ఆలయంలో ఏర్పాట్లను వరంగల్ ఏఎస్పీ శుభంప్రకాష్, మట్టెవాడ సీఐ గోపి పరిశీలించారు.

గళమెత్తనున్న కార్మిక లోకం



నేడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారత్ బంద్

- అన్ని సేవలకు కలగనున్న అంతరాయం
- ఏకశిలా పార్క్ నుంచి కార్మికుల భారీ ర్యాలీ
- అన్ని జిల్లా కేంద్రాల్లోనూ నిరసన ప్రదర్శనలు
- సమ్మెకు పదికిపైగా కార్మిక సంఘాల మద్దతు

హనుమకొండ/వరంగల్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాలు సర్వసన్నద్ధమయ్యాయి. ఈ మేరకు కార్మికులను, ఉద్యోగులను సమాయత్తం చేశాయి. బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు, ఉద్యోగులకు, అన్నివర్గాల ప్రజలకు పిలుపునిచ్చాయి.

పదికిపైగా కార్మిక సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్(సీఐటీయూ), ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్(ఏఐటీయూసీ), తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (టీఎన్‌టీయూసీ). ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)లతో పాటు హెచ్ఎంఎస్, టీయూసీఐ, ఏఐయూటీయూసీ ఈ బంద్‌లో పాల్గొననున్నాయి.

అధికారిక, అనధికారిక, అసంఘటిత ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు చెందిన యూనియన్లు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బ్యాంకింగ్ రంగం కూడా భారత్ బంద్‌లో పాల్గొంటున్నట్లు ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్లు ప్రకటించాయి. విద్యుత్ కార్మికులు కూడా భాగస్వాములు అవుతున్నారు. అందువల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగవచ్చునని భావిస్తున్నారు. జూలై 9న బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అధికారిక సెలవు ప్రకటించనప్పటికీ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దశాబ్ధాల పాటు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి వాటిస్థానంలో 4లేబర్ కోడ్‌లను తీసుకువచ్చింది. ఇవి ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగుల, కార్మికులకు వ్యతిరేకంగా వున్నాయనే కారణంతో ఈ బంద్‌కు పిలుపునిచ్చారు.

భారత్ బంద్‌తో ఉమ్మడి జిల్లాలో అనేక సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. భారత్ బంద్‌లో భాగంగా దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, బట్టల దుకాణాలు, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకులు, బంద్ కానున్నాయి. ఎస్‌బీఐ తప్ప మిగతా అన్ని బ్యాంకులు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు కూడా బంద్‌లో పాల్గొననున్నారు. సినిమా థియేటర్లు కూడా మూతపడనున్నాయి. ఉమ్మడి జిల్లాలో బ్యాంకింగ్, బీమా, పోస్టల్, నిర్మాణం వంటి ప్రభుత్వ సేవల రంగాల్లోని లక్షా75 వేల మందికిపైగా కార్మికులు పాల్గొననున్నారు. భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్క్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీని నిర్వహించనున్నారు.

డిమాండ్లు ఇవే...

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, స్కీమ్ కార్మికులతో సహా కార్మికులందరికి జాతీయ స్థాయిలో కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, నెలకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, పాత 29 చట్టాలను పునరుద్ధరించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఎన్‌పీఎస్, యూపీఎస్ రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు-2020ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ప్రైవెటీకరణను ఆపాలని, పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, పని గంటలను 8 నుంచి 12కు పెంచుతూ ఇటీవల జారీ అయిన జీవోను ఉపసంహరించుకోవాలని, వంద మంది సభ్యులు ఉంటేనే సంఘం ఏర్పాటు అన్న నిబంధనను తొలగించి గతంలో మాదిరిగా ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని పునరుద్ధరించాలని, సమ్మెకు 60 రోజుల ముందు నోటీసు ఇవ్వాలన్న నిబంధనను రద్దు చేసి గతంలో మాదిరిగా 14 రోజుల వ్యవధిని పునరుద్ధరించడంతో సహా 20కి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు.



కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సంధ్య

వరంగల్ మెడికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.సంధ్య పదోన్నతి పొందారు. అడిషనల్ డీఎంఈ హోదాలో పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించనున్నారు. ఇప్పటి వరకు ఆర్థో విభాగం ప్రొఫెసర్‌గా డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. డాక్టర్ సంధ్య కాకతీయ మెడికల్ కళాశాలలో 1997లో పాథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. ఇక్కడే అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతూ 2012లో ఉస్మానియా మెడికల్ కళాశాలకు ప్రొఫెసర్‌గా వెళ్లారు. ఆ తరువాత తిరిగి కేఎంసీకి బదిలీపై వచ్చి విభాగఅధిపతిగా కొనసాగారు. 2018లో కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. 2023 నుంచి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు.

క్రైం డీసీపీగా గుణశేఖర్

వరంగల్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం డీసీపీగా కె.గుణశేఖర్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ క్రైం అడిషినల్ డీసీపీగా విధులు నిర్వర్తించిన బోనాల కిషన్‌ను ట్రాన్స్ కో కు బదిలీ చేయగా, మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న గుణశేఖర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- నగర మేయర్ గుండు సుధారాణి
- పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన


వరంగల్ మైసయ్యనగర్‌లో పర్యటిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. హనుమకొండలోని ఎస్‌బీహెచ్ కాలనీ, ప్రశాంత్‌నగర్, వడ్డెపల్లి చెరువు కట్ట, డిసిల్టేషన్ ప్రక్రియను పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత మైసయ్య నగర్, శివనగర్ వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డిసిల్టేషన్ పనులు పూర్తి చేసిన తర్వాత డ్రైన్‌లకు జాలీ (మెష్)లు అమర్చాలని అన్నారు. హనుమకొండ తెలంగాణ జంక్షన్ నుంచి ఫాతిమా జంక్షన్ వరకు కచ్చా కాలువలు తీయాలని అన్నారు. పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని అన్నారు. వరంగల్ 35వ డివిజన్ మైసయ్యనగర్‌లోని అగర్తల కట్ట వద్ద మొక్కల చుట్టూ జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పుప్పాల గుట్ట శ్మశాన వాటిక వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, సిఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఏసీపీ ఖలీల్‌పాషా, డీఈ సారంగం, శానిటరి సూపర్‌వైజర్లు నరేందర్, భాస్కర్, ఏఈ మేనక పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వైఎస్

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- డీసీసీ భవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు


వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. వైఎస్ జయంతి పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు వైఎస్ చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్ పాలన జనరంజకంగా సాగిందన్నారు. నేటికే కాకుండా భవిష్యత్తు తరాలకు ఆయన రోల్ మోడల్ అన్నారు. వైఎస్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నసీంజహాన్, రజిత, పుప్పాల ప్రభాకర్, నాగరాజు, తక్కళ్లపల్లి మనోహర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు భద్రత చెక్కు అందజేత

వరంగల్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కిందటేడు మరణించిన ఎస్సై నర్సింహ, హెడ్ కానిస్టేబుల్ శ్రీరామ్ రాజు కుటుంబాలకు భద్రత విభాగం నుంచి మంజూరైన భద్రత చెక్కులను సీపీ మంగళవారం అందజేశారు. నర్సింహా కుటుంబానికి రూ.15,92,000 చెక్కు అందజేయగా, రాజు కుటుంబానికి రూ.15,22,983 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ డీసీపీ ప్రభాకర్‌రావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

కాజీపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీసీపీ ప్రభాకర్‌రావు సూచించారు. కాజీపేటలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ట్రాఫిక్ సీఐ వెంకన్న అధ్యక్షతన మంగళవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ప్రయాణికుల భద్రత పట్ల జాగ్రత్తగా ఉంటూ వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. వాహనాల ధృవపత్రాలతోపాటు లైసెన్స్, యూనిఫాం తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సదస్సులో ట్రాఫిక్ ఎస్సైలు, కాజీపేట అడ్డా స్మార్ట్ అండ్ సేఫ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు దార సూరి, రాంబాబు, అం జాద్, శ్రావణ్, వినోద్, రహీం, చందు, జోషి, పాల్గొన్నారు.

కూనూరుకు జాతీయ గుర్తింపు

● ప్రభుత్వ పాఠశాలకే గర్వం ●ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



కూనూరు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని అందచేస్తున్న శ్రీపాల్ రెడ్డి

హనుమకొండ కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని కూనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జాతీయ గుర్తింపు రావడం గర్వించదగిన విషయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కొనియాడారు. పాఠశాలను గత డిసెంబర్ 21,22 తేదీల్లో కూనూరు ఉన్నత పాఠశాలలో 1974 నుంచి 2024 సంవత్సరాలకు చెందిన 50 పదో తరగతి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం 5వేల మంది విద్యార్థులతో రెండు రోజుల పాటు నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనూరు జ్ఞాపకాల హరివిల్లు పేరిట 300 పేజీల మల్టీకలర్ ప్రత్యేక సావనీర్‌ను ప్రచురించారు. ఈ పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ మేరకు హనుమకొండలోని వరంగల్ దర్శన్ సెమినార్ హాల్‌లో జరిగిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో కూనూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. ఫర్వేజ్‌కు, స్కూల్ అల్యూమినీ అసోసియేషన్ కమిటీకి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను ముఖ్యఅతిథి టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమానికి గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్ అల్యూమినీ కమిటీ నాగమళ్ల అశోక్ అధ్యక్షత వహించారు.

ఏడాదిలో అభివృద్ధి పథంలో 'కుడా'

కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వరంగల్ నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించానని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారంలో కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన యేడాదికాలం గడిచిన నేపథ్యంలో కుడా కార్యాలయంలో కుడా వైస్‌చైర్మన్ చహత్ బాజ్‌పాయ్‌తోపాటు అక్కడి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి యేడాది కాలంలో చేపట్టిన పనులు, చేసిన అభివృద్ధి పనులపై చర్చించారు. వచ్చే నాలుగేళ్లలో భవిష్యత్ కార్యక్రమాలను వెల్లడించారు. తన హయాంలో చేసిన పనులు మరెవ్వరూ చేయలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కుడా పీవో అజీత్‌రెడ్డి, ఈఈ భీంరావుతోపాటు కుడా సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘకాలిక పెండింగ్ పనులను పూర్తి చేశా..

వరంగల్‌ను మహా నగరంగా మలిచే దిశగా సాగుతున్న ఈ మహా క్రతువులో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఎట్టకేలకు పూర్తి చేశానని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి స్పష్టం చేశారు. జూలై 8 నాటికి కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి యేడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం కుడా కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. యేడాదికాలం అనుభవాలను వెల్లడించారు. వరంగల్ జిల్లాలోని 181 గ్రామాలు, 1,805 చదరను కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న మాస్టర్‌ప్లాన్-2041 వర్చువల్‌గా రేవంత్‌రెడ్డితో ప్రారంభించానన్నారు. రూ.95కోట్ల వ్యయంతో ప్రజాకవి కాళోజీ నారాయణరావు కళాక్షేత్రం నిర్మించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. కుడాలో పనులు వేగవంతంగా సాగేందుకు 28 మంది కాంట్రాక్టు ఉద్యోగులను నియమించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చానన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రామ్‌రెడ్డి

ప్రభుత్వం నుంచి రూ.107కోట్ల నిధులు మంజూరు చేయించి ఇన్నర్ రింగ్ రోడ్డు భూ సేకరణకు బకాయిలు చెల్లించానన్నారు. ప్రభుత్వ భూములు కాపాడేందుకు ప్రభుత్వం నుంచి సీపీఎల్‌ఏ నుంచి ప్రత్యేక అనుమతులు తెచ్చానని వివరించారు. రూ.4కోట్ల నిధులతో వరంగల్ గేట్‌వే ఎల్కతుర్తి వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో జంక్షన్ అభివృద్ధి చేశానన్నారు. రూ.150కోట్ల అంచనా వ్యయంతో వరంగల్ నగరం చుట్టూ 13 కిలో మీటర్ల మేరకు ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నానని తెలిపారు. రూ.30కోట్లతో భద్రకాళి ఆలయం వద్ద మాడవీధులను అభివృద్ధి చేస్తున్నామని, భద్రకాళి చెరువులో రూ.10కోట్ల అంచనాతో 9 దీవుల అభివృద్ధి చేస్తున్నామన్నారు. కుడా నిధులతో వివిధ నియోజక వర్గాల్లో రూ.30కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, కాల్వలు, జంక్షన్ల నిర్మాణం కోసం కసరత్తు చేస్తున్నానన్నారు. రూ.75కోట్ల వ్యయంతో వరంగల్ బస్‌స్టేషన్ 90 శాతం పూర్తి చేయడానికి దృష్టి సారించానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గించడానికి జిల్లా అభివృద్ధికి వివిధ సంస్థల నుంచి రూ.700 నుంచి రూ. 1000కోట్ల వరకు నిధుల సేకరణకు శ్రీకారం చుట్టానని ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి వివరించారు.

పది మందికి అదనపు డీఎంఈ పదోన్నతులు

ఎంజీఎం, కేఎంసీకి చెందిన ప్రొఫెసర్లకు అవకాశం

వరంగల్ మెడికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య విద్య పరిధిలోని 44 మంది ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈలుగా పదోన్నతులు లభించాయి. వరంగల్ కాకతీయ వైద్య కళాశాల, ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వివిధ విభాగాలకు చెందిన పదిమంది ప్రొఫెసర్లు అడిషనల్ డీఎంఈలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ జీవో 298 విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలకు, బోధన ఆస్పత్రులకు ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లుగా నియమించారు.

కేఎంసీ పీడియాట్రిక్ ప్రొఫెసర్‌గా డాక్టర్ వి.మురళీకృష్ణ సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కలాశాల సూపరింటెండెంట్‌గా, కేఎంసీ డెర్మటాలజీ విభాగం ప్రొఫెసర్‌గా డాక్టర్ జి.స్వర్ణకుమారి ములుగు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, రేడియాలజీ విభాగం ప్రొఫెసర్ సంజీవ్ కుమారి నారాయణపేట ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, ఎస్టీడీ విభాగం ప్రొఫెసర్‌గా సీహెచ్.మధుబాబు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. హనుమకొండ జీఎంహెచ్ గైనిక్ విభాగం ప్రొఫెసర్‌గా ఆర్.ఆండాలు కరీంనగర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, కేఎంసీ ఫైథాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సంధ్య కేఎంసీ ప్రిన్సిపాల్‌గా, సీకేఎం ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ షర్మిల జగిత్యాల ప్రిన్సిపాల్‌గా, డాక్టర్ జే.రాజేశ్వరి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రిన్సిపాల్‌గా, పీడియాట్రిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీహరిరావు భద్రాద్రి జిల్లా ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. అదేవిధంగా ములుగు ఆస్పత్రి ప్రొఫెసర్ చంద్రశేఖర్ ములుగు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, భూపాలపల్లిగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటేశ్వర్లు, మహ బూబాబాద్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవిశేఖర్‌రావు, జనగామ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగమణి, జనగామ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజలింగం పదోన్నతి పొందారు.

ఎంజీఎంకు మొండిచేయి

ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను నియమించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కొన్నేళ్లుగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పాలనలో కొనసాగుతోంది. పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియామకం చేయకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించినప్పటికీ వీరిలో ఏ ఒక్కరికి ఎంజీఎం బాధ్యతలు అప్పగించకపోవడం వెనుక మర్మం ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.



అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కంపెనీ సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు

వరంగల్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలతో వచ్చే కంపెనీ సైలెన్సర్లను మార్పు చేసే వాహనదారులతో పాటు మెకానిక్‌లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ట్రైసిటీలోని మూడు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ అధిక శబ్ధం వచ్చే 311 సైలెన్సర్లను మళ్లీ వినియోగించకుండా మంగళవారం కేయూ క్రాస్‌లో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. సైలెన్సర్లు మార్పు చేసి పట్టుబడితే ఆర్‌టీఏ ద్వారా 3నెలల పాటు లైసెన్స్ రద్దు చేస్తామని డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు రామకృష్ణ, సీతారెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో క్షమాపణ చెప్పించారని.. తనయుడి ఆత్మహత్యాయత్నం

ఎల్కతుర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పశువు పొడిచినందుకు గాయపడిన వ్యక్తి.. తన తండ్రితో గ్రామ పెద్దమనుషులు సమక్షంలో క్షమాపణ చెప్పించడంతో తనయుడు మనో వేదనకు గురయ్యాడు. దీంతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన ఆవు.. వారం కిందట మేతకు వెళ్లి వల్భాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని గాయపర్చింది. గాయాలైనందుకు సూరారం గ్రామ పెద్ద మనుషులు నాలుగు రోజుల కిందట ఆవు యాజమాని వద్దకు వచ్చి గాయపడిన వ్యక్తికి నష్టపరిహారం ఇప్పించడంతో పాటు కాళ్లు మొక్కించారు. దీంతో పక్కనే ఉన్న ఆవు యాజమాని కుమారుడు పశువు గాయపర్చినందుకు క్షమాపణ చెప్పించడం ఏంటని గ్రామ పెద్దమనుషులపై మండిపడ్డాడు. అయినప్పటికీ పెద్ద మనుషుల ప్రవర్తనతో మనోవేదనకు గురయ్యా డు. నాలుగు రోజుల కిందట పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స కోసం వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆయన ఇంట్లో పని చేయాలట..

● కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ తీరుపై ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన

● కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ మెడికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని తన ఇంట్లో పని చేయాలని కాళోజీ నారాయణరావు (కేఎన్‌ఆర్) ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పీవీ నందకుమార్ బెదిరింపులకు దిగుతున్నారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వీసీ తీరును నిరసిస్తూ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎదుట మంగళవారం ధర్నా దిగారు. తాము కొన్నేళ్లుగా ఇదే విశ్వవిద్యాలయంలో ఔట్‌సోర్సింగ్ విధానంపై విధులు నిర్వహిస్తున్నామని, అయితే హైదరాబాద్‌లోని తన ఇంట్లో పని చేయాలంటూ ఐదుగురు సిబ్బందిని ఒత్తిడికి గురి చేస్తున్నట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తానని బెదిరింపులకు దిగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో హైదరాబాద్‌లోని వీసీ ఇంట్లో తాము ఎలా పని చేస్తామని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మాదాసు రూప ప్రశ్నిస్తున్నారు. వీసీ వేధింపులను ఆపకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

చెల్లని కల్యాణలక్ష్మి చెక్కులు

● ఆందోళనలో లబ్ధిదారులు



లబ్ధిదారుకు ఇచ్చిన కాలం చెల్లిన చెక్కు

కమలాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు చెల్లవని బ్యాంకు అధికారులు తెలుపడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. కమలాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 100 మంది కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అందజేశారు. లబ్ధిదారులు మంగళవారం బ్యాంకుకు వెళ్లి డిపాజిట్ చేసే క్రమంలో చెక్కు గడువు అయిపోయిందని తెలుపడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. ఈ విషయం తెలుసుకున్న కమలాపూర్ తహసీల్దార్ సురేష్‌కుమార్ 20 మంది లబ్ధిదారుల చెక్కులను తహసీల్దార్ కార్యాలయానికి తెప్పించుకుని పరిశీలించారు. లబ్ధిదారులకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరో వారంలో కొత్త చెక్కులను అందజేస్తామని చెప్పడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు.

మీడియా సంస్థలపై దాడులు హేయమైన చర్యలు

కేయూ క్యాంపస్ జూలై 8, (ఆంధ్రజ్యోతి): మీడియా సంస్థలపై దౌర్జన్యాలు, దాడులు అరాచకానికి పరాకాష్ఠ అని, హేయమైన చర్యలను అందరూ ఖండించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. మీడియా సంస్థలపై దాడులు చేస్తే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏళ్ల నిరంకుశ, కిరాతక, రాచరిక పాలను సాగించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని లూటీ చేసి ప్రజలను దోచుకుతిన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కుటుంబం చేసిన దోపిడీని బయటకు వస్తుంటే జీర్ణించుకోలేక నిజాలను చెబుతున్న మీడియా సంస్థలపై దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను దోచుకుతిన్న కుటుంబమే శిక్షలు అనుభవించాలని స్పష్టం చేశారు.

తెలంగాణ సెంటిమెంటును వాడుకుంటూ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేసేందుకు సిగ్గుండాలని హెచ్చరించారు. తెలంగాణ కల్వకుంట రాజ్యం కాదని వివరించారు. తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు ప్రాంతీయ విభేదాలను రెచ్చకొడితే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. మీడియా తప్పులు రాస్తే ప్రజాస్వామ్యబద్ధంగా స్పందించాలని, చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని దాడుల ఎందుకని ప్రశ్నించారు.

యూరియా కోసం పడిగాపులు

తిమ్మంపేటలో గంటలకొద్ది రైతులు నిరీక్షణ

దుగ్గొండి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు గంటల కొద్ది క్యూలో నిరీక్షించారు. మండలంలోని తిమ్మంపేట సహకార సంఘానికి రెండు రోజుల కిందట లారీ లోడ్ యూరియా వచ్చింది. మంగళవారం యూరియా పంపిణీ చేస్తారని తెలుసుకున్న రైతులు.. తెల్లవారుజాము నుంచి క్యూ కట్టారు. లైన్‌లో ఉన్న ప్రతీ రైతుకు రెండు బస్తాల యూరియా బస్తాలను అందించారు. క్యూలో చివరగా ఉన్న రైతులకు బస్తాలు రాక పోవడంతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. మండలంలోని దుగ్గొండి, మహ్మదాపురం, నాచినపల్లి, మందపల్లి గ్రామాల్లో రైతు సహకార సంఘాలు ఉన్నాయి.

ఆ సంఘాల అనుబంధంగా తిమ్మంపేట, తొగర్రాయి, లక్ష్మీపురం, గ్రామాల్లో సహకార సంఘాల భవనాల్లో యూరియాను పంపిణీ చేస్తారు. తిమ్మంపేటలో ఖరీఫ్ సీజన్‌లో మొదటిసారిగా యూరియా రావడంతో ఎక్కువమంది యూరియా కోసం బారులు తీరినట్లు రైతులు తెలిపారు. ఎక్కువ యూరియా దిగుమతయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.



తిమ్మంపేట సొసైటీ భవనం వద్ద క్యూలైన్‌లు కట్టిన రైతులు

మా ప్రభుత్వ పథకాలు

చరిత్రాత్మకమైనవి

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. కేసముద్రంలో మంగళవారం నిర్వహించిన బహిరంగసభలో మంత్రులు మాట్లాడారు. తెలంగాణాలోనే పెద్దమార్కెట్ ఇక్కడ ఉందని, ఇలాంటి మార్కెట్లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆశీస్సులతో రూ.5కోట్లతో గోదాంలను మంజూరు చేశారని తెలిపారు. ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచే 132కేవీ సబ్‌స్టేషన్‌తోపాటు మరో మూడు సబ్‌స్టేషన్లు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చొరవతో మంజూరయ్యాయని తెలిపారు. రూ.250కోట్ల రోడ్లను రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి సురేఖ మండలంలోని ఏడు గుళ్లకు రూ.1.5కోట్లను, మంత్రి సీతక్క తన పంచాయతీరాజ్ శాఖ నుంచి నియోజకవర్గానికి రూ.80కోట్ల రోడ్లు మంజూరు చేశారని తెలిపారు. చరిత్రలో ఎవరూ చేయలేని పథకాలను అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ, రూ.21వేలతో రుణమాఫీ అమలు చేశామని తెలిపారు.

ఆనాడు మహానుభావుడు ఎన్టీఆర్ రూ.2కే కిలోబియ్యం ఇచ్చినట్లు చరిత్రాత్మకంగా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తోందని, పేదలు తినే ప్రతీ బుక్కలో ప్రభుత్వం చేసిన సహాయం కనిపిస్తుందని తెలిపారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు ఇస్తోందంటే కాంగ్రెస్ ప్రభుత్వ గొప్పదనమని అన్నారు. ప్రభుత్వంలోని సీఎం, మంత్రులు కష్టపడుతున్నామని, తెలంగాణలో అధికారం ఎవరి హక్కు కాదని, ప్రజల హక్కు అని, ప్రజల అభిమానంతోనే అధికారంలోకి వచ్చామని తెలిపారు. కష్టపడుతున్న ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణ టాప్

(5వ పేజీ తరువాయి)

ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ మంత్రులు రోజుకు 18 గంటలు పనిచేస్తూ ప్రజా అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.12 కోట్ల కుటుంబాలు ఉండగా అందులో 90 లక్షలకు పైగా కుటుంబాలకు కాంగ్రెస్ సర్కార్ సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలందరికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

స్వరాష్ట్రం సిద్ధించిన సమయంలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పాలకులు తమ పదేళ్ల పాలనలో అప్పులపాలు చేశారని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. గత పాలకులు చేసిన అప్పులను చెల్లిస్తూనే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలుచేస్తూ వస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్‌ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చేసి ఓర్వలేని బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదచల్లడమే పనిగా పెట్టుకుని విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎవరేంటో గమనిస్తున్నారని, ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పారని, వచ్చే ఏ ఎన్నికల్లో వారికి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజ యం సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయా సభల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, స్వయం సహాయక సంఘాల గ్రూపులకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన పనిచేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తూనే హామీ ఇవ్వని పథకాలను సైతం అమలు ప్రవేశపెడుతుందని అన్నారు. గత ప్రభుత్వం అప్పుల పాలు చేస్తే వాటికి వడ్డీలు కడుతూనే కొత్తసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సన్నధాన్యంకు క్వింటాకు రూ.500 బోనస్ తోపాటు రేషన్‌షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘటన కాంగ్రెస్ సర్కార్‌దేనన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు రంకెలు వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, వారి కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తూ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు, మహిళా సంఘాల సభ్యులకు రూ.1.16 కోట్ల బ్యాంకు రుణాల చెక్కును అందించారు.

ఈ కార్యక్రమాల్లో ఇంకా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, జాటోత్ రాంచందర్‌నాయక్, కోరం కనకయ్య, కేఆర్ నాగరాజు, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, రాష్ట్ర నాయకులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, డీఎఫ్‌వో భట్టు విశాల్, మానుకోట ఆర్డీవో కృష్ణవేణి, విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం బహిరంగసభలో మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు



కేసముద్రం బహిరంగసభకు హాజరైన జనం

అభివృద్ధిని తట్టుకోలేక పోతున్నారు..

- అందుకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం..
- కేసముద్రం సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోరికకు అనుగుణంగా పరిపాలించే కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనతో బీఆర్ఎస్ నాయకులకు మైండ్‌బ్లాక్ అయి తట్టుకోలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసముద్రంలో మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో మంత్రులు మాట్లాడారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మాజీ మంత్రిగా సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడుతున్నారని, అది వారి సంస్కారానికే వదిలేస్తున్నామని అన్నారు. ధనిక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల అధికారం ఇచ్చారని, ఏనాడైనా రూ.200 ఉచిత విద్యుత్ ఇవ్వదని, రూ.500 గ్యాస్ ఇవ్వద్దని, ఆడ బిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించవద్దని మేం అన్నామా అని ఎద్దేవా చేశారు. తొమ్మిది నెలలో 60వేల ఉద్యోగాలు ఇవ్వద్దని మేం అన్నామా, వరి వస్తే ఉరి అన్న మీకు వరి వేసిన వారికి బోనస్ ఇవ్వవద్దని మేం అన్నామా అని వ్యగ్యంగా ప్రశ్నించారు. రూ.21వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేసి రైతును రాజును చేయవద్దని మేం అన్నామా, క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వద్దని, పేదలకు సన్న బియ్యం ఇవ్వద్దమి మేం అన్నామా అంటూ ప్రశ్నించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలకు మంచి కార్యక్రమాలు చేస్తోంటే నీకు కడుపుమంట ఎందుకయ్యా అన్నారు. పదేళ్లలో పేదలకు రేషన్‌కార్డు ఇచ్చారా అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు అని ఊరించి ఎవరికీ ఇవ్వలేదని, ఇందిరమ్మ పథకమంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని అన్నారు. పేదవాడి చిరకాల కోరిక 4.5లక్షల ఇళ్లు ఇచ్చామని రూ.22,500 కోట్లు ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇచ్చామని, నియోజకవర్గానికి మరో వెయ్యి ఇల్లు ఇచ్చామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి విడతలవారీగా అందరికీ ఇచ్చామని తెలిపారు. మూడు గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను భూభారతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తున్నామని తెలిపారు. రైతుప్రభుత్వంలో ఎకరాకు రూ.12వేలను 9 రోజుల్లో రూ.9వేల కోట్లను టింగ్..టింగ్..అంటూ రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో స్థానిక సంస్థల్లో నిలబడే అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి తుమ్మల



నియోజకవర్గానికి ఏ అవసరం ఉన్నా మీ కోరికలు తీర్చేందుకే పనిచేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకువస్తామని, కొద్దిరోజుల్లోనే జిల్లాకు గోదావరి జలాలు ఆర్థిక భారమైనా ఉపముఖ్యమంత్రి సహకారంతో ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వెళుతున్నామని, తెలంగాణలాంటి సంక్షేమ రాజ్యం కావాలని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులపై ప్రజలు ఒత్తిడి తీసుకువస్తున్నారని అన్నారు.

నిధుల వరద పనుల జాతర: మంత్రి సీతక్క



కేసముద్రంలో నిధుల, వరద పనుల జాతర కొనసాగుతోందని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేదలకు సన్నబియ్యం ఇచ్చి కడుపునిండా అన్నం పెడుతున్నారని, నిలువనీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఉచితంగా విద్యుత్, ఏడాదిన్నరలోపే 60వేల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అన్నారు. మహిళా సంఘాలకు రూ.25వేల కోట్ల బ్యాంకు లింకేజి ఇచ్చామని, రూ.2కోట్లతో కేసముద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనం మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు రూ.10లక్షల బీమా ఇచ్చామని, రూ.5కోట్లతో మహబూబాబాద్ మహిళా శక్తి భవనం మంజూరు చేసినట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు ఉన్న మహిళలు సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు.

వేం ఉండడం కేసముద్రం అదృష్టం: మంత్రి సురేఖ



సీఎం ప్రధాన సలహాదారుడిగా వేం నరేందర్‌రెడ్డి ఉండడం కేసముద్రం ప్రజల అదృష్టమని, ఎవరూ ఊహించని విధంగా వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన నిరుపేదలకు పథకాలు చేరాలనే లక్ష్యంతో అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని గుర్తుపెట్టుకోవాలని కోరారు. ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, వారిని నమ్మవద్దని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

రూ.175కోట్ల అభివృద్ధి పనులు: మంత్రి కోమటిరెడ్డి



తన శాఖ నుంచి కేసముద్రంలో రూ.175కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలు రావాలంటే రోడ్లు రావాలని, మండలంలో వివిధ మార్గాలకు రాబోయే కాలంలో ప్రతీరోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని అన్నారు. ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వచ్చే 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండాలని అన్నారు.

నిధులు మంజూరు చేయరూ..

డిప్యూటీ సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే మురళీనాయక్ విన్నపాలు



కేసముద్రం బహిరంగసభలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి, మంత్రులు

కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సోమ్లాతండా సభలో రాష్ట్ర డిప్యూటీ సీఎం, మంత్రులకు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ నియోజకవర్గానికి కావాల్సిన అవసరాలను విన్నవించుకున్నారు. మహబూబాబాద్ పట్టణానికి ఔటర్ రింగురోడ్డు, జిల్లా కేంద్రంలోని మున్నేరు వాగు వద్ద బతుకమ్మ ఘట్, జేఎన్‌టీయూ కళాశాలకు భవన నిర్మాణం, పర్వతగిరి నుంచి అమనగల్‌కు లింకురోడ్డు, బీఎన్.గుప్తా(తులరాం ప్రాజెక్టు) ఎత్తు పెంచి కంబాలపల్లి, ఈదులపూసపల్లి పెద్ద చెరువుల్లో నీటి నిల్వ చేసుకుంటే సాగు, తాగునీరుకు ఇబ్బందులు ఉండవని, వీటిని పెదమనస్సుతో మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర సీఎం సలహాదారులు వేం నరేంద ర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, కోరం కనకయ్య, ట్రైకార్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఝాన్సీరెడ్డి, మేకల వీరన్న, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, డీఎఫ్‌వో బత్తుల విశాల్, ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

వేం వాహనంలో పొగలు



మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో సీఎం సలహదారులు వేం.నరేందర్‌రెడ్డి కారులో పొగలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం. నరేందర్‌రెడ్డి వాహనంలో మంగళవారం ఏసీ వద్ద వైర్లు షార్ట్‌సర్క్యూట్ (స్పార్క్)తో స్వల్పంగా పొగలు వచ్చాయి. సోమ్లాతండాలో డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన నేపథ్యంలో సీఎం సలహాదారులు తన వాహనంలో అక్కడకు చేరుకున్నారు. అదే వాహనంలో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నా రు. ఆయన దిగి వెళ్లాక తిరిగి వాహనాన్ని స్టార్ట్ చేస్తున్న క్రమంలో ఏసీ పాయింట్ వద్ద వైర్లలో స్పార్క్‌తో పొగలు వచ్చా యి. దీంతో అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది నీటితో పొగలను ఆర్పారు. ఆ తర్వాత వాహనం స్టార్ట్ అయి వెళ్లిపోయింది.

హోరెత్తిన కాంగ్రెస్ సభలు

- మంత్రుల ప్రసంగాలతో ఎన్నికల జోష్
- పార్టీ కేడర్‌లో నూతనోత్సాహం
- స్థానిక సమరానికి శంఖారావం
- సోమ్లాతండా, కేసముద్రం సభలకు భారీ జనసమీకరణ

మహబూబాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సరిగ్గా ఏడాదిన్నర తర్వాత మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రజాపాలన- ప్రగతిబాట అభివృద్ధి శంకుస్థాపనల బహిరంగ సభలు ఆ పార్టీ శ్రేణుల్లో రానున్న ఎన్నికలకు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సోమ్లాతండాలో రూ.100కోట్లతో, కేసముద్రంలో రూ.300కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరుకాగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కొండా సురేఖలు కూడా పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తింది. అందులోను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎన్నికల ప్రస్తావన తీసుకురావడం పరోక్షంగా స్థానిక సమరానికి ఈ సభలు శంఖారావం గానే పరిగణించవద్దని పరిశీలకులు విశ్లేషణలు చేస్తున్నారు. ప్రధానంగా దశాబ్ధకాలం అనంతరం ఇందిరమ్మ రాజ్యం కావాలని తెలంగాణ ప్రజలంతా కోరుకోవడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టితో పాటు హాజరైన మంత్రులంతా అభివృద్ధి ఫలాలను ఏకరువు పెట్టడం కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్దిపొందే ప్రయత్నంగా కనిపించింది. దీనికితోడు ఈ సభలకు భారీగా జనసమీకరణ చేయడం ర్యాలీలతో కేసముద్రంలో హోరెత్తించడం చూస్తే గ్రామాలు, మండలాల్లో కాంగ్రెస్‌కు ఉన్న బలం ప్రస్ఫుటమైంది. సోమ్లాతండా సభకు స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నీతానై జనసమీకరణకు పూనుకోగా కేసముద్రం సభను అంతకు మరింతగా విజయవంతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే అయిన ప్రస్తుత సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి తన సొంత మండలం కావడంతో ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఈ సభకు కేసముద్రంతోపాటు మహబూబాబాద్, చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి అభిమానాన్ని చాటుకున్నారు. కేసముద్రం సభలో స్వయాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులం దరూ ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ఈ నియోజకవర్గాన్ని మర్చిపోకుండా రూ. కోట్ల అభివృద్ధి పనులు మం జూరు చేయించు కోవడంలో ఇక్కడిమాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు.గిరిజన నియోజకవర్గమే కాకుండా ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని శా ఖల నుంచిఇంకా కావాల్సిన అభివృద్ధి ఫలాలు అందుతాయని హామీలు గుప్పించారు.

దృశ్యమాలిక



సోమ్లాతండా సభావేదికపై తెలంగాణ గీతాన్ని ఆలపిస్తున్న డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రులు



మహబూబాబాద్ మండలం సోమ్లాతండా సభలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు



మహబూబాబాద్ సోమ్లాతండాలో స్వయం సహాయ సంఘాల గ్రూపులకు బ్యాంకు రుణాలు అందిస్తున్న డిప్యూటీ సీఎం, రాష్ట్ర మంత్రులు

అభివృద్ధిని చూడలేక కండ్లల్లో నిప్పులు

- 70 ఏండ్లలో కోయజాతికి అవకాశం వస్తే తట్టుకోలేక పోతున్నారు
- నన్ను ఓడించేందుకు వందల కోట్లు ఖర్చు చేశారు
- ములుగును అభివృద్ధి చేస్తుంటే అడ్డుకునేందుకు ప్రయత్నాలా?
- కేటీఆర్.. ఇప్పటికే నీ చెల్లి నీపైన దుమ్మెత్తి పోస్తుంది
- నాతో పెట్టుకుంటే నాశనమైపోతావు
- నీకు కుల బలం, ధనబలముంటే నాకు ప్రజల ఆశీర్వాదముంది
- విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క వ్యాఖ్యానించారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 70 ఏళ్ల చరిత్రలో ఒక కోయ జాతి మహిళకు మంత్రిగా అవకాశం వచ్చిందని, దీన్ని తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తను ఓడించేందుకు బీఆర్ఎస్ నేతలు కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా తాను ములుగు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించానని, కాంగ్రెస్ వచ్చాక కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. 'కేటీఆర్.. నీకు కుల బలం, ధన బలం అహంకారం ఉంటే.. నాకు ప్రజల ఆశీర్వాదం ఉంది' అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల దీవెనలతోనే తాను ఎమ్మెల్యే నయ్యానని, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిల సహకారంతో మంత్రిని కూడా అయ్యానని అన్నారు.

ఇంటి ఆడబిడ్డను కూడా ఇబ్బంది పెట్టావ్..

ఇంట్లో ఆడబిడ్డను, బయటి ఆడబిడ్డను ఇబ్బందులకు గురిచేస్తున్నావని కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. ఇప్పటికే 'నీ చెల్లి నీపైన దుమ్మెత్తి పోస్తోంది. ఇప్పుడు నాతో పెట్టుకుంటే నాశనమైపోతావు' అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని అగౌరవంగా మాట్లాడడం దొర దురహంకారానికి నిదర్శనమన్నారు. సిరిసిల్లలో అమాయక ప్రజలను లారీలతో తొక్కించి చంపిన నీచ చరిత్ర మీదని మండి పడ్డారు. మీ పాలనలో సిద్దిపేటలో ఆటోడ్రైవర్, కొత్తగూడెం, నర్సంపేట, గజ్వేల్‌లో అమాయకపు ప్రజల ఆత్మహత్యకు మీరు కారణం కాదా? అని ప్రశ్నించారు. ఇలా చెప్పుకుంటూ పోతే మీ వల్ల బాధపడ్డ వారి లిస్టు పెద్దదేనన్నారు. ప్రజలను హింసించి అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపించిన నీచులు మీరన్నారు. మంథనిలో ఇద్దరు లాయర్లను ఎవరు చంపించారో ప్రజలకు తెలుసన్నారు. ఉద్యమ సమయంలో కిరోసిన్ పోసుకుని అగ్గిపెట్టె డ్రామా ఆడిన వాళ్లు మీరని గుర్తుచేశారు. మీ డ్రామాలో పడి ఎందరో అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల కుటుంబాలను ఆదుకోక డ్రామాలు

గతంలో ములుగు జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్త నాగయ్య మరణిస్తే రోడ్లపై కూర్చొని డ్రామాలు చేశారే తప్ప వారి కుటుంబాన్ని ఆదుకోలేదని మండిపడ్డారు. నాగయ్య భార్యకు తాను అంగన్‌వాడీలో టీచర్ పోస్టు ఇప్పించానన్నారు. నిరు పేదలకు బీఆర్ఎస్ పాలనలో వెయ్యి ఇళ్లు కట్టించలేదని, పేదలకు తాము కట్టి ఇస్తుంటే అవాకులు చెవాకులు పేలుతారా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కాన్స్టిట్యూషన్ నడిచిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజాస్వామ్య పాలన సాగుతోందని అన్నారు. ప్రైవేటు విత్తన కంపెనీల చేతుల్లో మోసపోయిన రైతులకు బీఆర్ఎస్ నష్ట పరిహారం చెల్లించారా? అని ప్రశ్నించారు. ములుగు జిల్లా పోలీసులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని, వారిని అవమానించేలా కేటీఆర్ మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం ములుగులో ప్రజా స్వామ్య పాలన నడుస్తోందన్నారు. ములుగు ఒక ఉద్యమ చరిత్ర అని, అందమైన అడవులు, సమ్మక్క-సారలమ్మలు పుట్టిన నేలని, రామప్ప దేవాలయం, ఎన్నో ప్రకృతి వనాలు ఉన్న జిల్లా అని దీనిపై రాజకీయ కుట్రలు చేయొద్దని హెచ్చరించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి ఈ జిల్లాపై ఎంతో మక్కువ ఉందన్నారు. రుద్రేశ్వరుడి పేరు వచ్చేలా తన మనువడికి పేరు పెట్టుకున్నారని అన్నారు. నాజీవితం తెలిచిన పుస్తకమని, నేనెవరికీ అన్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. విప్లవ ఉద్యమంలో కూడా శాంతియుత ఉద్యమం చేశాని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ కళ్యాణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ గొళ్లపెల్లి రాజేందర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, నాయకులు అహ్మద్‌పాషా, ఓంప్రకాష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ కోసం సివంగులయ్యారు..

(5వ పేజీ తరువాయి)

గుగులోత్ జున్నుబాయ్(పెద్దభార్య తల్లి)ని మద్యం కోసం డబ్బులు అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో అత్త జున్నుబాయ్‌ని హత్య చేసి పరారయ్యాడు. కనకయ్య ఇద్దరు భార్యలు పిట్టలోనిగూడెంలోనే ఉంటున్నారు. పెద్ద భార్యకు కుమారుడు ఉన్నాడు. మంగళవారం తెల్లవారుజామున పిట్టలోనిగూడెం చేరుకున్న కనకయ్య మద్యం మత్తులో తన చేతిలోని గొడ్డలితో ఇద్దరు భార్యలను చంపుతానని దాడికి యత్నించాడు. దీంతో భయాందోళనకు గురైన ఇద్దరు భార్యలు భర్త చేతిలోని గొడ్డలి తీసుకుని ప్రతిదాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి చిన్నమ్మ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అప్పుడు రక్షించారు.. ఇప్పుడు హతమార్చారు..

కనకయ్య మే 18న తన అత్తను హత్య చేసిన విషయం భార్యలకు తెలియకుండా అతి తెలివి ప్రదర్శించాడు. తాగిన మైకంలో స్నేహితుడు సుధాకర్‌తో సుద్దాలలో గొడవ జరిగిందని వాళ్లు తనను చంపేందుకు వస్తున్నారని నమ్మబలికి తన భార్యలను బైక్‌పై ఎక్కించుకుని సిద్దిపేటకు పరారయ్యాడు. చొక్కమ్మకు తన తల్లిని భర్త హత్య చేశాడనే విషయం తెలియకపోవడంతో రోజులాగే కూలికి వెళ్తోంది. అయితే కనకయ్య సిద్దిపేట శివారులో ఉన్నట్లు సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు అక్కడికి వచ్చి అతడిని పట్టుకుని చెట్టుకు కట్టేశారు. అయితే తమ భర్తను పోలీసులకు పట్టిస్తారనే భయంతో కట్లు విప్పేసి తప్పించారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న బంధువులు కనకయ్య చేసిన దారుణాన్ని భార్యలకు వివరించడంతో హతాశులయ్యారు. అప్పటికే కనకయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. జున్నుబాయ్‌కి భర్త, పిల్లలు ఉన్నా.. సంచార జీవితం గడుపుతున్న కూతురు చొక్కమ్మ ఆచూకీ తెలియకపోవడంతో సమాచారం ఇవ్వలేకపోయారు. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు నెలల తర్వాత గ్రామానికి..

రెండు నెలల తర్వాత పిట్టలోనిగూడెంకు వ చ్చిన కనకయ్య వచ్చాడు. మద్యం మత్తులో భా ర్యలపైదాడి చేసేందుకు రాగా ప్రమాదాన్ని పసిగట్టిన భార్యలు ప్రతిదాడికి దిగి హతమార్చారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి

హనుమకొండ కలెక్టరేట్, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ చందా మల్లయ్య జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు జాక్ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జాక్ సభ్యులు మేకల సుమన్, కూరాకుల భారతి, గుగులోతు రాజన్న, రవీందర్, సురేష్‌గౌడ్, జనార్దన్, సలీం, కృష్ణ, రాకేష్ తదితరులు ఉన్నారు.



బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జాక్ నాయకులు



ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న డివిజన్ కాంగ్రెస్ నాయకులు

నిధుల కేటాయింపుపై హర్షం

హసన్‌పర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 66వ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించిన ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు డివిజన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలిసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ.. 66వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సుమారుగా రూ. కోటికిపైగా నిధులు కేటాయించడం సంతోషదాయకమన్నారు. రానున్న రోజుల్లో డివిజన్‌లో మిగిలిపోయిన పలు అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించి డివిజన్‌ను అగ్రస్థానంలో నిలపాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, ఎల్‌బీసీ వెంకన్న, రవిందర్, వెంకటస్వామి, శ్రీనివాస్, మధు, కిరణ్, ప్రభాకర్, మురళి, నర్సింహరాములు, రమేష్ సురేష్, తిరుపతి, తదితరులున్నారు.

కార్మికులకు అండగా ఉంటా..

న్యూశాయంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు అండగా ఉంటానని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. మంగళవారం శాయంపేట సర్కిల్‌లో జీడబ్ల్యూఎంసీ కార్మికులకు కార్పొరేటర్ రాజు పీపీ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిత్యం వాననక, ఎండనక పనులు చేస్తున్న కార్మికుల ఆరోగ్య బాగోగుల కోసం కమిషనర్, మేయర్ ఆదేశాల మేరకు కార్మికులకు పీపీ కిట్లు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, జవాన్ పవన్, కార్మికులు పాల్గొన్నారు.

శివాజీ నగర్ నూతన కమిటీ ఎన్నిక



హసన్‌పర్తి శివాజీ నగర్ నూతన కార్యవరం

హసన్‌పర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలోని శివాజీ నగర్ నూతన కమిటీ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా నన్నెంశెట్టి స్వామి, సలహాదారులుగా వీసం రవీందర్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, కందుకూరి సంజీవ్, చిదర రమేష్, పితిమి ఉమాశంకర్, అధ్యక్షులుగా వీసం రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వీసం రవీందర్‌రెడ్డి, కనపర్తి రమేష్, ప్రధాన కార్యదర్శిగా గోపగాని నందకుమార్, సహాయ కార్యదర్శులుగా చల్ల సుధాకర్‌రెడ్డి, గూడురు తిరుపతిరెడ్డి, వెల్గటి తిరుపతిరెడ్డి, కోశాధికారిగా కోడెల సుధాకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా వల్లాల గంగాధర్, బైరి శరత్, పసుల శిరీష్, గూడూరు రాజశేఖర్, వీసం అనిల్‌రెడ్డి, వీసం దేవేందర్‌రెడ్డి, గోపగాని రాజు ఎన్నికైనట్లు కమిటీ ప్రకటించింది.

భూ భారతి చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకం



సర్వేలో పాల్గొన్న శిక్షణ లైసెన్స్‌డ్ సర్వేయర్లు

హసన్‌పర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంలో శిక్షణ లైసెన్స్‌డు సర్వేయర్ల పాత్ర కీలకమని ట్రెయినీ లైసెన్స్‌డు సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు పెసరు బొందయ్య అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ న్యాక్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న నూతన లైసెన్స్‌డు సర్వేయర్లకు మంగళవారం క్షేత్ర స్థాయిలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా బొందయ్య మాట్లాడుతూ.. నూతన సర్వే ప్రక్రియలో పరికరాల వినియోగం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లైసెన్స్‌డు సర్వేయర్ల సంఘం ఉపాధ్యక్షుడు చుంచు రవిందర్, మహేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీనియర్ లైసెన్స్‌డు సర్వేయర్లు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 64 మందికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 64 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ చారి రూ.81,700 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 9 మందికి రూ. 5,800 జరిమానా విధించామన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి

వడ్డెపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులను ఆదరించడంతో పాటు వారి కోసం రూపొందించిన వృద్ధుల తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం -2007ను అమలు చే యాలని వయోవృద్ధుల సంక్షేమ సంస్థ జిల్లా అధ్యక్షుడు దామెర నర్సయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని అన్నారు. కదలలేని స్థితిలో ఉన్న వృద్ధుల కోసం బ్యాంకు వారే వారి ఇంటికి వెళ్లి సేవలు అందించాలని కోరారు. పోలీసు స్టేషన్‌లో వృద్ధ మిత్ర సంఘాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.వృద్ధుల కో సం ప్రత్యేక డే- కేర్ సెంటర్‌ను ఏర్పాటు చే యాలని కోరారు. సంస్థ కార్యదర్శి తేరాల యుగంధర్, ఎన్. నర్సయ్య, మార్క రవీందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, దామోదర్, చిదురాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దామెర నర్సయ్య

బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసింది

- నేడు దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెకు అందరూ పాల్గొనాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 29 కార్మికుల చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను కాలరాసిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం నిర్వహించే దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెకు అన్ని వర్గాలు ప్రజలు పాల్గొని మద్దతు తెలుపాలని పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బుధవారం హనుమకొండలోని ఏకశిల పార్కు నుంచి కలెక్టరే ట్ కార్యాలయం వరకు కార్మికులతో కలిసి ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు.పలు వ్యాపార వాణిజ్య సంస్థలు బుధవారం రోజున స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, మా తెలంగాణ ఆటో యూనియన్, ఐఎఫ్‌టీయూ,బీఆర్‌టీయూ,వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలందరూ విజయవంతం చేయాలని కేయూ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ టెక్నికల్ అసోషియేషన్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమ్మెకు మద్దతుగా పరిపాలన భవనం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడుతామని వెల్లడించారు.

● న్యూశాయంపేట: సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు, స్వతంత్ర సెక్టోరల్ ఫెడరేషన్లు, అసోసియేషన్ల వేదిక ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దేశవ్యాప్త సమ్మెను కార్మిక సంఘాల నాయకులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాసరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ మెండి వైఖరి నిరసిస్తూ బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు డీవైఎఫ్ఐ పక్షాన పూర్తి మద్దతు తెలుపుతున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ప్రకటించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ సమావేశంలో తిరుపతి పాల్గొని సమ్మెలో నిరుద్యోగ యువతీ యువకులు, డీవైఎఫ్ఐ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

● రాంనగర్: ఎన్పీడీసీఎల్‌లోని ఎమ్మార్టీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 327 యూనియన్ స్టేట్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ యాజమాన్యంను విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో శ్రీధర్ మాట్లాడుతూ.. ఎమ్మార్టీలో కింది స్థాయి పోస్టులు భర్తీ కాకుండా మిగితావి చాలా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. బుధవారం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ప్రతీ ఒక్క విద్యుత్ ఉద్యోగి విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, ఎన్పీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, నాయకులు గంగాధర్, రమేశ్, నరేందర్‌రెడ్డి,తులసిరెడ్డి, పాల్గొన్నారు.

వైఎస్ ఆశయాలను కొనసాగించాలి

కాజీపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాజీపేట చౌరస్తాలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు జరుపుకున్నారు. 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి పాల్గొని కేక్ కట్ చేశారు. 47వ డివిజన్ బాపూజీ నగర్‌లో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అస్గర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మాజీ సీఎం వైఎస్సార్ జయంతి వేడుకలు జరుపుకున్నారు.

● మడికొండ: మడికొండ చౌరస్తాలో 64, 46 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్ల మోహన్, వస్కుల నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, నాయకులుపాల్గొన్నారు.



కడిపికొండలో పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణా గౌడ్



కాజీపేట చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయలక్ష్మి రజాలి

● మడికొండ: కాజీపేట మండలం కడిపికొండలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణా గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గంగుల శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కె శైలేఖక్రిష్ణ, కర్ర హరీష్‌రెడ్డి, కట్కూరి రేవంత్, అబ్దుల్, సయ్యద్, బస్కె రవి, నర్మెట సుధాకర్‌గౌడ్, బత్తిని విజ్ఞగిరిగౌడ్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు లింగారావు

ప్రభుత్వ బడిలో చదువుతో పాటు అన్ని వసతులు

మడికొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం కడిపికొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుంచుకాల లింగారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థుల చదువు కోసం ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకుప్రయత్నించాలన్నారు. అలాగే విద్యార్థులకు ఇంటి పని పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సరీలలో మొక్కలను సంరక్షించాలి

- వరంగల్ నగర కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- వరంగల్ నగరంలోని నర్సరీల సందర్శన



వరంగల్‌లో నర్సరీలో మొక్కలు పర్యవేక్షిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నర్సరీలలో పెంచుతున్న మొక్కలను సంరక్షిస్తూ జాగ్రత్తలు పాటించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మునిసిపల్ హార్టికల్చర్ విభాగం సిబ్బంది పెంచుతున్న నర్సరీలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. అక్కడి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బాలసముద్రం గ్రేవీ యార్డ్, హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ స్కూల్, కోట చెరువు, ఎంహెచ్‌నగర్ పార్క్, క్రిస్టియన్ కాలనీ కమ్యునిటీ హాల్ పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సీజన్‌కు సరిపడా మొక్కలను పెంచి ప్రజలకు అందించే వరకు హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈ శ్రీనివాస్‌తో పాటు హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా మొక్కలు నాటాలి

వర్షాకాలం సీజన్‌లో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రాంతంలో విస్తృతంగా మొక్కలు నాటాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. మంగళవారం గ్రేటర్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో హార్టికల్చర్, మెప్మా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వర్షాకాలం సీజన్‌లో మెప్మా కార్పొరేటర్లు ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. నగరం చుట్టు పక్కల కుంటలు, నీట కొలనుల చుట్టూ ఈత, ఖర్జూర మొక్కలను నాటాలని అన్నారు. మెప్మా సిబ్బంది ఎవెన్యూ ప్లాంటేషన్‌పై దృష్టి సారించాలని అన్నారు. ఈ సీజన్‌లో 15 లక్షల మొక్కలను లక్ష్యంగా చేసుకొని నాటనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, హెచ్‌వోలురమేష్, లక్ష్మారెడ్డి, టీఎంసీ రమేష్, సీవోలు ప్రవీణ్, రమేష్, రాజ్‌కుమార్, శ్రీలత, రజిత, శ్రీనివాసులు, రమ, సఫియా పాల్గొన్నారు.



సకల కళల సంబరా జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

సకల కళల సంబరాల జాతర

- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని
- ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహణ

హనుమకొండ కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం సకల కళల సంబరాల జాతర-2025ను వెయ్యి నూట పదహారు మంది కళాకారులతో నిర్వహించనున్న ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా కళలవైపు తమ దృష్టిని మళ్లించాలని అన్నారు. జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శివ మాట్లాడుతూ.. ఈనెల 12,13 తేదీల్లో జరగనున్న సకల కళల సంబరాల జాతరలో ఆసక్తి ఉన్న వాళ్లు పాల్గొనవచ్చునని అన్నారు. వేదిక పోతన విజ్ఞాన పీఠమని, వివరాలకు 9866951020లో సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పిఆర్ ప్రసాద్, ఆలేటి శ్యాం సుందర్, ప్రముఖ జానపద కళాకారుడు కల శ్రీనివాస్, పులి గణేష్, జనగామ రాము, పిట్ట సాయి పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు

హనుమకొండ కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆకృతి అపార్టుమెంట్‌లో మంగళవారం గోరింటాకు వేడుక జరిగింది. అపార్టుమెంట్‌లోని మహిళలంతా ఒక దగ్గర చేరి చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు.

ఈసందర్భంగా జరిగిన ఉత్సవంలో పాల్గొన్న అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరువరంగం ప్రభాకర్, సంపత్ రావు, డాక్టర్ లోకేష్ గోరింటా విశిష్టతను తెలియచేశారు. మహిళల ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదం అందించిన ఆరోగ్య సంజీవని గోరింటాకు అన్నారు.



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- లేకుంటే ఎమ్మెల్యేలు, కలెక్టర్ నివాసాన్ని ముట్టడిస్తాం..
- బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్

హనుమకొండ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుంటే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల నివాసాలను ముట్టడిస్తామని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ హెచ్చరించారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ హాల్ లో ఎజెండా అంశాలను ప్రస్తావిస్తే కాం గ్రెస్ నాయకులు మైకులు కట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కార్పొరేటర్లకే నిధులు కేటాయిస్తున్నారని మండిపడ్డారు. భద్రకాళి చెరువు పనులపై చర్చకు కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎందుకు భయపడుతున్నారని, దమ్ముంటే చర్చ కు రావాలని సవాల్ విసిరారు. చెరువు పనులను ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరులకు ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సోదా కిరణ్, బోయినపల్లి రంజిత్‌రావు, ఇమ్మడి లోహిత రాజు, సంకు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 9 జూలై 2025

ఫ్యాషన్




ఎఫ్1 సినిమాలో హాలీవుడ్ కథానాయకుడు బ్రాడ్ పిట్ వేసుకున్న నీలం రంగు చొక్కా భారతీయ సంప్రదాయ తంగలియా చేనేత పనితనమే! పిట్ పోషించిన సానీ హేయ్స్ పాత్రకు ప్రామాణికతను తెచ్చిపెట్టడం కోసం, ప్రఖ్యాత కాస్ట్యూమ్స్ డిజైనర్, జులియన్ డే తంగలియా వస్త్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఈ వస్త్రంతో రూపొందే మరికొన్ని దుస్తుల గురించి తెలుసుకుందాం!



తంగలియా తమాషా

అన్ని వస్త్రాలూ అన్ని వాతావరణలకూ అనువుగా ఉండవు. కానీ సహజసిద్ధ రంగులతో, పోగులతో రూపొందే చేనేత వస్త్రాలు ఇందుకు మినహాయింపు. అలాంటి వాటిలో చెప్పుకోదగినది తంగలియా చేనేత. ఇది గుజరాత్, సురేంద్రనగర్, కచ్ జిల్లాలకు చెందిన పూర్వీకుల చేతి వృత్తి. పూసలు లేదా దానాలను పోలిన ఆకృతితో వస్త్రానికి రెండు వైపులా కనిపించే మోటిఫ్‌లను సృష్టించడం ఈ నేత ప్రత్యేకత. బ్రాడ్ పిట్ ధరించిన చొక్కా పర్యావరణానుకూల ఫ్యాషన్‌ను ప్రతిబింబించేలా 100% ప్రక్టోజ్‌లో పులియబెట్టి, సహజసిద్ధ ఇండిగో రంగును అద్దడం జరిగింది. ఈ చొక్కా తయారీ కోసం 8 మంది నిపుణులతో కూడిన చేనేత కళాకారుల బృందం, ఏకంగా తొమ్మిదిన్నర గంటల పాటు కష్టపడడం కూడా చెప్పుకోదగిన విశేషమే!

- **దానా:** దానేదార్ అంటే, గింజల్లా ఉబ్బెత్తుగా కనిపించేవి అని అర్థం. ఈ ఆకృతిని పోలిన సూక్ష్మమైన, పూసలను పోలిన తంగలియా పనితనమే 'దానా'! ఈ నేత ప్రక్రియ తంగలియా వస్త్రాలన్నిట్లో మనకు కనిపిస్తూ ఉంటుంది.
- **జామెట్రీ మోటిఫ్స్:** తంగలియా వస్త్రాల్లో వలయాలు, నిలువు గీతలు, ఇతరత్రా జామెట్రీ ఆకారాలు కూడా కనిపిస్తూ ఉంటాయి.
- **సంప్రదాయ ముద్ర:** ఒకానొకప్పుడు భార్వాడ్ గొర్రెల కాపరుల సమాజం, తంగలియా చేనేతతో శాలువాలు, స్కర్ట్‌లను తయారుచేసుకుంటూ ఉండేది. కానీ నేడు ఈ చేనేత వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొంది, ప్రపంచవ్యాప్త డిజైనర్ల మనసులను దోచుకుంటున్నాయి.



- సంప్రదాయ వస్త్రధారణను ఇష్టపడేవారు, సౌకర్యానికి పెద్ద పీట వేసేవారు తంగలియా వస్త్రాలను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.
- తేలిక రంగుల్లో తయారయ్యే ఈ వస్త్రాలను తేలికపాటి ఆభరణాలతో జత చేయడమే ఉత్తమం. హుందాగా కనిపించాలనుకునే మహిళలు తంగలియా చీరలు, శాలువాలు, లెహంగాలను ఎంచుకోవచ్చు.



న్యూస్‌మేకర్

ఇటీవల ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన యుద్ధం సందర్భంగా ఇరాన్‌లోని రెండు అణు స్థావరాలపై అమెరికా కురిపించిన 'బంకర్ బస్టర్' బాంబులు గొప్ప కచ్చితత్వంతో లక్ష్యాల్ని దెబ్బతీశాయి. ఈ బాంబుల రూపకల్పనలో కీలకపాత్ర వహించిన అన్ డుయోంగ్... కాందిశీకురాలిగా అమెరికాలో అడుగుపెట్టారు. తనకు ఆశ్రయం ఇచ్చిన దేశ సైనికుల కోసం ఏదైనా చేస్తానని సంకల్పం తీసుకున్న ఆమె కృషి... అగ్రరాజ్య యుద్ధ వ్యూహాలకు గట్టి దన్నుగా నిలుస్తోంది.

బంకర్ బాంబ్ లేడీ

అది 2013. యుఎస్‌లోని అరిజోనా రాష్ట్రంలో ఉన్న ఒక పట్టణంలో జరిగిన హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సదస్సుకు ప్రధాన వక్తగా హాజరయ్యారు అన్ డుయోంగ్. సదస్సు ముగిసిన తరువాత ఒక వ్యక్తి ఆమె దగ్గరకు వచ్చాడు. తను అఫ్ఘానిస్థాన్‌లో పని చేసిన సైనికుడినని చెబుతూ "మీరు నా ప్రాణాలను, నా తోటి సైనికుల ప్రాణాలను కాపాడారు. ధన్యవాదాలు" అని అన్నాడు. దీనికి ఆమె బదులిస్తూ "నేనే మీకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. మా కోసం మీ ప్రాణాలను పణంగా పెడుతున్నారు" అని చెప్పారామె. "అతని మాటలు నాకు ఎంతో ఉత్తేజం కలిగించాయి. పదోన్నతులు, పురస్కారాలకన్నా అవి గొప్పవి. ఎందుకంటే... అవి యుద్ధంలో పాల్గొన్న ఒక సైనికుడి నోటి నుంచి వచ్చాయి. అంతకన్నా ఇంకేం కావాలి? నా లక్ష్యం నెరవేరిందనిపించింది" అని అని చెప్పారు అన్. ఆమె లక్ష్యం వెనుక పెద్ద కథే ఉంది.



సర్వం కోల్పోయి...

అన్... వియత్నాంలోని సైగాన్‌లో పుట్టారు. ఆమె తండ్రి దక్షిణ వియత్నాం ప్రభుత్వంలో వ్యవసాయాధికారి. అన్న హెలికాప్టర్ పైలెట్. 1970ల్లో... ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం మధ్య జరిగిన యుద్ధ వాతావరణంలోనే ఆమె బాల్యమంతా సాగింది. అన్న తరచూ యుద్ధంలో పాల్గొనడానికి వెళ్ళేవారు. 'అతను సజీవంగా వస్తారా?' అనే భయంతో ఆ కుటుంబం బిక్కుబిక్కుమంటూ ఉండేది. "నా దగ్గర మంత్రదండం ఉంటే... దాంతో మరింత అధునాతనమైన ఆయుధం తయారు చేసి మా అన్నయ్యకి ఇస్తాను. అప్పుడు అతను యుద్ధంలో గెలిచి, చెక్కుచెదరకుండా ఇంటికి వస్తాడనే ధీమా మాకు ఉంటుంది... అని ఎప్పుడూ అనుకొనేదాన్ని" అని చెబుతారు అన్. తమ ప్రాంతం ఏ క్షణానైనా ఉత్తర వియత్నాం దళాల ఆధీనంలోకి వచ్చే పరిస్థితి ఉండడంతో... ఆమె సోదరుడు తమ కుటుంబాన్ని, దగ్గర బంధువులను... దక్షిణ వియత్నాం తరఫున పోరాడుతున్న అమెరికన్ సైనికుల సాయంతో హెలికాప్టర్‌లో తరలించారు. ఫిలిప్పీన్స్‌కు వెళ్ళే నేవీ నౌకలోకి చేర్చారు. అక్కడి నుంచి వారు యుఎస్ రాజధాని వాషింగ్టన్‌కు రాజకీయ శరణార్థులుగా చేరుకున్నారు. "అమెరికాలో అడుగుపెట్టే సరికి మేము సర్వం కోల్పోయి కట్టుబట్టలతో ఉన్నాం. గొప్పగా బతికిన మా కుటుంబ పరిస్థితిని తలుచుకుంటే ఎంతో బాధ కలిగింది. కానీ వియత్నాం నుంచి పడవల్లో పారిపోవాలని ప్రయత్నించిన వాళ్ళు కొన్ని లక్షల మంది ఉన్నారు. వారిలో సుమారు రెండున్నర లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఆ విధంగా మేము ఎంతో అదృష్టవంతులం. అందుకే... 'నన్ను, నా కుటుంబాన్నీ కాపాడిన అమెరికన్ సైనికుల కోసం... వాళ్ళు వారి తల్లితండ్రుల దగ్గరకు, అక్కాచెల్లెళ్ళ దగ్గరకు క్షేమంగా చేరుకోవడం కోసం నేను చేయగలిగినది ఏదైనా చేస్తాను' అని సైగాన్‌లో మా ఇంటి గేటు దాటుతున్నప్పుడు నాకు నేనే ప్రమాణం చేసుకున్నాను" అంటారు అన్.

67 రోజుల్లోనే...

ఒక చర్చి అండదండలతో ఆమె కుటుంబం కొత్త జీవితాన్ని ప్రారంభించింది. అమెరికా చేరుకున్నాక అన్ ఎదుర్కొన్న మొదటి సమస్య... భాష. కానీ తన ప్రతిభతో, పట్టుదలతో ఆమె ఆ సమస్యను అధిగమించారు. చదువుల్లో కూడా ఎంతో చురుగ్గా ఉండేవారు. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఆనర్స్ డిగ్రీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాక... మేరీల్యాండ్ రాష్ట్రంలోని ఇండియన్ హెడ్ పట్టణం కేంద్రంగా పని చేస్తున్న 'నేవల్ సర్ఫేస్ వార్‌ఫేర్ సెంటర్' (ఎన్‌ఎస్‌డబ్ల్యూసి) ఉద్యోగిగా చేరారు. శక్తిమంతమైన పేలుడు పదార్థాల సమర్థవంతమైన వినియోగంపై పలు ప్రయోగాలు చేశారు. క్రమంగా పేలుడు పదార్థాలు, జలగర్భ ఆయుధాలకు సంబంధించి ఆ కేంద్రం చేపట్టే సాంకేతిక కార్యక్రమాలకు అధిపతి అయ్యారు. అన్, ఆమె బృందం అభివృద్ధి చేసిన పేలుడు పదార్థాలు, 'థర్మోబారిక్' లాంటి బాంబులు వివిధ యుద్ధాల్లో, దాడుల్లో అమెరికా పైచెయ్యి సాధించడానికి దోహదం చేశాయి. 9-11 సంఘటన తరువాత... అల్‌ఖైదా ఉగ్రవాదులు దాక్కొన్న భూగర్భ సొరంగాల్లాంటి లోతైన ప్రదేశాల్లోకి ప్రయాణించగలిగే లేజర్-గైడెడ్ బాంబు 'బిఎల్‌యు 118/బి'ని కేవలం 67 రోజుల్లో అన్ బృందం తయారు చేసింది. ఇరుకైన ప్రదేశాల్లోకి, గుహల్లోకి సైనికులు కాలినడకన వెళ్ళే అవసరం లేకుండా... కచ్చితమైన ఫలితాలను అందించగలిగే ఈ బాంబుల వల్ల అమెరికాకు ప్రాణనష్టం తగ్గింది. అమెరికన్ మీడియా ఆమెను 'బాంబ్ లేడీ' అంటూ ప్రశంసించింది. ఆ తరువాత కొత్తతరం బాంబులు ఎన్నిటినో ఆ బృందం అభివృద్ధి చేసింది. వాటిలో ఒకటైన 'బంకర్ బస్టర్' బాంబులను ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఇటీవలి యుద్ధం సందర్భంగా... ఇరాన్‌లోని రెండు అణు స్థావరాలపై అమెరికా విజయవంతంగా ప్రయోగించింది. దీంతో అన్ పేరు మరోసారి మారుమోగుతోంది.

> **"నా దగ్గర మంత్రదండం ఉంటే... దాంతో మరింత అధునాతనమైన ఆయుధం తయారు చేసి మా అన్నయ్యకి ఇస్తాను. అప్పుడు అతను యుద్ధంలో గెలిచి, చెక్కుచెదరకుండా ఇంటికి వస్తాడనే ధీమా మాకు ఉంటుంది'... అని ఎప్పుడూ అనుకొనేదాన్ని."**



యుద్ధాలంటే ద్వేషం

"నాకు యుద్ధాలంటే ద్వేషం. వాటిని నిరోధించడానికే నేను ఆయుధాలు తయారు చేశాను. అయితే వాటిని ఎలా ఉపయోగిస్తారనేది నా చేతుల్లో ఉండదు. ఆ విషయంలో మా నాయకులమీద నాకు విశ్వాసం ఉంది" అంటారు 65 ఏళ్ళ అన్. వ్యక్తిగత విషయాలకు వస్తే... అధికారిక విధుల నుంచి 2020లో పదవీవిరమణ చేసినా... బాంబుల తయారీకి తన సలహాలను, మార్గదర్శకత్వాన్ని అందిస్తూనే ఉన్నారు. "నా భర్త కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కూడా వియత్నాం కాందిశీకుడే. మాకు నలుగురు పిల్లలు. మేము ఏదైనా సాధించామంటే కారణం మాకు అమెరికాలో లభించిన అవకాశాలే. మా జీవితాలను బలంగా నిర్మించుకోవడానికి అవే దోహదం చేశాయి" అంటారు అన్. ఆమెకు లభించిన అవకాశాలు తన ఎదుగుదలకే కాకుండా... అమెరికా ఆయుధ శక్తిని బలోపేతం చేయడానికి సైతం ఎంతో దోహదం చేశాయనడంలో సందేహం లేదు.

పేరెంటింగ్

ఒత్తిడికి లోనవుతున్నారా?

ప్రస్తుత పరిస్థితుల్లో పెద్దలే కాదు పిల్లలు కూడా ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- బడికి వెళ్లే పిల్లలు రోజూ... హోంవర్క్, పరీక్షలు, ట్యూషన్లు అంటూ చదువులోనే పూర్తిగా నిమగ్నమై ఉంటున్నారు. సెలవు రోజుల్లో కూడా స్మార్ట్ ఫోన్ చూస్తూ అందులోనే ఆటలు ఆడుతూ సమయం గడిపేస్తూ ఉంటారు. దీనివల్ల తెలియకుండానే పిల్లల్లో ఒత్తిడి ప్రారంభమవుతుంది. అలా కాకుండా రోజూ సాయంత్రం పిల్లల చేత ఆటలు ఆడించాలి. ఆటల్లో భాగంగా పరుగెత్తడం, నవ్వడం, అరవడం వల్ల పిల్లల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి ఒత్తిడిని దూరంచేసి సంతోషాన్ని కలిగిస్తాయి. సైకిల్ తొక్కడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం లాంటి వాటిని పిల్లలకు అలవాటు చేయాలి.
- సొంత పనుల్లో మునిగిపోయి పట్టించుకోకపోతే పిల్లల్లో ఒంటరితనం అనే భావన మొదలవుతుంది. ఇది క్రమంగా ఒత్తిడికి దారితీస్తుంది. కాబట్టి పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వాళ్లతో స్నేహపూర్వకంగా మెలగాలి. బడి సంగతుల గురించి అడిగి తెలుసుకోవాలి. వీలైనంత ఎక్కువ సమయాన్ని పిల్లలతో గడపాలి.
- పిల్లలకు రోజూ పోషకాహారం పెట్టాలి. అందులో పాలు, నెయ్యి, తాజా పండ్లు, గింజలు, ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూడాలి. వీటివల్ల శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి ఒత్తిడి దరిచేరదు. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తెచ్చి ఇస్తుంటే పిల్లల సంతోషానికి అవధులు ఉండవు.
- పిల్లలపై కోపాన్ని ప్రదర్శించకూడదు. అలాగని అతిగా గారాబం చేయకూడదు. ప్రతి విషయాన్ని వాళ్లకు అర్థమయ్యే రీతిలో ఓపికగా వివరించి చెప్పాలి. సందర్భానుసారం చక్కగా ప్రవర్తించినప్పుడు పిల్లలను మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. దీనివల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్నపాటి పొగడ్తల వల్ల మెదడులో డోపమైన్ స్థాయి పెరుగుతుంది. దీంతో పిల్లల మనసు ప్రశాంతంగా మారుతుంది.
- ఆటలు, సంగీతం, పాటలు పాడడం, నృత్యం చేయడం, చిన్న కథలు రాయడం లేదా చెప్పడం, బొమ్మలు వేయడం ఇలా ఆసక్తి ఉన్న అంశాన్ని నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లలకు మానసిక ఆనందం కలుగుతుంది. ఒత్తిడీ దరిచేరదు.



ఇలా శుభ్రం చేయాలి..!

మనం రోజూ ఉపయోగించే తువాళ్లు, దిండు గలీబులు, దుప్పట్ల మీద మురికితోపాటు హానికారక బ్యాక్టీరియాలు చేరుతూ ఉంటాయి. వాషింగ్ మిషన్‌లో వేసి ఉతికినప్పటికీ ఒక్కోసారి సరైన ఫలితం కనిపించదు. వీటిని సులువుగా శుభ్రం చేసే చిట్కాల గురించి తెలుసుకుందాం...

- కొంతమంది స్నానం చేసిన తరవాత తువాలును ఇతరత్రా కూడా వాడుతూ ఉంటారు. మధ్యలో ముఖం కడక్కున్నా చేతులు కడిగినా దానికే తుడిచేస్తుంటారు. రోజుల తరబడి ఇలా చేయడం వల్ల తువాలు పసుపు రంగులోకి మారి వాసన పడుతుంది. దీన్ని అలాగే వాడితే అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒక టబ్‌లో ఒక చెంచా ఉప్పు, ఒక చెంచా లిక్విడ్ డిటర్జెంట్ వేసి రెండు మగ్గుల వేడి నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ నీళ్లలో రోజూ వాడే తువాలును అరగంట సేపు నానబెట్టాలి. తరవాత బ్రష్‌తో రుద్ది మంచినీళ్లతో ఉతికి ఎండలో ఆరేయాలి. పది రోజులకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే తువాలు శుభ్రంగా ఉంటుంది.
- దిండు గలీబులు కూడా క్రమంగా జిడ్డు పట్టి నల్లగా మారుతుంటాయి. వీటివల్ల శిరోజాల సమస్యలు, ముఖం మీద మొటిమలు వస్తాయి. అలాకాకుండా వెడల్పాటి టబ్‌లో దిండు గలీబులను పరచి వాటిపై ఉప్పు చల్లాలి. తరవాత రెండు చెంచాల వెనిగర్‌ను, రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్‌ను చుక్కలు చుక్కలుగా వేసి రెండు మగ్గుల వేడి నీళ్లు పోయాలి. అరగంట సేపు అలాగే ఉంచాలి. తరవాత చేతులతో బాగా నలుపుతూ ఉతకాలి. చివరగా మంచినీళ్లలో ముంచి ఆరేయాలి. నెలకు ఒకసారి ఇలా చేస్తూ ఉంటే దిండు గలీబుల మీద మురికి, జిడ్డు పూర్తిగా వదిలిపోతాయి.



సంకల్పం

సంస్కృతి పరిరక్షణ కోసం..

సొంతవాళ్లే 'చదువు అవసరమా' అన్నారు. అయినా సరే చదువుకుని అధ్యాపకురాలిగా మారారు జార్ఖండ్‌కు చెందిన పార్వతీ తిర్కీ. అంతేకాకుండా కవితలతో ఆదివాసీ సంస్కృతిని కాపాడాలని కృషి చేస్తున్నారు. ఆదివాసీల జీవిత నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూ రాసిన 'ఫిర్ ఉగ్నా' అనే కవితా సంకలనానికిగాను ప్రతిష్ఠాత్మక సాహిత్య అకాడమీ యువ పురస్కారం- 2025కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్వగతమిది...



"మాది జార్ఖండ్ గుమ్లా జిల్లాలో ఓ మారుమూల ప్రాంతం. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీవిరమణ పొందారు. అమ్మ గృహిణి. నాకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ఓ సోదరుడు ఉన్నారు. పాఠశాల విద్య మా ప్రాంతంలో పూర్తి చేశాను. ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో హిందీలో గ్రాడ్యుయేషన్, పీజీ , పీహెచ్‌డీ పూర్తి చేశా. మాది ఆదివాసీ కుటుంబం. జాతరకు తప్పనిసరిగా హాజరు కావాలి. కాబట్టి చిన్నప్పుడు బడికి వెళ్తా అన్న ప్రతిసారీ, 'నువ్వు బడికి వెళ్తే, జాతరుకు ఎవరెళ్తారు?' అని అమ్మమ్మ అంటుండేది. అయినా వీలున్న ప్రతిసారీ జాతరకు హాజరవుతూ, అమ్మమ్మను నొప్పించకుండా చదువును కొనసాగించా! ప్రస్తుతం రాంచీలోని రామ్ లఖన్ కళాశాలలో హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. వర్సిటీలో చదువుకునేటప్పుడే ఆదివాసీ సంస్కృతిని అందరికీ తెలిసేలా చేయాలని నిర్ణయించుకున్నా. చిన్నప్పుడు ప్రతి ఏడాది సర్హుల్ అనే ఆదివాసీ పండుగ సమయంలో మా తాతతో కలిసి పాటలు పాడేదాన్ని. ఆ పాటల ద్వారానే నాకు మా కురుఖ్ సంస్కృతి గురించి తెలిసింది. మా పెద్దల మాటలు, పాటల ద్వారా నేర్చుకున్న ఆదివాసీ సంస్కృతిని అందరికీ తెలిసేలా చేయాలని చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా. అందులో భాగంగానే కవితా సంకలనం 'ఫిర్ ఉగ్నా' రాశా. ఇందులో కురుఖ్ తెగ జీవన శైలి, వారి సంస్కృతి, సంప్రదాయలను తెలియజేసే ప్రయత్నం చేశా. ఇటీవల 'ఫిర్ ఉగ్నా'కుగాను సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికయ్యాను. అకాడమీ నుంచి ఫోన్ వచ్చినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. అసలు ఇలాంటి ఒక పురస్కారం వస్తుందని నేను ఊహించలేదు. రావాలని ఆశించనూ లేదు. కానీ ఈ గుర్తింపు వలన ఆదివాసీ సంస్కృతి గురించి మరింత మందికి తెలుస్తుందని అనుకుంటున్నా.

సాహిత్యం మీద మక్కువ

నాకు చిన్నప్పటి నుంచి కూడా సాహిత్యం అంటే చాలా ఇష్టం. అందుకే కవితలు రాస్తుంటా. మా తెగల్లో మేమే పాటలు కంపోజ్ చేసి పాడుతుంటాం. అలానే 'ఫిర్ ఉగ్నా' రాశా. ఇందులోని కవితల్లో ఆదివాసీ తెగలకు నీరు, అడవి, అందులోని జంతువులతో ఉన్న అనుబంధాన్ని వివరించా. అడవులు నీటిని పరిరక్షించాల్సిన అవసరాన్ని కూడా తెలియజేశా. అడవి అనేది ఆదివాసీలకు ఓ వనరు మాత్రమే కాదనీ, వారికి దానితో విడదీయలేని అనుబంధం ఉంటుందని అందులో వివరించే ప్రయత్నం చేశా. మా ఆదివాసీ ప్రాంతంలోనే కాదు.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ నివసించాను. అలా ఇప్పటి వరకు 40-50 గ్రామాలు తిరిగాను. ఆ క్రమంలో ఎంతో మందిని కలిశాను. వారి మాటలు, అక్కడి వాతావరణం మొదలైనవన్నీ ఈ కవితలు రాయడానికి నాకొక ప్రేరణగా మారాయి. వారిని కలవకపోతే నేనీ కవితలు రాయలేకపోయేదాన్నేమో అనిపిస్తోంది.



భాషలు అంతరించకూడదు..

అనేక ఆదివాసీ భాషలు, సంస్కృతులు అంతరించిపోతున్నాయి. 'ధూంకుడియా' అనేది మా సంప్రదాయ అభ్యాస వ్యవస్థ. ఇది ప్రస్తుతం అంతరించిపోయింది. దాంతో ఆ శైలిలో మేం సాహిత్యాన్ని సృష్టించలేకపోతున్నాం. ఇలాగే ఇంకా కొన్ని తెగలకు ఇలాంటి అభ్యాస విధానాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆదివాసీలు వారి జ్ఞానాన్ని, జీవన విధానాలను తెలుసుకుంటారు. ఈ ఆదివాసీ భాషలు, సంస్కృతుల గురించి విద్యా సంస్థల్లో నేర్పరు. కాబట్టి వాటిని కాపాడాలి. అందుకోసమే నేను కృషి చేస్తున్నా. ప్రస్తుతం మన చుట్టూ సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా జరుగుతున్న మార్పుల గురించి కూడా కవితలు రాస్తున్నాను."

పడుకునే ముందు ఇవి తింటే..

మంచి నిద్ర కావాలని అందరూ కోరుకుంటారు. కొన్ని ఆహార పదార్థాలను నిద్రపోయే ముందు తీసుకుంటే కంటి నిండా నిద్ర పోవచ్చు. ఆ ఆహార పదార్థాలేంటో తెలుసుకుందాం...

అరటి పండు: ఇందులో పొటాషియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అవి నిద్రను ప్రోత్సహిస్తాయి.

చెర్రీ: చెర్రీల్లో మెలటోనిన్ ఉంటుంది. ఇది నిద్రను ప్రోత్సహిస్తుంది.

వాల్‌నట్స్: బాదం, వాల్‌నట్స్ నిద్రకు బాగా ఉపయోగపడతాయి. వీటిలోని మెగ్నీషియం కండరాలను సడలింపుకు ఉపయోగపడుతుంది. దాంతో నాణ్యమైన నిద్ర సొంతమవుతుంది.

పాలు: పాలు ఆరోగ్యాన్ని పెంచడమే కాదు నిద్రకు ఉపకరిస్తాయి. పాలల్లో మెలటోనిన్ ఉత్పత్తికి ఉపయోగపడే ట్రిప్టోఫాన్ ఉటుంది. కాబట్టి పడుకునే ముందు గ్లాసు గోరువెచ్చని పాలు తాగితే వెంటనే నిద్ర పడుతుంది.

కివీ: ఇది నిద్రను పోత్రహించే మెదడులోని సెరటోనిన్ అనే రసాయన ఉత్పత్తిని పెంచుతుంది. కాబట్టి పడుకునే ముందు కివీ పండ్లు తింటే మంచి నిద్ర పడుతుంది.



చమోమిలే టీ: నిద్రలేమికి కారణమయ్యే మెదడులోని గ్రాహకాలను అడ్డుకునే ఆపిజెనిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఈ టీలో ఉంటుంది. అందుకే ఈ టీ తాగితే నాణ్యమైన నిద్ర సొంతమవుతుంది.

సర్వమంగళ అలంకరణలో భద్రకాళి



వరంగల్ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 13వ రోజైన మంగళవారం ఉదయం అమ్మవారిని సర్వమంగళ రూపంలో అలంకరించారు.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ కల్చరల్

సర్కారు బడి పిల్లలకు.. సైకిళ్ల కానుక

- పుట్టిన రోజు సందర్భంగా అందించనున్న సంజయ్
- నేడు కరీంనగర్‌లో 20 వేల సైకిళ్ల పంపిణీకి శ్రీకారం



హైదరాబాద్/కరీంనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ వేదికగా ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు 20 వేల సైకిళ్లను అందించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. బుధవారం తన పుట్టిన రోజు సందర్భంగా, ప్రధాని మోదీ కానుకగా ఈ సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రితోపాటు కలెక్టర్ పమేల సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సహా పలువురు ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నారు.

టీటీడీలో పనిచేస్తూ.. చర్చిలో ప్రార్థనలు

- ఏఈవో రాజశేఖరబాబు సస్పెన్షన్

తిరుమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగిగా పనిచేస్తూ చర్చికి వెళుతున్నారన్న అభియోగంపై అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఏఈవో) రాజశేఖర్ బాబును సస్పెండ్ చేస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం తిరుపతి వేలం విభాగంలో ఏఈవోగా పనిచేస్తున్న రాజశేఖర్‌బాబు పుత్తూరులోని ఆయన స్వగ్రామంలో ప్రతి ఆదివారం చర్చికి వెళ్లి ప్రార్థనల్లో పాల్గొంటున్నారంటూ కొన్ని వీడియోలు, ఫొటోలు సహా ఓ వ్యక్తి టీటీడీకి ఫిర్యాదు చేశారు. రాజశేఖరబాబు చర్చికి వెళ్తున్నట్టు టీటీడీ విజిలెన్స్ అధికారుల విచారణలో కూడా తేలింది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు టీటీడీ మంగళవారం ప్రకటించింది.

నిండు కుండలా బతుకమ్మ

ముళ్లచెట్లు, చెత్తాచెదారం, మట్టి దిబ్బలు మాయం.. మునుపటి రూపునకొచ్చిన బతుకమ్మ కుంట





- ప్రాణం పోసిన హైడ్రా.. కొనసాగుతున్న పనులు
- బతుకమ్మల నిమజ్జనం వరకు చెరువు సిద్ధం
- మునుపు 14 ఎకరాల్లో.. కబ్జాలతో 5.15 ఎకరాలే మిగిలాయి

హైదరాబాద్ సిటీ, జూలై8 (ఆంధ్రజ్యోతి): చూస్తున్నారా.. ఈ రెండు ఫొటోల్లో ఎంత తేడా ఉందో! నివాస సముదాయాల మధ్య కనిపిస్తున్న ఈ ఖాళీ స్థలం ఒకప్పుడు చెరువు! దాని పేరు బతుకమ్మ కుంట! ముళ్ల చెట్లు, చెత్తాచెదారం, మట్టిదిబ్బలు, నిర్మాణాల తాలూకు వ్యర్థాలతో నిండి ఉన్న రోజుల్లో అక్కడ చెరువు ఉందని చెబితే ఎవరూ నమ్మేవారు కాదు. రెండో ఫొటోలో.. చుట్టూ కంచె, కాలి నడక కోసం బాట, కోతకు గురవ్వకుండా చేసిన రివిట్‌మెంట్ మధ్య నిండుగా నీళ్లతో కళకళలాడుతోంది బతుకమ్మ చెరువే!! కేవలం నాలుగంటే నాలుగు నెలల్లోనే ఈ చెరువును ఇలా పునరుద్ధరించారు. ఈ క్రెడిట్ అంతా హైడ్రాదే. హైదరాబాద్ జిల్లా అంబర్‌పేట మండలం బాగ్ అంబర్‌పేట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 563లో 14.06 ఎకరాల్లో బతుకమ్మ కుంట ఉన్నట్లుగా 1962-63 నాటి రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. రానురాను చెరువు కబ్జాకు గురై.. 5.15 ఎకరాలే మిగిలాయి. బతుకమ్మ కుంటను బతికించాలంటూ మాజీ ఎంపీ వీహెచ్ కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తూవస్తున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీకి, మంత్రులకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఏర్పాటయ్యాక కమిషనర్ రంగనాథ్‌ను కలిసి బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని కోరారు. రంగనాథ్, బతుకమ్మ కుంటను సందర్శించి, దానిని సుందరీకరించాలని నిర్ణయించారు. కుంట తాలూకు స్థలం తనదేనంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ పొందారు. హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, సంబంధిత శాఖల అధికారులు సర్వే నంబర్ 563లోని రికార్డులను పరిశీలించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం భూమిపై సదరు వ్యక్తికి హక్కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. బతుకమ్మ కుంటను చెరువుగానే గుర్తించాలని తీర్పు ఇచ్చింది.

ఉబికి వచ్చిన నీరు

అడ్డంకులు తొలగిపోవడంతో రూ.7 కోట్లు వెచ్చించి బతుకమ్మ కుంట అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుల్లో భాగంగా ప్రత్యేక వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం పార్క్, ఓపెన్ జిమ్, బతుకమ్మ ఆడుకోవడానికి వేదిక, పచ్చదనం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఏళ్లుగా పేరుకుపోయిన నిర్మాణాల వ్యర్థాలు, ముళ్ల కంప చెట్లు పూర్తిగా తొలగించారు. అనంతరం మైదానంగా మారిన కుంటలో పూడిక తీత పనులు చేపట్టగా మోకాలి లోతు నుంచే నీరు ఉబికి వచ్చింది. ఆ నీరుతోనే కుంటంతా నిండిపోయింది. ఆ నీరు డ్రైనేజీ నీరు కాదని, భూగర్భ జలమేనని వాటర్‌బోర్డు అధికారులు నిర్ధారించారు. బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు వీలుగా.. రానున్న సెప్టెంబరు వరకు బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని హైడ్రా అధికారులు ప్రకటించారు.

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు పనికిరావు

- బ్రెజిల్‌లో ప్రధాని మోదీ
- పాక్, చైనాలకు పరోక్షంగా చురకలు
- బ్రెజిల్ అత్యున్నతపౌర పురస్కారం ప్రదానం



బ్రెజిలియా, జూలై 8 : ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు పనికిరావని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని, దాన్ని సమర్థించే వారిని భారత్, బ్రెజిల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని పరోక్షంగా పాకిస్థాన్, చైనాలను ఉద్దేశించి పేర్కొన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వాతో కలిసి మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఈమేరకు స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో భారత్‌కు బ్రెజిల్ మద్దతు ప్రకటించినందుకు ఆ దేశాధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. కాగా ఈ ఇద్దరు నేతలు పలు అంశాలపై చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఆరోగ్యం, ఔషధాలు, అంతరిక్షం, ఆహారం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు సహకరించుకోవాలని నిర్ణయించినట్లు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. బ్రిక్స్ సమ్మిట్ అనంతరం ప్రధాని మోదీ బ్రెజిలియా చేరుకున్నారు. అల్వొరాడా ప్యాలెస్ వద్ద 114 గుర్రాలతో పెరేడ్ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. కాగా ప్రధాని మోదీకి బ్రెజిల్ అధ్యక్షుడు ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ద గ్రాండ్ కాలర్ ఆఫ్ ద నేషనల్ ఆర్డర్ ఆఫ్ ద సదరన్ క్రాస్' ప్రదానం చేశారు.

ఏపీలో మహిళా ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని కించపరచిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్
- ఏపీ అంతా నిరసనలు వెల్లువెత్తినా.. తన వ్యాఖ్యలకు కట్టుబడే ఉంటానని స్పష్టీకరణ



నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై.. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. "ప్రశాంతిరెడ్డి చెబుతోంది.. నేను అవినీతిలో పీహెచ్‌డీ చేశానంట. మరి నీ సంగతేంది తల్లీ. రేణిగుంట దగ్గర మెస్‌లో పీహెచ్‌డీ చేశావు. బెంగళూరులో, హైదరాబాద్, మద్రాసులో పీహెచ్‌డీ చేశావు. చివరికి మాగుంట లేఅవుట్లో కూడా పీహెచ్‌డీ చేశావు. అది ఏ పీహెచ్‌డీ అనేది అందరికీ తెలుసు. ఆఖరికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని బ్లాక్‌మెయిల్ చేసి పెళ్లి చేసుకుంది. ఆయనో పిచ్చోడు. ఈమెను ఎందుకు చేసుకున్నాడో ఎవరికీ అర్థం కాలే. ఆయన అడిగితే ఏదో మంచి కుటుంబంలో ముక్కుపచ్చలారని అమ్మాయిని ఇచ్చి ఆయనకు పెళ్లి చేసుండేవాళ్లం. ఈ బోరు బావిలో పడిపోయారు. ప్రభాకరరెడ్డిని పెళ్లి చేసుకోకముందు నీ చరిత్ర ఏందమ్మా. నెల్లూరు జిల్లాలో ఏ మారుమూల అడిగినా చెబుతారు. ఆ ప్రభాకరరెడ్డికి కూడా మనసు బాగున్నట్లు లేదు. ఆయనను నానా హింసలు పెడుతున్నట్లు ఉంది. ఆయనకీ అర్థమైనట్లు ఉంది.. ఎందుకొచ్చిన ఖర్మరా అనుకొంటున్నట్లు ఉన్నారు. నేనైతే ప్రభాకరెడ్డికి ఒకటి చెప్పాలనుకున్నా. ప్రభాకరన్నా.. నువ్వు నిద్రలో ఉన్నా చనిపోతావ్... బయట ఎక్కడో ఒకదగ్గర నిన్ను లేపేస్తారు. జాగ్రత్తగా ఉండు.. నీ దగ్గర వేల కోట్ల ఆస్తులున్నాయి. వాటికోసం నిన్ను లేపేస్తారు. ఇప్పటికే రెండు సిట్టింగ్‌లు అయినట్లు మా దగ్గర సమాచారం ఉంది. నడమంత్రపు సిరి రాజమాత కదా..!" అని ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. ఆయన వ్యాఖ్యలపై ఏపీవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అయినా ఆయన తన తీరు మార్చుకోలేదు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... తన వ్యాఖ్యలను నిస్సిగ్గుగా సమర్థించుకున్నారు. "ఆ మాటలకు నేను కట్టుబడి ఉన్నాను. వాటిని వెనక్కు తీసుకోను. నేను చెప్పింది నూటికి నూరు శాతం నిజం. నా మీదకు వ్యక్తిగతంగా వచ్చావు కాబట్టి నేనూ వ్యక్తిగతంగా వచ్చాను. దమ్ము, ధైర్యం ఉంటే ప్రభాకరరెడ్డి, నువ్వు ప్రెస్‌మీట్ పెట్టండి. మళ్లీ దానికి మేం కౌంటర్ ఇచ్చుకుంటాం. ఏదో ఈవీఎంల దయతో ఎంపీలు, ఎమ్మెల్యేలు అయిపోయినంత మాత్రాన పెద్ద పుడింగులు అయిపోయారా మీరంతా?" అని వ్యాఖ్యానించారు. కాగా.. ప్రసన్న వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరమని, మహిళలను అవమానించడం వైసీపీ డీఎన్‌ఏలోనే ఉందని ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడాన్ని ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుందని విమర్శించారు. ఏపీ మంత్రి లోకేశ్ కూడా ప్రసన్న వ్యాఖ్యలను ఖండించారు. 'పెద్ద పెద్ద చదువులు చదివితే సరిపోదు.. ఇంగితజ్ఞానం ఉండాలి' అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అందుకే ఆ ట్యాగ్ తొలగించమన్నా

- విజయ్ దేవరకొండ



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కింగ్‌డమ్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు విజయ్ దేవరకొండ. 'లైగర్' సినిమా సమయంలో ఉపయోగించిన 'ది' ట్యాగ్, ఆ సందర్భంగా జరిగిన రచ్చపై వివరణ ఇచ్చారు. 'నాకు ఏదో ఒక ట్యాగ్ ఇవ్వాలని దర్శకనిర్మాతలు ప్రయత్నించారు. అది నాకిష్టం లేదు. ఫ్యాన్స్ నాపై చూపించే ప్రేమ, అభిమానాలే నాకు చాలు. వారు నన్ను నా నటనతో గుర్తుంచుకోవాలని కోరుకుంటాను. రౌడీ, సదరన్ సెన్సేషన్ ట్యాగ్‌లతో ప్రేక్షకులు నన్ను పిలిచినా నేను వాటిని అంగీకరించలేదు. దాంతో 'లైగర్' సినిమా ప్రచారంలో చిత్రబృందం 'ది' అనే ట్యాగ్‌ను జోడించింది. అయితే ఆ ట్యాగ్ ఎవరికీ లేకపోవడంతో అంగీకరించాను. కానీ తర్వాత చాలా విమర్శలు వచ్చాయి. వెంటనే ఆ ట్యాగ్‌ను తొలగించాలని నా టీమ్‌ని ఆదేశించాను' అని తెలిపారు. ఇక ఇండస్ట్రీ గురించి మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో సపోర్ట్ లేకపోతే, ఏదైనా స్ర్కిప్ట్ మన దగ్గరకు వచ్చినప్పుడు..ఇది బాగోలేదు, ఈ స్ర్కిప్ట్ నేను చేయలేను, ఇంకా మెరుగుపర్చాలి అని చెప్పలేం. అదే ఇండస్ట్రీలో సపోర్ట్ ఉన్న నా సమకాలీన నటుడికే ఈ అవకాశం వస్తే, వెంటనే ఆ స్ర్కిప్ట్ చేయనని నిర్మొహమాటంగా చెప్పేస్తాడు' అని విజయ్ వ్యాఖ్యానించారు.

సందేశంతో వినోదం



సందేశం, వినోదం కలబోతగా తెరకెక్కిన చిత్రం 'పోలీసు వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మించారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్ ప్రధాన తారాగణం. ఈ నెల 18న విడుదలవుతోంది. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ 'ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే సందేశాత్మక చిత్రమిది. మానవ సంబంధాల్ని చక్కగా ఆవిష్కరించాం. అలరించే భావోద్వేగాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి' అని చెప్పారు. బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ 'కుటుంబంతో చూడదగ్గ వినోదాత్మక చిత్రమిది. నవ్వించడంతో పాటు చక్కటి సందేశంతో దర్శకుడు తెరకెక్కించారు. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు.

ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా

హృతిక్ రోషన్



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'వార్'కు ఇది సీక్వెల్. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తి కావడంతో టీమ్ అంతా సెలబ్రేట్ చేసుకుంది. ఈ విషయాన్ని అభిమానులతో ఎక్స్ వేదికగా పంచుకున్నారు ఎన్టీఆర్. "ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చిన 'వార్ 2' చిత్రీకరణ పూర్తైంది. హృతిక్ రోషన్‌తో పనిచేయడం ఎంతో సరదాను ఇచ్చింది. అపారమైన ఆయన ఎనర్జీ లెవెల్స్ అంటే నాకెంతో అభిమానం. ఆయన నుంచి చాలా నేర్చుకున్నా. దర్శకుడు అయాన్ ముఖర్జీ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేయడానికి సిద్ధమయ్యారు" అని పేర్కొన్నారు. మరోవైపు, హృతిక్ కూడా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టి భావోద్వేగానికి గురయ్యారు. "మనసంతా భావోద్వేగాలతో నిండిపోయింది. 149 రోజుల షూట్‌లో చేసిన అద్భుతమైన యాక్షన్, వేసిన డ్యాన్సులు, అయ్యిన గాయాలు.. అన్నీ మరపురానివి. ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అని అన్నారు. ఆగస్టు 14న సినిమా విడుదల కానుంది. కియారా అద్వాణీ కథానాయిక. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.

తొలి హిందీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు



కథానాయికగా దక్షిణాదిన తనకంటూ సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు సాయిపల్లవి. కొన్నాళ్లుగా ఆమె బాలీవుడ్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. సాయిపల్లవి కథానాయికగా నటించిన తొలి హిందీ చిత్రం 'ఏక్ దిన్' విడుదల తేదీ ఖరారైంది. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబర్ 7న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ రొమాంటిక్ లవ్‌స్టోరీలో ఆమిర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటించారు. సునీల్‌పాండే దర్శకుడు. ఇక సాయిపల్లవి నటిస్తున్న మరో హిందీ చిత్రం 'రామాయణ్' వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

కదిలించే భావోద్వేగాలతో...



రమేశ్ ఉప్పు కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'వీడే మన వారసుడు'. లావణ్య రెడ్డి, సర్వాణి మోహన్ హీరోయిన్లు. ఈ నెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత రమేశ్ ఉప్పు మాట్లాడుతూ "రైతుల కష్టాలను అర్థవంతంగా ఆవిష్కరించిన చిత్రమిది. ఇందులోని భావోద్వేగాలు ప్రతీ ఒక్కరినీ కదిలిస్తాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

- కీరవాణి తండ్రి శివశక్తి దత్తా కన్నుమూత



'కళ లేకపోతే జీవితమే లేదు' అంటూ చిన్నతనం నుంచి కళపై మక్కువ పెంచుకుని, కళారంగంలో ఉన్నతస్థాయికి ఎదిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సంగీత దర్శకుడు కీరవాణి తండ్రి శివశక్తి దత్తా ఇక లేరు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో కొన్నాళ్లుగా బాధ పడుతున్న ఆయన సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ మణికొండలోని తన ఇంట్లో కన్ను మూశారు. దర్శకుడు రాజమౌళి, గుణ్ణం గంగరాజు, మహేశ్‌బాబు తదితరులు ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించారు. శివశక్తిదత్తా అంత్యక్రియలను ఫిల్మ్‌నగర్ మహాప్రస్థానంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు.

1932 అక్టోబర్ 8న జన్మించిన శివశక్తి దత్తా అసలు పేరు కోడూరి సుబ్బారావు. ఆయన తండ్రి విజయ అప్పారావు ఆ రోజుల్లోనే పెద్ద కాంట్రాక్టర్. హైవే వర్క్స్, పీడబ్ల్యూ డి వర్క్స్ చేసేవారు. ఆయన రెండో సంతానమే సుబ్బారావు. ఊహ తెలిసిన తర్వాత తన పేరుని బాబూరావుగా మార్చుకున్నారు సుబ్బారావు. పదిహేనేళ్ల వయసు వచ్చాక చిత్ర లేఖనం నేర్చుకోవాలనే కోరికతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ముంబై వెళ్లి, అక్కడ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో చేరారు. రెండేళ్ల తర్వాత సొంతవూరుకి తిరిగి వచ్చి తను నేర్చుకున్న చిత్ర లేఖనంతో అందర్నీ ఆశ్చర్యపరిచారు. 'కమలేశ్' పేరుతో ఆయన గీసిన చిత్రాలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత తన పేరుని 'శివశక్తి దత్తా' గా మార్చుకుని చివరి వరకూ అదే పేరుతో కొనసాగారు సుబ్బారావు.

ఆడ గొంతుతో పాటలు

శివశక్తి దత్తా ప్రతిభ కుంచెకే పరిమితం కాలేదు. సంగీతంపై మక్కువ కలిగి వీణ, గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. కథలు, కవితలు రాసేవారు. పాత సినిమాల్లో భానుమతి, కన్నాంబ, ఎస్.వరలక్ష్మి పాటలు అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆడ గొంతుతో ఆయన కాలేజీ ఫంక్షన్స్‌లో పాటలు పాడుతుంటే జనం మైమరచి వినేవారు. ఆయన పాట లేకుండా ఆ రోజుల్లో కాలేజీలో ఏ ఫంక్షన్ ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. సినిమా రంగం కూడా ఆయన్ని ఆకర్షించడంతో మద్రాసు వెళ్లి ఎల్వీ ప్రసాద్ దగ్గర అసిస్టెంట్‌గా చేరారు శివశక్తి దత్తా. రెండేళ్లు ఆయన దగ్గర పని చేసిన తర్వాత దర్శకుడు హేమాంబరధరరావు దగ్గర చేరారు. ఆయన తొలి చిత్రం 'తండ్రులు కొడుకులు' లో ఓ చిన్న పాత్ర కూడా పోషించారు. ఆ తర్వాత వారి తండ్రి మరణంతో సొంతవూరు వెళ్లిన శివశక్తి దత్తా 16 ఏళ్ల పాటు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో బాగా డబ్బు సంపాదించి, సొంతంగా సినిమాలు తీద్దామనే ఉద్దేశంతో తమ్ముడు విజయేంద్ర ప్రసాద్‌తో కలసి మళ్లీ మద్రాసులో అడుగుపెట్టారు. సొంత సినిమా నిర్మాణం వారికి కలసి రాలేదు. ఉన్న డబ్బు అంతా పోయింది. బతుకు తెరువు కోసం ఘోస్ట్ రైటర్స్‌గా చాలా చిత్రాలకు పని చేశారు. చివరకు దర్శకుడు రాఘవేంద్రరావు ప్రోత్సాహంతో 'జానకి రాముడు' 'జగదేకవీరుడు అతిలోక సుందరి' 'నారీ నారీ నడుమ మురారి' వంటి చిత్రాలకు రచన చేశారు.

నాలుగు భాషల్లో పాటలు

శివశక్తి దత్తా ప్రతిభా శాలి. తెలుగు చిత్రాల్లో పాటలు రాయడమే కాకుండా తమిళం, కన్నడం, హిందీ నేర్చుకుని ఆయా భాషా చిత్రాల్లో పాటలు రాశారు. సంస్కృతంలో కూడా పాండిత్యం ఉండడంతో ఆ భాషలో కూడా పాటలు రాశారు. ప్రభాస్ హీరోగా రాజమౌళి రూపొందించిన 'ఛత్రపతి' చిత్రంలో 'అగ్ని స్కలన సందగ్దయుతు వర్గ ప్రళయ రథ ఛత్రపతి' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను సంస్కృతంలోనే శివశక్తి దత్తా రాశారు. అలాగే 'బాహుబలి'లో 'మమతల తల్లి', 'ధీవర' పాటలను ఆయన రాశారు. ఎన్‌టీఆర్ బయోపిక్ 'కథానాయకుడు'లో టైటిల్ సాంగ్ కూడా రాశారు.



కొడుకుకు ఆ రాగం పేరు

శివశక్తి దత్తాకు కొడుకు కీరవాణి అంటే ఎంతో అభిమానం. ఆయనకు కూడా తండ్రి అంటే ప్రాణం. 'విప్రనారాయణ' చిత్రంలోని 'ఎందు కోయి తోటమాలీ' పాట అంటే శివశక్తి దత్తాకు ఎంతో ఇష్టం. కీరవాణి రాగంతో ఆ పాటను స్వరపరిచారని తెలుసుకున్న శివశక్తి దత్తా తన కొడుకుకి అదే పేరు పెట్టారు. సంగీతమే తన కుమారుడి రూపంలో జన్మించిందని తరచూ చెప్పే శివశక్తి దత్తా కీరవాణి ఆస్కార్ అవార్డ్ అందుకుంటున్నప్పుడు ఉద్వేగానికి లోనయ్యారు.

దర్శకుడిగానూ...

శివశక్తి దత్తా దర్శకుడిగా కూడా తన ప్రతిభ చాటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'పిల్లన గ్రోవి' చిత్రంలో జేవీ సోమయాజులు ప్రధాన పాత్ర పోషించారు. 1995లో మొదలైన ఈ చిత్రంలో మూగ బాలికగా ఐదేళ్ల ఎం.ఎం.శ్రీలేఖ కీలక పాత్ర పోషించారు. ఉన్న డబ్బంతా ఖర్చు కావడంతో పతాక సన్నివేశాలు తీయడానికి డబ్బు లేక సినిమా ఆగిపోయింది. ఈ సినిమాలో శివశక్తి దత్తా, ఆయన సోదరులతో పాటు రాజమౌళి, కీరవాణి కూడా నటించడం విశేషం. ఆ సినిమాకు కీరవాణి సంగీత దర్శకుడు. ఈ ప్రింట్ ఇప్పటికీ చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లోని బాక్సుల్లో భద్రంగా ఉంది. ఆ తర్వాత 'అర్ధాంగి' చిత్రానికీ, 'చంద్రహాస్' సినిమాకు ఆయన దర్శకత్వం వహించారు. చిత్ర పరిశ్రమలో ఇన్ని శాఖలలో పని చేసినా దర్శకత్వం అంటేనే తనకు ఇష్టమని శివశక్తి దత్తా చెప్పేవారు.

ప్రముఖుల నివాళి

శివ శక్తి దత్తా మరణం పట్ల తెలంగాణ ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. చిత్రకారుడిగా జీవితాన్ని ప్రారంభించి, తన దైన శైలిలో రచనలు చేస్తూ, ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న శివశక్తిదత్తా ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కోరారు. 'శివశక్తి దత్తా శివైక్యం చెందారన్న వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని చిరంజీవి అన్నారు. 'కళలు, సాహిత్యంపై ఎంతో మక్కువ కలిగిన మంచి మనిషి శివశక్తి దత్తా. ఆయన మరణం బాధించింది. వారి కుటుంబానికి నా సానుభూతి' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

స్పోర్ట్స్

వరంగల్ ● బుధవారం 9 జూలై 2025

దీప్తి @ 2

మహిళల టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిండియా స్పిన్నర్ దీప్తి శర్మ టీ20ల్లో నెంబర్‌వన్ బౌలర్‌గా నిలిచేందుకు అడుగుదూరంలో నిలిచింది. తాజా ర్యాంకింగ్స్ బౌలర్ల విభాగంలో దీప్తి ఓ స్థానం మెరుగై రెండో ర్యాంక్‌కు చేరుకుంది. పాక్ బౌలర్ సాదియా ఇక్బాల్ టాప్‌లో ఉంది. సాదియా (746)కు దీప్తి (738)కి మధ్య 8 రేటింగ్ పాయింట్లే దూరం. రేణుకా సింగ్ 6వ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. బ్యాటర్లలో స్మృతి మంధాన 3వ ర్యాంక్‌లో ఉండగా, జెమీమా రెండు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచింది.

భారత్ x ఇంగ్లండ్
మహిళల నాలుగో టీ20 నేడు
రాత్రి 11 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

సెమీస్‌కు సబలెంక

అల్కారజ్, ఫ్రిట్జ్, అమందా కూడా..



లండన్: వింబుల్డన్ మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ అర్యానా సబలంక వరుసగా మూడోసారి సెమీఫైనల్లో ప్రవేశించింది. మంగళవారం హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో సబలెంక (బెలారస్) 4-6, 6-2, 6-4తో అన్‌సీడెడ్ లౌరా సీగెముండ్ (జర్మనీ)పై గెలిచింది. 2021, 2023 టోర్నీల్లోనూ సబలెంక సెమీస్‌కు చేరగా.. 2022, 2024ల్లో పాల్గొనలేదు. 8వ సీడ్ స్వియటెక్ (పోలెండ్) 6-4, 6-1తో టౌసన్ (డెన్మార్క్)పై, ఏడో సీడ్ ఆంద్రీవా 6-2, 6-3తో నవారో (యూఎస్ఏ)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

అల్కారజ్ అలవోకగా..: పురుషుల డిఫెండింగ్ చాంపియన్, రెండోసీడ్ అల్కారజ్ అలవోకగా సెమీస్‌లో అడుగు పెట్టాడు. క్వార్టర్స్‌లో అల్కారజ్ (స్పెయిన్) 6-2, 6-3, 6-3తో నోరి (బ్రిటన్)ని వరుససెట్లలో చిత్తు చేశాడు. ఐదోసీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 6-3, 6-4, 1-6, 7-6తో ఖచనోవ్ (రష్యా)ను ఓడించి కెరీర్‌లో తొలిసారి ఇక్కడ సెమీస్ చేరాడు. అంతకుముందు వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్ (ఇటలీ) వాకోవర్ కారణంగా క్వార్టర్స్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో 19వ సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 7-5, 2-2తో స్పష్టమైన ఆధిక్యంలో దూసుకుపోతున్న వేళ.. అతను హఠాత్తుగా ఛాతీ కండరాల నొప్పితో తప్పుకొన్నాడు. షెల్టన్ (యూఎస్ఏ) 3-6, 6-1, 7-6, 7-5తో సొనెగో (ఇటలీ)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు.



వింబుల్డన్‌లో 'విరుష్క'

విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మ జోడీ సెంటర్ కోర్టులో జొకోవిచ్-డి మినార్ మధ్య మ్యాచ్‌ను రాయల్ బాక్స్‌లో కూర్చుని తిలకించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'క్రికెట్‌లోకన్నా వింబుల్డన్‌లోనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. వరల్డ్‌కప్‌లో భారత్-పాక్ మ్యాచ్ తరహా టెన్షన్ ఇక్కడ ప్రతీ మ్యాచ్‌లోనూ కనిపిస్తుంటుంది' అని విరాట్ అన్నాడు.

నెట్స్‌లో బుమ్రా జోరుగా..!

లార్డ్స్ టెస్ట్ కోసం టీమిండియా ప్రాక్టీస్



లండన్: సిరీస్ సమం చేసిన జోష్‌లో ఉన్న భారత్.. గురువారం నుంచి లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్ కోసం సిద్ధమవుతోంది. పని భారం కారణంగా గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకొన్న పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నెట్స్‌లో బుమ్రా తీవ్రంగా శ్రమించాడు. ఆ తర్వాత లెఫ్టామ్ స్పిన్నర్లు, త్రోడౌన్ స్పెషలిస్టులతో బ్యాటింగ్ కూడా ప్రాక్టీస్ చేశాడు. కెప్టెన్ గిల్, రాహుల్, జైస్వాల్, పంత్, ఆకాశ్‌దీప్, సిరాజ్ నెట్స్‌కు దూరంగా ఉన్నారు.

డోప్ పరీక్షల్లో విఫలం..

రెజ్లర్ రీతికపై సస్పెన్షన్



న్యూఢిల్లీ: గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో క్వార్టర్‌ఫైనల్ చేరిన భారత యువ మహిళా రెజ్లర్ రీతిక హుడా డోప్ పరీక్షల్లో విఫలమైంది. ఇక్కడి ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయ శిక్షణ శిబిరం సెలెక్షన్ ట్రయల్స్‌లో భాగంగా జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిర్వహించిన డోప్ పరీక్షలో రీతిక (76 కిలోలు) పాజిటివ్‌గా తేలింది. దీంతో రీతిక వెంటనే శిక్షణ శిబిరాన్ని వీడింది. తక్షణమే ఆమెపై సస్పెన్షన్ విధిస్తున్నట్టు నాడా ప్రకటించింది. ఈనెల 7 నుంచి సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని తెలిపింది. కాగా, రీతికపై ఏడాదిపాటు నిషేధం విధించే అవకాశముందని సమాచారం. రీతికతో పాటు మరో ఇద్దరు రెజ్లర్లు కూడా డోప్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలడంతో వారు కూడా తాత్కాలిక సస్పెన్షన్‌కు గురైనట్టు తెలిసింది. దేశ టాప్ రెజ్లర్లలో ఒకరైన 22 ఏళ్ల రీతిక.. ఈ ఏడాది ఆరంభంలో ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం, మేలో జరిగిన ఉలాన్‌బాటర్ ర్యాంకింగ్ సిరీస్‌లో స్వర్ణం గెలిచింది.

స్విస్ చెస్‌లో అర్జున్‌కు టాప్ సీడ్

న్యూఢిల్లీ: ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసికి టాప్ సీడింగ్ దక్కింది. ఉజ్బెకిస్థాన్‌లో సెప్టెంబరు 3 నుంచి 16 వరకు పోటీలు జరగనున్నాయి. వరల్డ్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు రెండో సీడ్, ప్రజ్ఞానందకు నాలుగో సీడ్ లభించింది. మహిళల విభాగంలో కోనేరు హంపి, డిఫెండింగ్ చాంప్ వైశాలి బరిలో నిలవనున్నారు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ విజయం

బులవాయో: జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి రోజు మంగళవారం రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 236 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఆ జట్టు టెస్టు చరిత్రలో మూడో అతిపెద్ద విజయమిది. ఓవర్‌నైట్ స్కోరు 51/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 220 పరుగులకు ఆలౌటైంది. వెల్చ్ (55), ఇర్విన్ (49) రాణించారు. బాష్‌కు 4, ముత్తుసామికి 3, యూసుఫ్‌కు 2వికెట్లు దక్కాయి. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 626/5 డిక్లేర్, జింబాబ్వే 170 పరుగులు చేశాయి.



గ్రామీణ క్రికెట్

- 90 ఏళ్లలో జిల్లాల్లో ఒక్క స్టేడియం కూడా కట్టని వైనం
- జిల్లాలకు 9, హైదరాబాద్‌కు 200పైగా జట్లా?
- కొత్త జిల్లాలకు, క్లబ్‌లకు గుర్తింపు ఇవ్వకుండా తాత్సారం
- రాష్ట్రంలో మరో కొత్త క్రికెట్ సంఘం కోసం డిమాండ్

గోడు పట్టదా?

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పేరుకి తగ్గట్టే రాజధాని ప్రాంత క్రికెట్ అభివృద్ధి సంఘంలా తయారైంది. 1934లో హెచ్‌సీఏ ఆవిర్భవించినప్పటినుంచి ఇప్పటివరకు జిల్లాల్లో ఒక్క టర్ఫ్ వికెట్ ఉన్న స్టేడియం కూడా నిర్మించలేదు. 65 శాతం జనాభా గల జిల్లాల నుంచి క్రికెటర్లు ఆడేందుకు తొమ్మిదే జట్లుంటే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 35 శాతం క్రికెటర్లు పోటీ పడేందుకు ఏకంగా 205 జట్లున్నాయి. గ్రామీణ క్రికెట్‌పై అనాదిగా హెచ్‌సీఏ శీతకన్ను వేసిందనేందుకు ఇదే నిదర్శనం. ప్రస్తుత కార్యవర్గం చేతిలోకి హెచ్‌సీఏ పగ్గాలు వచ్చాక గుడ్డిలో మెల్ల అనేలా మహబూబ్‌నగర్ జిల్లాలో టర్ఫ్ వికెట్ నిర్మించేందుకు సుమారు రూ.60 లక్షల నిధులను గత ఏడాది మంజూరు చేసింది. ఇది మినహా మిగిలిన ఎనిమిది జిల్లాల్లో హెచ్‌సీఏ స్టేడియం ఒక్కటీ లేదు. రాష్ట్రంలో ధనిక క్రీడా సంఘంగా చెప్పుకునే హెచ్‌సీఏకి హైదరాబాద్‌లో కూడా ఉప్పల్, సికింద్రాబాద్ జింఖానా స్టేడియాలు మినహా ఒక్క సొంత మైదానం కూడా లేదు. కారణం ఈ సంఘంలోని మూడు గ్రూపులకు చెందిన వారే హైదరాబాద్ శివార్లలో క్రికెట్ మైదానాలు నిర్మించి వాటిని హెచ్‌సీఏకి అద్దెకు ఇస్తుంటారు. హెచ్‌సీఏ సొంత స్టేడియాలు నిర్మిస్తే తమ ఆదాయానికి గండి పడుతుందన్నది వీళ్ల భయం.

క్లబ్ క్రికెట్ పేరిట దందా!

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 205 క్లబ్‌లతో హెచ్‌సీఏ డివిజన్ లీగ్‌లు నిర్వహిస్తారు. ఈ లీగ్స్‌లో హైదరాబాద్ పరిసర క్రికెటర్లందరూ ఏడాది పొడవునా ఆడేందుకు ఒక టోర్నమెంట్ వ్యవస్థ ఉంది. దేశవాళీ టోర్నీలకు క్రికెటర్లను ఎంపిక చేయాలంటే ఈ లీగ్స్‌లో ప్రదర్శనే ప్రామాణికం. జిల్లాల్లో ఈ క్లబ్‌లు, లీగ్ వ్యవస్థ లేకపోవడంతో గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరుగుతోంది. జిల్లాల జట్లు, క్లబ్‌ల సంఖ్య పెరిగితే హైదరాబాద్ పరిధిలోని క్లబ్‌లలో అనధికారికంగా డబ్బులిచ్చి ఆడేందుకు వచ్చేవారు ఆగిపోతారనే భయంతో హెచ్‌సీఏలోని కొందరు దళారులు కొత్త జిల్లాలు, క్లబ్‌లకు సభ్యత్వం ఇవ్వకుండా మోకాలడ్డుతున్నారు. 65 శాతం జనాభా గల గ్రామీణ తెలంగాణ క్రికెటర్లలో ఎంత మంది ప్రతిభావంతులున్నా ఉమ్మడి జిల్లాల తొమ్మిది జట్లలోనే ఆడాల్సి రావడం దురదృష్టకరం. హెచ్‌సీఏలోని కొందరు తమ క్లబ్‌లను ఏడాదికి రూ.15 లక్షలు చొప్పున అనధికారికంగా లీజుకు ఇస్తారని తెలుస్తోంది. కోచ్‌ల రూపంలో ఉండే కొందరు వ్యక్తులు జట్టులో ఆడిస్తామని ఆశ చూపి క్రికెటర్ల తల్లిదండ్రుల నుంచి డబ్బు దండుకుంటున్నారు. గత రెండు దశాబ్దాల్లో ఈ దందా బాగా విస్తరించింది.

రూ.2.5 కోట్లు పలుకుతున్న హెచ్‌సీఏ క్లబ్!

గత 25 సంవత్సరాల్లో హెచ్‌సీఏ ఒక్క కొత్త క్లబ్‌కు కూడా సభ్యత్వం ఇవ్వలేదు. గత రెండేళ్లలో ఇద్దరు కాంగ్రెస్ ఎంపీలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కూడా కోట్లు వెచ్చించి క్లబ్‌లు కొనుగోలు చేశారంటే వాటి డిమాండ్ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ క్లబ్‌ల ధర రూ.2.5 కోట్లు పలుకుతుందని సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో 94 నియోజకవర్గాలకు ఒక్కో క్లబ్, 31 కొత్త జిల్లాలకు సభ్యత్వాలు ఇస్తే 125 కొత్త జట్ల తరఫున గ్రామీణ క్రికెటర్లకు ఆడేందుకు అవకాశం వస్తుంది. క్లబ్‌ల నిర్వహణపై దర్యాప్తు చేసి, హెచ్‌సీఏ నిబంధనలను పాటించని వాటి గుర్తింపు రద్దు చేయడంతో పాటు, ఒకే కుటుంబం, వారి బంధువులు, బినామీల పేరిట ఉన్న మల్టీపుల్ క్లబ్‌లపై గతంలో జస్టిస్ లావు నాగేశ్వరరావు తొలగించిన నిషేధాన్ని కొనసాగిస్తే హెచ్‌సీఏలోని అవినీతికి అడ్డుకట్ట పడుతుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలకు కొత్త సంఘం కావాలి!

హెచ్‌సీఏలో పాతుకుపోయిన ముఠాల వల్ల తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి జరగదని మాజీ క్రికెటర్లు, వర్ధమాన క్రీడాకారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లాల్లో కార్యకలాపాలపై హెచ్‌సీఏ శ్రద్ధ వహించకపోవడంతో హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన 31 కొత్త జిల్లాలకు బీసీసీఐ కొత్త క్రికెట్ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. ఇప్పటికే జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి అంటూ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (క్యాట్), తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) లాంటి సంఘాలు ఏర్పాటయ్యాయి. వీళ్లంతా ఒక్కటై జిల్లాల్లో క్రికెట్‌కు సంబంధించిన సమస్యపై దృష్టి పెట్టాలని గ్రామీణ క్రికెటర్లు కోరుతున్నారు. జిల్లాలన్నింటికి ఒక కొత్త క్రికెట్ సంఘం రూపుదిద్దుకుంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి- హైదరాబాద్)

అందరూ కలిసి రావాలి..



జిల్లాల్లో క్రికెట్‌ను అభివృద్ధి చేసేందుకు, గ్రామీణ క్రికెటర్లకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు అందరూ ఒక్క తాటిపైకి రావాలి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అని కాకుండా ఏ పార్టీ అధికారంలో ఉన్నా హెచ్‌సీఏ పెద్దలు వారితో అంటకాగుతూ తమ పబ్బం గడుపుకొంటున్నారు. ఇది క్రికెటర్ల భవిష్యత్‌కు తీవ్ర నష్టం చేస్తోంది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లో సత్తా చాటుతున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలాంటి ప్రతిభావంతులకు తెలంగాణలో కొదవ లేదు. హైదరాబాద్ మినహా మిగిలిన జిల్లాలతో కొత్త క్రికెట్ సంఘం ఏర్పాటు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు బీసీసీఐకి లేఖ రాయాలి.

- అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి
(తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం చైర్మన్)

25 శాతం నిధులు ఇవ్వాల్సిందే!



బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు వచ్చే నిధుల్లో 25 శాతం ప్రత్యేకంగా జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తామని గత ఏజీఎంలో తీర్మానించారు. అయితే ఈ నిర్ణయం ఆచరణకు నోచుకోలేదు. తక్షణమే ఆ హామీని నెరవేర్చాలి. నిరుడు ఖర్చు చేయని ఆ 25 శాతం నిధులను కూడా ఈ ఏడాది జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి వెచ్చించాలి. జిల్లా క్రికెట్ సంఘాలను బలోపేతం చేసేందుకు కొత్త జిల్లాలకు గుర్తింపు, జిల్లాల్లో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి.

- వి. ఆగంరావు
(కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు)

బిజినెస్

జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు

నా హయాంలోనే షురూ..



సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్

ముంబై: మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల ద్వారా భారత స్టాక్ మార్కెట్ నుంచి అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించిన అమెరికన్ హెడ్జ్ ఫండ్ కంపెనీ జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు తన హయాంలోనే మొదలైందని సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మంగళవారం అన్నారు. 2024 ఏప్రిల్ నుంచే జేన్ స్ట్రీట్ ట్రేడింగ్ విధానాలపై విచారణను ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే, జేన్ స్ట్రీట్ ఉదంతాన్ని నియంత్రణ వైఫల్యంగా చిత్రీకరించడం దురదృష్టకరమని ఆమె పేర్కొన్నారు. జేన్ స్ట్రీట్ మార్కెట్ సూచీలను కృత్రిమంగా ప్రభావితం చేసినట్లు గుర్తించడంతో పాటు అనైతిక ట్రేడింగ్ వ్యూహాలకు స్వస్తి పలకాలంటూ 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి మధ్య కాలంలో కంపెనీకి సర్క్యులర్లు, హెచ్చరికల జారీ సహా పలు చర్యలను సెబీ చేపట్టిందన్నారు. సెబీ సారథ్యం నుంచి బుచ్ ఈ మార్చిలో తప్పుకున్నారు. ఆమె స్థానాన్ని తుహిన్ కాంత పాండే భర్తీ చేశారు. కాగా, జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి తమ ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని నియంత్రణ మండలి ఆదేశించింది.

సెబీ ఆదేశాలను సవాలు చేయనున్న జేన్ స్ట్రీట్

కంపెనీపై సెబీ అభియోగాలను తోసిపుచ్చిన జేమ్‌స్ట్రీట్.. నియంత్రణ మండలి ఆదేశాలను చట్టపరంగా సవాలు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. కాగా, తాను అక్రమంగా లబ్ధి పొందేందుకు మార్కెట్ సూచీలను కృత్రిమంగా ప్రభావితం చేయడం ద్వారా చిన్న ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చిన జేమ్ స్ట్రీట్‌పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కొందరు మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా కంపెనీపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకూ నియంత్రణ మండలికి సెబీ చట్టం అధికారం కల్పిస్తుందని న్యాయ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఈ మెసేజింగ్ యాప్‌కు ఇంటర్నెట్ అవసరం లేదు..!

బిట్‌చాట్‌ను విడుదల చేసిన ట్విటర్ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే

బ్లూటూత్ టెక్నాలజీ ఆధారంగా సందేశాలు పంపే సదుపాయం



న్యూయార్క్: 'ఎక్స్'గా పేరు మార్చుకున్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే బిట్‌చాట్ పేరుతో సరికొత్త మెసేజింగ్ యాప్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం బీటా వెర్షన్‌లో అందుబాటులో ఉన్న ఈ అప్లికేషన్ ద్వారా సందేశాలు పంపేందుకు ఇంటర్నెట్, వైఫై, మొబైల్ నెట్‌వర్క్, ఫోన్ నంబరు, సర్వర్లు, యూజర్ ఐడీ లాంటివేమీ అవసరం లేదు. సమాచార గోప్యతకు అత్యంత ప్రాధాన్యమిచ్చేందుకు బ్లూటూత్ సాంకేతికత ఆధారంగా పనిచేసే ఆఫ్ గ్రిడ్ పీర్-టు-పీర్ మెసేజింగ్ (ఒక వ్యక్తి మరో వ్యక్తికి సందేశాలు పంపే) ప్లాట్‌ఫామ్ ఇది. అంటే, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ లేని సమయంలోనూ బ్లూటూత్ మెష్ నెట్‌వర్క్ ద్వారా ఈ యాప్ నుంచి ఒక వ్యక్తి తన సమీప వ్యక్తికి సందేశం పంపేందుకు వీలుంటుందన్నమాట. వాట్సాప్, మెసెంజర్ వంటి సెంట్రలైజ్డ్ (కేంద్రీకృత) మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌కు ఇది ప్రత్యామ్నాయం కానుంది.

మళ్లీ గోల్డ్‌మన్ శాక్స్‌కు రుషీ సునాక్

అడ్వైజర్‌గా చేరిన బ్రిటన్ మాజీ ప్రధాని



లండన్: బ్రిటన్ మాజీ ప్రధాని రుషీ సునాక్ మళ్లీ వృత్తిబాట పట్టారు. అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్‌లో సునాక్ సీనియర్ సలహాదారు (అడ్వైజర్)గా చేరనున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం పేర్కొంది. 2024 జూలైలో జరిగిన బ్రిటన్ ఎన్నికల్లో సునాక్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీ ఘోర ఓటమి పాలైంది. అనంతరం సునాక్ బ్రిటన్ ప్రధాని పదవితో పాటు పార్టీ ఆధ్యక్ష హోదా నుంచీ తప్పుకున్నారు. అయితే, రిచ్‌మాండ్, నార్త్‌అల్లెర్టన్ ఎంపీగా మాత్రం కొనసాగుతున్నారు. రాజకీయాల్లో చేరక ముందు కూడా ఆయన గోల్డ్‌మన్ శాక్స్‌లోనే పనిచేశారు. 2001-2004 మధ్యకాలంలో ఆయన కంపెనీలో తొలుత సమ్మర్ ఇంటర్న్‌గా, ఆ తర్వాత జూనియర్ అనలిస్ట్‌గా పనిచేశారు. ఇప్పుడు సీనియర్ అడ్వైజర్ హోదాలో కంపెనీ యాజమాన్యం, క్లయింట్లకు భౌగోళిక రాజకీయ, ఆర్థిక సంబంధిత అంశాలపై సలహాలు ఇవ్వనున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ నుంచి లభించే పారితోషికాన్ని సునాక్ తన భార్య అక్షతా మూర్తి (ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి కూతురు)తో కలిసి ప్రారంభించిన రిచ్‌మాండ్ ప్రాజెక్ట్‌కు విరాళంగా ఇవ్వనున్నారు. ఈ చారిటీ సంస్థ బ్రిటన్ వాసుల్లో గణాంక నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది.

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ రెవ్‌ఎక్స్

ప్రారంభ ధర రూ.8.94 లక్షలు



మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. మార్కెట్లోకి సరికొత్త ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ రెవ్‌ఎక్స్ సిరీస్ కారును విడుదల చేసింది. మొత్తం మూడు వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.8.94 లక్షలు (ఎక్స్‌షోరూమ్). రెవ్‌ఎక్స్ సిరీస్‌తో ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పోర్టుఫోలియో మరింత బలోపేతమవుతుందని కంపెనీ పేర్కొంది. 1.2 లీటర్ ఎంస్టాలియన్ టీసీఎంపీఎఫ్ఐ ఇంజన్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, హిల్ హోల్డ్ కంట్రోల్, 4 డిస్క్ బ్రేక్స్‌తో ఈ కారును తీసుకువచ్చింది.

చైనా టెకీలు తిరిగి వెళ్లినా ఐఫోన్ 17 ఉత్పత్తిపై ప్రభావం ఉండదు..!

న్యూఢిల్లీ: భారత్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో పనిచేస్తున్న వందల మంది చైనా టెక్నాలజీ నిపుణులు గడిచిన రెండు నెలల్లో తిరిగి స్వదేశానికి వెళ్లిపోయినప్పటికీ, ఐఫోన్ 17 ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. దేశంలో ఐఫోన్ 17 తయారీ షెడ్యూల్ ప్రకారం సాగుతుందన్నారు. మన దేశం నుంచి ఐఫోన్ల ఉత్పత్తిని మరింత పెంచాలన్న యాపిల్ ప్రణాళికలోనూ ఎలాంటి మార్పు లేదని ఆ వర్గాలు ఈ సందర్భంగా పేర్కొన్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3.5-4 కోట్ల యూనిట్ల ఐఫోన్లు తయారవగా.. ఈసారి ఉత్పత్తిని 6 కోట్ల యూనిట్లకు పెంచాలని యాపిల్ భావిస్తోందన్నారు.

ఆస్ట్రా మైక్రోవేవ్‌కు రూ.2,000 కోట్ల ఆర్డర్!

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఏఎంపీఎల్)కు రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి మరో భారీ ఆర్డర్ లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్డర్ విలువ రూ.1,800 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని కంపెనీ డైరెక్టర్ అతిమ్ కాబ్రా సూచనప్రాయంగా వెల్లడించారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన 230 సుఖోయ్-30 యుద్ధ విమానాల ఆధునీకరణతో పాటు పెద్ద ఎత్తున క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ (క్యూఆర్ఎస్ఏఎం) అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన కీలక ఎలక్ట్రానిక్ ఉపకరణాల సరఫరా కాంట్రాక్టు తమకు దక్కే అవకాశం ఉందని కాబ్రా తెలిపారు. కాగా కంపెనీ ఇప్పటికే విరూపాక్ష రాడార్ కార్యక్రమంలో కీలకంగా ఉంది.

ప్రపంచంలో తొమ్మిదో అత్యంత రద్దీ విమానాశ్రయం ఢిల్లీ

న్యూఢిల్లీ: గత ఏడాదికి గాను ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐఏ) తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2023లో పదో స్థానంలో ఉన్న ఈ విమానాశ్రయం 2024లో 7.78 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుందని ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వెల్లడించింది. అమెరికాలోని అట్లాంటా విమానాశ్రయం 10.8 కోట్ల ప్రయాణికులతో మొదటి స్థానంలో నిలవగా దుబాయ్ (9.23 కోట్ల ప్రయాణికులు), డల్లాస్/ఫోర్ట్ వర్త్ (8.78 కోట్ల ప్రయాణికులు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సాయి పేరెంటరల్స్‌కు రూ.50 కోట్ల నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఫార్మా సంస్థ సాయి పేరెంటరల్స్ లిమిటెడ్.. ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) ఇన్వెస్టర్ల నుంచి రూ.50 కోట్ల నిధులను సమీకరించింది. సమర్థ్ క్యాపిటల్, వ్యోమ్ పార్ట్‌నర్స్ సహా బ్లూ లోటస్ క్యాపిటల్ అనుబంధ సంస్థల నుంచి ఈ మొత్తాలను సమీకరించినట్లు సాయి పేరెంటరల్స్ ఎండీ అనిల్ కరుసాల తెలిపారు. వ్యాపార కార్యకలాపాల విస్తరణ, అంతర్జాతీయ ఫార్మా కంపెనీగా ఎదగాలన్న లక్ష్య సాధనకు ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు అనిల్ చెప్పారు.

● కిర్గిస్థాన్‌లో తమ కంపెనీ చేపట్టిన గోల్డ్ మైన్ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికే ప్రారంభమవుతుందని దక్కన్ గోల్డ్ మైన్స్ తెలిపింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు అవసరమైన యంత్ర పరికరాలకు ఆర్డర్ పెట్టామని, అవి చేతికి అందితే.. వచ్చే రెండు నెలల్లోనే ఖనిజం వెలికితీత, క్రషింగ్, పసిడి ఉత్పత్తి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	550
వరంగల్	542	గోదావరి	515
చిత్తూరు	633	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	102
వరంగల్	100	గుంటూరు	107
కరీంనగర్	100	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	105
కర్నూలు	100	నెల్లూరు	110
విశాఖపట్నం	86	అనంతపురం	110
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,840 ▲	90,600 ▲	1,19,900 ▼
విజయవాడ	99,900 ▲	94,000 ▲	1,10,000 ▼
విశాఖపట్నం	1,00,000 ▲	90,601 ▲	1,20,000 ▼
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,10,500 ▲
ప్రొద్దుటూరు	97,100 ▲	89,330 ▲	1,08,800 ▲
ముంబై	96,972 ▲	88,871 ▲	1,07,500 ▲

కోవాసంట్ టెక్‌లో కోనాఏఐ, డీక్యూబ్ డేటా విలీనం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ టెక్ ప్రపంచంలో మరో విలీనం చోటు చేసుకుంది. పెద్దగా మానవ ప్రమేయం లేకుండా ఖాతాదారులకు కృత్రిమ మేధ (ఏజెంటిక్ ఏఐ) సేవలందించే కోవాసంట్ టెక్నాలజీస్.. అమెరికాకు చెందిన కోనాఏఐ, డీక్యూబ్ డేటా సైన్సెస్ కార్పొరేషన్ కంపెనీలను విలీనం చేసుకుంది. అయితే ఈ విలీనానికి సంబంధించిన లావాదేవీల వివరాలను మాత్రం ఈ కంపెనీలు వెల్లడించలేదు. విలీనం అనంతరం ఏర్పడిన కంపెనీని కోవాసంట్ టెక్‌గా వ్యవహరిస్తారు. ఏఐ ఆధారిత కంప్లయెన్స్‌లో కీలకంగా ఉన్న కోనాఏఐ, సైబర్ సెక్యూరిటీ సంస్థ డీక్యూబ్ విలీనంతో అంతర్జాతీయ క్లయింట్లకు ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ గవర్నెన్స్ సొల్యూషన్స్‌ను అందించటంతో పాటు సేవల పోర్టుఫోలియోను విస్తరించే అవకాశం లభిస్తుందని కోవాసంట్ వ్యవస్థాపకుడు సీవీ సుబ్రమణ్యం వెల్లడించారు. 2030 నాటికి ఏజెంటిక్ ఏఐ మార్కెట్ ఏటా 54 శాతం వృద్ధితో 170 కోట్ల డాలర్లకు చేరే అవకాశముందని, దీన్ని అందిపుచ్చుకునేందుకు ఈ విలీనం తోడ్పడుతుందని ఆయన తెలిపారు. మూడు కంపెనీల విలీనంతో ఏర్పడే సంస్థలో మొత్తం 400 మంది ఉద్యోగులు ఉండనున్నారు.

మళ్లీ 25,500 ఎగువకు నిఫ్టీ

ముంబై: స్టాక్ మార్కెట్లో మంగళవారం ఆరంభం నుంచి ట్రేడింగ్ స్తబ్దుగా సాగినప్పటికీ, ఆఖరి అరగంటలో ఇన్వెస్టర్లు బ్యాంకింగ్, ఎంపిక చేసిన ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెంచారు. దాంతో ప్రామాణిక సూచీలు మోస్తరు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 270.01 పాయింట్ల వృద్ధితో 83,712.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 61.20 పాయింట్లు బలపడి 25,522.50 వద్ద క్లోజైంది. అమెరికా సుంకాల అమలును ఈ నెల 9 నుంచి ఆగస్టు 1కి వాయిదా వేసింది. అయితే, మదుపరులు కొత్త పెట్టుబడులు పెట్టేందుకు భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై స్పష్టమైన పురోగతి కోసం వేచి చూస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.303 కోట్లు

» రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ అంగీకారం: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.303 కోట్లు వెచ్చించేందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంగీకారం తెలిపారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. కంటోన్మెంట్ పరిధిలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్లు, అభివృద్ధి పనుల కోసం ఎస్క్రో అకౌంట్ (ఏ పనులకైతే నిధులను జమ చేస్తారో ఆ పనులకు మాత్రమే ఆ నిధులను ఉపయోగించుకునేలా)ను ఏర్పాటు చేయాలని రక్షణ శాఖ మంత్రికి తాను రెండుసార్లు లేఖలు రాశానని వెల్లడించారు. ఈ అకౌంట్‌కు రూ.303.62 కోట్ల భూబదిలీ పరిహారాన్ని జమ చేయాలని కోరానని తెలిపారు. దీంతో రక్షణ శాఖ మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. రక్షణ శాఖ భూములకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూబదిలీ పరిహారాన్ని ఎస్క్రో అకౌంట్‌లో జమ చేసిన వెంటనే కంటోన్మెంట్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని రక్షణ శాఖ ఆదేశాల్లో పేర్కొందని కిషన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగుల మహాగర్జనకు మద్దతివ్వండి

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కోరిన మందకృష్ణ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావును కలిశారు. అనంతరం మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 13న ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న చలో దివ్యాంగుల మహాగర్జనకు మద్దతు ఇవ్వాలని రాంచందర్‌రావును కోరినట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి జిల్లాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. దివ్యాంగులకు పెంచిన పింఛన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు మహాగర్జన నిర్వహిస్తున్నట్లు మందకృష్ణ తెలిపారు.

మేం ప్రశ్నించాకే కల్వకుర్తి నీటి విడుదల: హరీశ్



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సాగునీరందక అవస్థపడుతున్న లక్షలాదిమంది రైతులతో తరలివచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటేగాని ప్రభుత్వంలో చలనం రాలేదని, తాము ప్రశ్నించాకే.. కల్వకుర్తి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తమపార్టీ నిలదీస్తేగాని కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలికలేదని, ఎట్టకేలకు కల్వకుర్తి మోటార్లు ఆన్‌చేసి నీళ్లు విడుదల చేయడం బీఆర్ఎస్, కేసీఆర్ విజయమని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కల్వకుర్తిలాగానే.. కాళేశ్వరం మోటార్లు ఆన్‌చేసి, రిజర్వాయర్లు నింపి పొలాలకు నీళ్లు మళ్లించాలని డిమాండ్ చేశారు. కాగా.. ఉపాధిహామీ ఏపీవోలకు మూడునెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని, మరోవైపు పారిశుధ్య కార్మికుల కూ వేతనాలు రాక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీవోలు, పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ఈటలను వాడుకుని వదిలేసింది

» కవిత బీసీ నినాదం వెనుక బీజేపీ: కేఏ పాల్

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈటల రాజేందర్‌ను బీజేపీ వాడుకుని వదిలేసిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. బీసీని రాష్ట్ర అధ్యక్షుడినే చేయని బీజేపీ ముఖ్యమంత్రిని చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ పార్టీ అని చెప్పుకుంటున్న బీజేపీ బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి ఎందుకు దింపేసిందని ప్రశ్నించారు. ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ వంటి బీసీలను కాదని బ్రాహ్మణుడైన రాంచందర్‌రావుకు అవకాశం కల్పించారని చెప్పారు. బ్రాహ్మణులకు తాను వ్యతిరేకిని కాదని, కానీ బీజేపీ బీసీ ముసుగు వేసుకుని ఇలాంటి చర్యలెలా చేస్తుందని ప్రశ్నించారు. ఒక్కసారి జైలులో పెట్టేసరికే కల్వకుంట్ల కవిత బీజేపీ గానం చేస్తోందని, జూబ్లీహిల్స్ ఎన్నిక కోసమే కవితను బీసీ నినాదంతో రంగంలోకి దించారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు.

ఎన్డీఏలోనే బీసీ వ్యతిరేకత

» 42% బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి: కవిత

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలోనే బీసీ వ్యతిరేకత ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఓబీసీనని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోదీకి ఆ వర్గాలకు న్యాయంచేసే అవకాశం లభించిందని, తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన 42% బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. ఈ నెల 17న నిర్వహించబోయే రైల్‌రోకోలో భాగంగా ఒక్క రైలునూ కదలనివ్వబోమని, డెక్కన్ నుంచి ఢిల్లీకి రైళ్లను రానిచ్చే ప్రసక్తే లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (డీ) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే జీవో జారీ చేసి పెంచిన రిజర్వేషన్లను అమలు చేయవచ్చని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జాగృతి పోటీలో ఉండదని, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే ఉంటారని కవిత స్పష్టం చేశారు.

జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి

» మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ పిల్

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అర్బన్ జిల్లాగా ఉన్న హైదరాబాద్ మినహా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలయింది. ప్రస్తుతం ఉన్న తొమ్మిది నవోదయ పాఠశాలకు అదనంగా మరో 23 పాఠశాలలు ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ ఈ పిల్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జె. రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ కొత్తగా ఏర్పడిన 23 జిల్లాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రం కొత్తగా ఏడు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినా అడ్మిషన్ల నోటిఫికేషన్‌లో వీటిని చేర్చలేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరాలు తెలియజేయాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ, నవోదయ విద్యాలయ సమితిలకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

లెవల్ క్రాసింగ్ గేట్లపై దృష్టి కేంద్రీకరించాలి

» తనిఖీలు ముమ్మరం చేయాలి: రైల్వే జీఎం సందీప్ మాథుర్

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు ఆస్కారం ఉన్న నాన్-ఇంటర్‌లాకింగ్ లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద(ఎల్.సిలు)రైళ్ల రాకపోకలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ అధికారులను ఆదేశించారు. జోన్ పరిధిలోని ఎల్‌సీలను గుర్తించి ట్రాఫిక్ భద్రత కోసం తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైళ్ల భద్రతపై నిర్వహించిన సమీక్షలో జోన్ అదనపు జీఎం నీరజ్ అగ్రవాల్‌తో పాటు వివిధ వి భాగాల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు,గుంటూరు, నాందేడ్ డివిజన్ల రైల్వే మేనేజర్లతో సందీప్ మాథుర్ మాట్లాడుతూ.. రైళ్ల భద్రత కార్యకలాపాల్లో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. రైలు ప్రమాదాలకు దారితీసే అవకాశమున్న లోడింగ్‌ను నివారించడానికి సిబ్బందిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా పశువులు ట్రాక్‌లపైకి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి కంచెల నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

జహీరాబాద్ స్మార్ట్ సిటీకి డబ్బులివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

కలిశారు. వర్షాకాలానికి సంబంధించి ఏప్రిల్-జూన్ మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడంతో సాగు పనులు జోరుగా సాగుతున్నాయని, యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జూలై నెలలో 1.6 లక్షల టన్నులు తెలంగాణకు సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం 29 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేశారని వివరించారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని కోరారు. యూరియా సరఫరాకు రైల్వే శాఖ తగిన రాక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో వైఎస్‌ది చెరగని ముద్ర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం విషయంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో వై.ఎస్. జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, జలయజ్ఞం, ఔటర్ రింగు రోడ్డు, పింఛన్ల పెంపు వంటి కార్యక్రమాలతో ఉమ్మడి రాష్ట్ర ప్రజల్లో వైఎస్ శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని వైఎస్ చెప్పేవారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కూడా నివాళులర్పించారు.



కేంద్ర మంత్రి నడ్డాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్

ఏడాదిలోనే రైతులకు 70 వేల కోట్లు

పదేళ్ల పాలనలో రైతులను విస్మరించిన బీఆర్ఎస్.. అభివృద్ధిని చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం: భట్టి

మహబూబాబాద్/కేసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులను పూర్తిగా విస్మరించిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అన్నదాతల కోసం ఒక్క ఏడాదిలోనే రూ.70 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. మూడు నెలల కాలంలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమ సర్కారుదని చెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించామన్నారు. రూ.12,500 కోట్లు ఖర్చుచేసి 51 లక్షల మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ సహాయక సంఘాల సభ్యులకు రూ.50 వేల కోట్ల రుణాలు అందించామన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం.. ఆ నియోజకవర్గంలోని సోమ్లా తండా, కేసముద్రంలలో రూ.400 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే అభివృద్ధి పనులకు పలువురు మంత్రులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై, కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.



కేసముద్రంలో మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రులు భట్టివిక్రమార్క, పొంగులేటి, కోమటిరెడ్డి, సీతక్క, కొండా సురేఖ తదితరులు

పేదల పక్షపాతి మా ప్రభుత్వం: పొంగులేటి

రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం పేదల పక్షాన పని చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే.. హామీ ఇవ్వని పథకాలను సైతం ప్రవేశపెడుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే వాటికి వడ్డీలు కడుతూనే కొత్త సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు రంకెలు వేస్తూ సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పరిపాలన ఉండడంతో తట్టుకోలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. పేదలకు మంచి కార్యక్రమాలు చేస్తుంటే కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు అని ఊరించి ఎవరికీ ఇవ్వలేదని, తాము 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు.

రైతుల కళ్లలో సంతోషమే లక్ష్యం: కోమటిరెడ్డి

రైతుల కళ్లలో సంతోషం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తూ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తన శాఖ నుంచి కేసముద్రంలో రూ.175 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పరిశ్రమలు రావాలంటే రోడ్లు రావాలని, మండలంలో వివిధ మార్గాలకు రాబోయే కాలంలో ప్రతీ రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వచ్చే 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండాలని ఆయన అన్నారు.

తెలంగాణ సంక్షేమ రాజ్యం: తుమ్మల

తెలంగాణ రాష్ట్రం సంక్షేమ రాజ్యం అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఇలాంటి రాజ్యం కావాలంటూ ఇతర రాష్ట్రాల సీఎంలపై ప్రజలు ఒత్తిడి తెస్తున్నారన్నారు. కొద్దిరోజుల్లోనే జిల్లాకు గోదావరి జలాలు తీసుకొస్తామని, ఆర్థిక భారమైనా ఉపముఖ్యమంత్రి సహకారంతో ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వెళుతున్నామని చెప్పారు.

మహిళలు కోటీశ్వరులు కావాలి: సీతక్క

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేదలకు సన్నబియ్యం ఇచ్చి కడుపునిండా అన్నం పెడుతున్నారని, నిలువనీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నారని మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలకు రూ.25 వేల కోట్ల బ్యాంకు లింకేజి ఇచ్చామని, రూ.2 కోట్లతో కేసముద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనం మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు రూ.10 లక్షల బీమా కల్పించామన్నారు. 18 నుంచి 60 ఏళ్ల వయసు మహిళలు సంఘాల్లో చేరాలని, కోటి మంది మహిళలను సంఘాల్లో చేరి, కోటీశ్వరులు కావాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్షాలను నమ్మొద్దు: సురేఖ

ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ప్రజలు వారిని నమ్మవద్దని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన నిరుపేదలకు పథకాలు చేరాలనే లక్ష్యంతో అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎం ప్రధాన సలహాదారుడిగా వేం నరేందర్‌రెడ్డి ఉండడం కేసముద్రం ప్రజల అదృష్టమని, ఎవరూ ఊహించని విధంగా వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తున్నారని చెప్పారు.

చరిత్రలో నిలిచిపోయేలా పథకాలు: వేం నరేందర్‌రెడ్డి

అప్పుల తెలంగాణలో పథకాలు అమలు చేయడం ఆషామాషీ కాదని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. చరిత్రలో ఎవరూ అమలు చేయని విధంగా పథకాలు రూపొందించి పేదలకు అందిస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో మహబూబాబాద్‌తోపాటు కేసముద్రాన్ని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. అధికారం ప్రజల హక్కు అని, ప్రజల అభిమానంతోనే అధికారంలోకి వచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ బలరాంనాయక్, డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, కెఆర్.నాగరాజు, కోరం కనకయ్య, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ తదితరులుపాల్గొన్నారు.

సీఎం రేవంత్ నిధుల కోసం ఢిల్లీకెళ్తే.. కేసీఆర్ కుటుంబం.. లిక్కర్ దందా కోసం వెళ్లింది

» కేటీఆర్ విదేశాలకెందుకెళ్తున్నాడు?
» కేటీఆర్‌కు సిస్టర్, బ్రదరిన్లా స్ట్రోకు
» అందుకే పిచ్చిపిచ్చిగా మట్లాడుతున్నడు
» రేవంత్ జడ్పీటీసీ స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రి అయ్యారు
» నేను కౌన్సిలర్‌గా, 3 సార్లు ఎమ్మెల్యేను
» కేటీఆర్‌కు రాజకీయ అనుభవమెంత?
» కేసీఆర్ సవాల్ విసిరితేనే రేవంత్‌రెడ్డి వస్తారు: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు ఒక ముఖ్యమంత్రి ఢిల్లీకి ఎందుకు వెళతారన్న ఇంగిత జ్ఞానం కూడా లేదా? అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం లిక్కర్ దందాల కోసం ఢిల్లీకి వెళితే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీకెళ్లారన్నారు. సహజంగా అందరికీ సన్‌స్ట్రోక్ తగులుతుందని, కేటీఆర్‌కు మాత్రం సిస్టర్ స్ట్రోక్, బ్రదరిన్లా స్ట్రోక్ తగిలిందని ఎద్దేవా చేశారు. అందుకే ఆయన పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ ఈ మధ్య నెలలో 20 రోజులు విదేశాల్లోనే ఉంటున్నారని, అందుకే ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి షెడ్యూల్ తెలియట్లేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిధులు, ఎరువులు.. నీళ్ల పంచాయితీ కోసం సీఎం రేవంత్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నారన్నారు. కేటీఆర్‌కు ఏం పనుందని విదేశాల చుట్టూ తిరుగుతున్నాడని నిలదీశారు. కేసీఆర్ కోటాలో నేరుగా ఎమ్మెల్యే అయిపోయిన కేటీఆర్‌కు..



రాజకీయ ఒడిదుడుకులు ఏం తెలుసునని ప్రశ్నించారు. జడ్పీటీసీ స్థాయి నుంచి రాష్ట్రానికి ముఖ్యమంత్రి దాకా ఎదిగిన అనుభవం రేవంత్‌దన్నారు. తానూ ఒకసారి కౌన్సిలర్, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి టీపీసీసీకి కార్యనిర్వాహక అధ్యక్షుడినయ్యానన్నారు. తమ రాజకీయ అనుభవం ముందు.. కేటీఆర్ అనుభవమెంతని ప్రశ్నించారు. బూతులు, తిట్ల పురాణాలను స్టార్ట్ చేసిందే కేసీఆర్ అన్నారు. ఆయన మాటలనే కాస్త పాలిష్ చేసి సీఎం రేవంత్ వాడుతున్నారని జగ్గారెడ్డి చెప్పారు.

ఎమ్మెల్యేలు ఎక్కడ చర్చలు చేస్తారన్న జ్ఞానం కూడా లేదా?

మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు ఎక్కడ చర్చలు చేస్తారన్న జ్ఞానం కూడా లేదా? అంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. కేటీఆర్, హరీశ్ రావు మరోమారు సవాళ్లు విసిరితే ఈసారి చర్చకు తాను వస్తానన్నారు. చర్చకు రమ్మంటూ కేసీఆర్ సవాల్ విసిరితేనే సీఎం రేవంత్ వస్తారని చెప్పారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నేతలను వేధించారు. నాపైనా నిఘా పెట్టారు. నాకు అప్పులు తప్ప ఆస్తులు లేవని నిఘాలో తేలింది. భూముల పంచాయతీ ఏమైనా ఉందా అని అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రాస్‌తో విచారణ చేయించారు. ఎక్కడా ఏమీ లేకపోవడంతో చివరికి పాస్‌పోర్టు కేసు పెట్టారు" అని జగ్గారెడ్డి చెప్పారు.

కృష్ణా జలాల్లో అన్యాయం.. కాళేశ్వరం లోపాలపై సర్కారు ఫోకస్

» సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు నేడు మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నీళ్లు, నియామకాలు, నిధులు.. సొంత రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రధాన నినాదం. కానీ తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొమ్మిదిన్నరేళ్లలో కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటాకు బీఆర్ఎస్ ప్రభుత్వం తిలోదకాలు.. ఏపీ చేపట్టిన అక్రమ ప్రాజెక్టులకు సమర్థన.. ఉమ్మడి రాష్ట్రంలోని చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించకుండా రీ ఇంజనీరింగ్ పేరిట కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు.. వాటి నిర్మాణంతో ప్రజలపై పడిన భారాన్ని తెలంగాణ సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించనున్నది. ఈ విషయమై మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు మంత్రి ఉత్తమ్ ఆహ్వానాలు పంపారు. ఉమ్మడి ఏపీలో శ్రీశైలంలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తరలించిన కృష్ణా జలాలు, గత తొమ్మిదిన్నరేళ్లలో తరలించిన జలాలు, రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లను పిలవడానికి గత ప్రభుత్వ పరోక్ష సహకారాన్ని మంత్రి ఉత్తమ్ వివరిస్తారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కృష్ణా జలాల్లో 50 శాతానికి పైగా వాటా కోరడానికి బదులు.. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కేంద్రం ముందు ఒప్పుకుని మిగతా 512 టీఎంసీలు ఏపీకి తరలించేందుకు గత బీఆర్ఎస్ సర్కారు సంతకాలు చేసిన ఒప్పందం 2022 వరకూ కొనసాగిందని వెల్లడిస్తారు. డిజైన్ లోపాలు, సరైన పరీక్షలు చేయకుండానే బ్యారేజీలు కట్టడంతో 2023 అక్టోబరులో మేడిగడ్డ కుంగితే, అదే ఏడాది అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు బయటపడ్డాయని ఉత్తమ్ వివరించనున్నారు.

15 కల్లా డీసీసీల ఏర్పాటు

» స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌పై న్యాయనిపుణులతో చర్చిస్తున్నాం
» జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం
» కేసీఆర్ హయాంలోలా ప్రజాపాలనలో నిర్బంధాలు లేవు: మహేష్ గౌడ్

హైదరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీ కల్లా జిల్లా కాంగ్రెస్ కమిటీలు(డీసీసీలు) ఏర్పాటు చేస్తామని, ఆ వెంటనే డీసీసీ అధ్యక్షుల నియామకం చేపడతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. డీసీసీల ఏర్పాటు ప్రక్రియలో భాగంగానే సీనియర్ నాయకులను జిల్లా ఇన్‌చార్జులుగా నియమించామని, ఏఐసీసీ అబ్జర్వర్లు త్వరలోనే రాష్ట్రానికి వస్తారని ఆయన చెప్పారు. ఈ నెలాఖరు కల్లా అన్ని కమిటీల ఏర్పాటూ పూర్తవుతుందన్నారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనని, ఈ విషయంలో న్యాయ నిపుణులతో చర్చలు జరుగుతున్నాయ ని చెప్పారు. యూరియా కరువు అంటూ బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇక, అనిరుధ్ రెడ్డి, తీన్మార్ మల్లన్న అంశాలు వేర్వేరని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను క్రమశిక్షణా చర్యల కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. కులగణన పత్రాలను తగలబెట్టిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆపరేషన్ ఆకర్ష్ కొనసాగుతూనే ఉందని తెలిపారు. మంత్రి పదవుల అంశం తన పరిధిలో లేదని, రాజకీయాల్లో ఒక్కోసారి జూనియర్లకు ముందుగా అవకాశాలు వస్తాయని, సీనియర్లను కూడా పార్టీ గుర్తిస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి పది మంది అభ్యర్థులు సిద్ధంగా ఉండగా వేరే పార్టీల నుంచి అభ్యర్థిని ఎందుకు తీసుకుంటామని అడిగారు. కేసీఆర్ హయాంలో నిర్బంధ పాలన జరిగిందని, నెలలో 15 హౌస్ అరెస్టులు జరిగేవన్నారు. ప్రజాపాలనలో అలాంటి నిర్బంధాలు లేవని, కేసీఆర్ కుమార్తె కవిత ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం అడ్డుకోవడం లేదని గుర్తు చేశారు.



వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు తదితరులు

టీపీసీసీ చీఫ్‌తో కోదండరాం భేటీ

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, ఆ పార్టీ నేతలు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ను సీఎల్పీ కార్యాలయంలో మంగళవారం కలిశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక ఎన్నికల్లో ఇరుపార్టీలూ ఉమ్మడి కార్యాచరణతో పని చేయాలని టీజేఎస్ నేతలను మహేష్‌గౌడ్ కోరారు.

గాంధీభవన్‌లో వైఎస్ఆర్‌కు ఘన నివాళి

దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎంపీ కేవీపీ రామచందర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, అంజన్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ కూడా నివాళి అర్పించారు.

చేనేత పురస్కారాలు రాష్ట్రానికి గర్వకారణం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వశాఖ ప్రకటించిన చేనేత పురస్కారాలు- 2024కు రాష్ట్రం నుంచి ఇద్దరు కార్మికులు ఎంపికకావటం రాష్ట్రానికి గర్వకారణమని వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. దేశవ్యాప్తంగా 19 మంది చేనేత కార్మికులు ఈ పురస్కారానికి ఎంపికైతే రాష్ట్రం నుంచి ఇద్దరికి అవార్డులు దక్కటం అభినందనీయమని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన గజం నర్మదకు చేనేత వస్త్రాల మార్కెటింగ్ విభాగంలో రూ.8 కోట్ల టర్నోవర్ చేసినందుకుగాను అవార్డు లభించింది. సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించి జీఐ ట్యాగ్ పొందిన తెలియా రుమాల్‌తో పట్టుచీరను నేసిన గూడ పవన్‌కు కూడా జాతీయ పురస్కారం లభించటంపై తుమ్మల హర్షం వ్యక్తం చేశారు.

వనమహోత్సవంలో 47.64 లక్షల ఈత, తాటి మొక్కల పెంపకం: కొండా సురేఖ



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 47.64 లక్షల ఈత, తాటి మొక్కలు నాటి, పెంచాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే రెండేళ్లలో ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమె సూచించారు. ప్రస్తుత వనమహోత్సవంలో 25 లక్షల ఈత మొక్కలు, వచ్చే ఏడాది 22 లక్షల ఈత మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మరో 6 లక్షల వరకు తాటి మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.

వైద్య కళాశాలలకు పాలనాధికారుల నియామకం

» 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు ఏడీఎంఈలుగా పదోన్నతి

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆస్పత్రులకు ప్రభుత్వం పరిపాలనాధికారులను నియమించింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అదనపు వైద్య విద్య సంచాలకులు (ఏడీఎంఈ)గా పదోన్నతులు కల్పించి.. వారిని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లుగా, బోధనా ఆస్పత్రుల సూపరింటెండెంట్లుగా నియమించింది. ఈ మేరకు మంగళవారం జీవో జారీ చేసింది. ఇక అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 308 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ చివరి దశకు వచ్చింది. వీరికి పోస్టింగులు ఇస్తే కాలేజీల్లో ప్రొఫెసర్లు, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల కొరత తీరనుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సుమారు 231 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చేందుకు కూడా ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏడీఎంఈ పదోన్నతులు, పోస్టింగుల ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించిన ప్రభుత్వానికి, వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్‌కు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి, తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బీ కిరణ్, డాక్టర్ మాదాల కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా నేతల కోసం 'అధినేత్రి' వర్క్‌షాప్

» త్వరలోనే సీఎం ఆధ్వర్యంలో నిర్వహణ: మహేశ్‌గౌడ్



అధినేత్రి వర్క్‌షాప్ పోస్టర్

హైదరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళల్లో నాయకత్వ ప్రతిభను మరింత పెంపొందించడమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో త్వరలోనే 'అధినేత్రి' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించబోతున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. చట్ట సభల్లో మహిళల సీట్లు పెరగనున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయి నుంచి మహిళా నేతల్లో నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించి, వారిని గొప్ప నాయకులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని వివరించారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో అధినేత్రి వర్క్‌షాప్‌ను నిర్వహించబోతున్నామని మహేశ్‌గౌడ్ ప్రకటించారు.

రాష్ట్రంలో సెమీ కండక్టర్ల ఉత్పత్తి కేంద్రం

పంజాగుట్ట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో త్వరలోనే సెమీ కండక్టర్ల తయారీ కేంద్రాన్ని నెలకొల్పనున్నట్లు సదరన్ సిలికాన్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్లు తైయేబ్ తాహిర్ అలీ, హర్ష మాలో తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిధరి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్‌నర్ అంజిరెడ్డితో కలిసి వారు మాట్లాడారు. ఎలక్ట్రానిక్ పరికరాల్లో విస్తృతంగా ఉపయోగించే సెమీ కండక్టర్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని వారన్నారు. సెమీ కండక్టర్ల తయారీకి ఉపయోగించే ముడి సరుకు క్వార్ట్జ్‌తో తెలుగు రాష్ట్రాల్లోనే వాటిని ఉత్పత్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన వెంటనే గిరిధరి ఇండస్ట్రీస్ సహకారంతో సంస్థను ఏర్పాటు చేయబోతున్నట్టు వారు చెప్పారు. సంస్థను నెలకొల్పడం ద్వారా పలువురికి ఉపాధి కూడా లభిస్తుందని పేర్కొన్నారు.

కల్తీకల్లు రక్కసి.. ఆస్పత్రిపాల్జేసి!

» 16మందికి అస్వస్థత.. అందరికీ ఒకే తరహా లక్షణాలు

» ఒకరి పరిస్థితి విషమం.. ఐదుగురికి కిడ్నీలు విఫలం

» కూకట్‌పల్లిలో కలకలం... 3 కల్లు దుకాణాలు సీజ్

కేపీహెచ్‌బీ కాలనీ, హైదర్‌నగర్, నిమ్స్, అడ్డగుట్ట, జూలై8 (ఆంధ్రజ్యోతి): అదే పనిగా వాంతులు.. విరేచనాలు! హైదర్‌నగర్, సర్దార్ పటేల్ నగర్, ఇందిరానగర్, శంషాగూడ, ఎల్లమ్మబండ, ఆల్విన్ కాలనీ, జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో 16 మందికి ఇలా ఒకే తరహా లక్షణాలు కనిపించాయి! కూకట్‌పల్లి పరిధిలో కల్తీకల్లు తాగడం వల్లే వీరంతా అస్వస్థతకు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. అంతా మూడురోజుల క్రితం కూకట్‌పల్లి రాందేవ్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి మంగళవారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్ ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. కాగా బాధితుల్లో 12 మంది... మెదక్ జిల్లా శంకరంపేటకు చెందిన ఎం. యాదగిరి (41) హైదర్ నగర్‌కు చెందిన మాధవి (42) కూకట్‌పల్లికి చెందిన కోటేశ్వరరావు (58) శంషిగూడకు చెందిన కె. వెంటేశ్ (43) గోకుల్ ప్లాటుకు చెందిన ఎమ్. పోచమ్మ (34) అల్విన్ కాలనీకి చెందిన లక్ష్మి (34) మియాపూర్‌కు చెందిన జీ.దేవదాస్ (69) నిజాంపేటకు చెందిన ఎ.రాములు (49) పర్వత్‌పూర్‌కు చెందిన టి.గోవిందమ్మ (61) కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన జీ. మోనప్ప (55) కూకట్‌పల్లికి చెందిన నర్సింహ (39) జే.యోబు (55)ను మెరుగగ్గైన చికిత్స కోసం అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. వారిని అక్కడ అత్యవసర విభాగంలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరిలో మోనప్ప పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు.. అడ్డగుట్టకు చెందిన ఓదేలు, వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన కృష్ణయ్య, కూకట్‌పల్లికి చెంది విజయ్ వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఓదేలు ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధితుల్లో మరో ఐదుగురికి కిడ్నీలు పూర్తిగా పాడైనట్లు సమాచారం. కల్తీకల్లు ఘటనకు సంబంధించి కూకట్‌పల్లి పరిధిలోని హైదర్‌నగర్, అల్విన్‌కాలనీ, శంశీగూడలో ఉన్న మూడు కల్లు కంపౌండ్లను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు.

చర్చకు రమ్మని ఢిల్లీకి పారిపోయావేం?

సవాల్ విసిరి పారిపోవడం రేవంత్‌కు అలవాటే.. రచ్చ చేయడం తప్ప చర్చ చేయడం రాదు

» నువ్వు రాకపోతే.. డిప్యూటీ సీఎంనుగానీ, వ్యవసాయ మంత్రిని గానీ పంపు

» మళ్లీ ఎప్పుడో నువ్వే చెప్పు: కేటీఆర్

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతులు, నిరుద్యోగులకు ఎవరి ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ సవాల్‌ను తాను స్వీకరించగానే ఢిల్లీకి పారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యూరియా బస్తాల కోసం సీఎం ఢిల్లీకి వెళ్లారంటూ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, కానీ.. ఆయన వెళ్లేది పైసల మూటలు పంచడానికని ఆరోపించారు. తొడలు కొట్టడం, రంకెలు వేయడం, సవాళ్లు విసిరి పారిపోవడం రేవంత్‌కు అలవాటేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరి.. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. జీహెచ్‌ఎంసీలో బీఆర్ఎస్ సొంతంగా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మాట తప్పారని గుర్తుచేశారు. మంగళవారం పార్టీ నేతలతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న కేటీఆర్.. 'సీఎం రేవంత్‌రెడ్డి కోసం' అంటూ వేసిన కుర్చీ పక్కనే మరో కుర్చీలో కూర్చున్నారు. ముఖ్యమంత్రి రాక కోసం కొద్దిసేపు వేచిచూసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. "నువ్వు విసిరిన సవాల్‌ను స్వీకరించా. నీతో చర్చకు కేసీఆర్ రావడమెందుకు? నేనే వస్తానని చెప్పా. మాట ప్రకారం నేనొచ్చా.. నువ్వెక్కడ?" అంటూ సీఎం రేవంత్‌ని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి బేసిక్ నాలెడ్జ్ లేదని తెలిసినా ముచ్చట పడుతున్నారని ఆయన సవాల్‌ను స్వీకరించానని, ప్రెస్‌క్లబ్‌కు వస్తే మీడియా సాక్షిగా, ప్రజల సాక్షిగా చర్చిద్దామని ఆహ్వానిస్తే చివరికి ఢిల్లీకి పరారయ్యారని ఎద్దేవా చేశారు.



మరోసారి వచ్చేందుకు సిద్ధం..

తనతో చర్చకు సీఎం రాకున్నా.. కనీసం డిప్యూటీ సీఎంనో, వ్యవసాయశాఖ మంత్రినైనా పంపాలని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదని, ఢిల్లీ నుంచి తిరిగొచ్చాక.. ఎక్కడ, ఎప్పుడు చర్చకు రావాలో రేవంత్‌రెడ్డి చెబితే వచ్చేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఈసారి కూడా చర్చకు సీఎం రాకపోతే.. తమ పార్టీ అధినేత కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. "కేసీఆర్‌పై మరోసారి తప్పుడు కూతలు కూయనని, పనికిమాలిన సవాళ్లు చేయనని రేవంత్ ముక్కు నేలకు రాయాలి" అని కేటీఆర్ అన్నారు. రేవంత్‌రెడ్డికి రచ్చ చేయడమే తప్ప.. చర్చ చేయడం రాదన్నారు. బూతులు తప్ప రైతుల గురించి బేసిక్ నాలెడ్జ్‌లేని అసమర్థ సీఎం అని, ఆయన పాలనతో 18 నెలలుగా రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోదావరి నీళ్లను అక్రమంగా ఏపీకి తరలించేందుకు కడుతున్న బనకచర్లకు సీఎం రేవంత్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. దీంతోపాటు పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా నీళ్లను దొంగచాటుగా తీసుకెళ్తుంటే కళ్లు మూసుకొని చంద్రబాబుకు కోవర్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నీళ్లను ఆంధ్రకు, నిధులను ఢిల్లీకి పంపుతున్నారని, నియామకాలు తన తొత్తులకు ఇచ్చుకొని మురిసిపోతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనాయకత్వంతోపాటు కేంద్రంలోని బీజేపీ పెద్దలకూ పైసల మూటలు మోసి రేవంత్ తన పదవిని కాపాడుకుంటున్నారని ఆరోపించారు.

కొడంగల్‌లో 670 మందికి భరోసా రాలేదు

కాంగ్రెస్ చెబుతున్న రైతుభరోసా అంతా డొల్ల అని, సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే 670 మంది రైతులకు రైతుభరోసా రాలేదని కేటీఆర్ తెలిపారు. వారి వివరాలు తీసుకొచ్చానన్నారు. దీంతోపాటు రుణమాఫీ కాని లక్షల మంది రైతుల అధికారిక జాబితా తమ వద్ద ఉందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు, వడ్లను ప్రభుత్వం కొనక, బోనస్ రాక.. మిల్లర్లకు అమ్ముకొని నష్టపోయిన రైతుల జాబితా కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచక పాలనతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, యూరియా, ఎరువుల బస్తా కోసం క్యూలో చెప్పులు పెట్టి ఫర్టిలైజర్ దుకాణాల ముందు ఎదురు చూస్తున్నారని చెప్పారు. మళ్లీ ఆనాటి రోజులు తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్.. నిజంగానే ఆ పాత దుర్దినాలను తీసుకొచ్చిందని విమర్శించారు. 50 ఏళ్ల క్రితం ఇందిరాగాంధీ విధించిన ఎమర్జన్సీని తలదన్నేలా ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టులు పెడితేనే గజగజ వణికిపోతున్న రేవంత్‌రెడ్డి స్థాయికి.. కేసీఆర్ వచ్చి మాట్లాడాల్సిన అవసరం లేదని, ఆయనకు సమాధానం చెప్పే సత్తా బీఆర్ఎస్‌లోని ప్రతి ఒక్క నాయకుడికీ ఉందని అన్నారు. "దళితులు, గిరిజనులు, పేదల పొట్టకొడుతున్న ఈ ఇందిరమ్మ రాజ్యానికి ఘోరీ కట్టడంతోపాటు రేవంత్‌కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

జాతీయ విద్య సర్వేలో.. మెరుగుపడ్డ తెలంగాణ

» 36 నుంచి 26వ స్థానానికి

» రాష్ట్రంలో జనగామ జిల్లా ముందంజ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై కేంద్ర విద్యాశాఖ చేపట్టిన సర్వేలో తెలంగాణ స్థానం మెరుగుపడింది. 3, 6, 9 తరగతుల్లో మాతృభాష, గణితం, సైన్స్ భాషల్లో విద్య నాణ్యతపై ఈ సర్వేను కేంద్రప్రభుత్వం గతేడాది చివర్లో నిర్వహించింది. తెలంగాణలో మొత్తం 33 జిల్లాల్లోని 3,342 పాఠశాలల్లో ఈ సర్వేని నిర్వహించారు. ఇందులో అనేక అంశాల్లో తెలంగాణ స్థానం మెరుగుపడింది. 2021లో చివరిసారిగా నిర్వహించిన సర్వేలో 36వ స్థానంలో ఉండగా, ఇప్పుడు 26వ స్థానానికి మెరుగుపడింది. మూడవ తరగతిలో దేశవ్యాప్తంగా అత్యుత్తమ 50 జిల్లాల్లో పంజాబ్‌లోని బర్నాలా జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా రాష్ట్రం నుంచి జనగామ జిల్లా 16వ స్థానంలో నిలిచింది. అలాగే 6వ తరగతిలో జనగామ జాతీయస్థాయిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించింది. తక్కువ నాణ్యత కలిగిన 50 జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 37వ స్థానంలో ఉంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత రెండేళ్లలో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే జాతీయ స్థాయిలో తెలంగాణ ర్యాంకు గణనీయంగా మెరుగుపడిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు.

రవాణా శాఖలో కొత్తగా విధుల్లోకి 102 మంది ఏఎంవీఐలు

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖలో కొత్తగా 102 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)లు విధుల్లో చేరుతున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐల పాసింగ్ ఔట్ పరేడ్ రాష్ట్ర పోలీస్ అకాడమీలో బుధవారం జరుగుతుంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఏఎంవీఐల గౌరవ వందనం స్వీకరిస్తారు.

నాతో పెట్టుకుంటే నాశనమైపోతావ్

» ఆదివాసీ బిడ్డ ఎదుగుదలను ఓర్వలేకపోతున్నవా?

» కేటీఆర్.. మనిషివైతే, ఆడవాళ్లను గౌరవించేవాడివైతే నేను పెట్టిన తప్పుడు కేసులేమిటో నిరూపించు : మంత్రి సీతక్క

ములుగు, కొత్తగూడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్.. నువ్వు మనిషివైతే, ఆడవాళ్లను గౌరవించేవాడివైతే.. ములుగు జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై నేను తప్పుడు కేసులు పెట్టించినట్లయితే నిరూపించు' అని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, ములుగులో సీతక్క మీడియాతో మాట్లాడారు. 'కేటీఆర్.. ఆదివాసీ ఆడబిడ్డ అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకపోతున్నావా?. నీకు కుల బలం, ధన బలం అహంకారం ఉంటే.. నాకు ప్రజల ఆశీర్వాదం ఉంది. వారి దీవెనలతోనే ఎమ్మెల్యేనయ్యా. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిల సహకారంతో మంత్రిని కూడా అయ్యా. ఇంట్లో ఆడబిడ్డను, బయటి ఆడబిడ్డను ఇబ్బందులకు గురిచేస్తున్నావు. ఇప్పటికే నీ చెల్లి నీపైన దుమ్మెత్తి పోస్తోంది. ఇప్పుడు నాతో పెట్టుకుంటే నాశనమైపోతావ్' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ములుగు నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టిందో కేటీఆర్ నిరూపించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టారో తాను నిరుపిస్తానని సవాల్ విసిరారు. తన జీవితం తెలిచిన పుస్తకమని, తానెవరికీ అన్యాయం చేసిన దాఖలాలు లేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. 70 ఏళ్ల చరిత్రలో ఒక కోయ జాతి మహిళకు మంత్రిగా అవకాశం వచ్చిందని, దీన్ని తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. పథకాలు అందడం లేదంటూ ప్రజలు ఆత్మహత్య చేసుకుని చనిపోయేలా బీఆర్ఎస్ నాయకులే ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. నాడు నాగయ్య, నేడు రమేశ్ ఆత్మహత్యలకు బీఆర్ఎస్ పార్టీయే కారణమని ఆరోపించారు.

శాసనసభలో చర్చకు సై!

అభివృద్ధి, నదీ జలాలపై మాట్లాడటానికి సిద్ధం.. అసెంబ్లీలో చర్చిద్దామంటే ప్రెస్ క్లబ్‌కు వెళ్లి రాద్ధాంతం

» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

» నేను స్పందించేంత స్థాయి కేటీఆర్‌ది కాదు: మహేష్‌గౌడ్

» మీ నాన్నని ప్రతిపక్ష హోదా అడుక్కో: పొన్నం ప్రభాకర్

» చెల్లెలి ఫోన్ ట్యాప్ చేసిన నీచ చరిత్ర నీది: అద్దంకి దయాకర్

» రేవంత్‌ను అంటే కోసి కారం పెడతాం: కవ్వంపల్లి సత్యనారాయణ







హైదరాబాద్/మహబూబాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధించాక రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై గోదావరి, కృష్ణ జలాలపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. ఇదే విషయంపై కేసీఆర్ సభలో చర్చకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిస్తే ఆయన రారు మేము వస్తామని కేటీఆర్ చివరకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌కు పోయి చర్చకు వచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తనతో ముఖ్యమంత్రి చర్చకు రావాలంటూ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ సవాళ్లు విసరడంపై భట్టి స్పందించారు. కృష్ణ, గోదావరి జలాలను ఇష్టం వచ్చినట్లు వాడుకోండని ఏపీ సర్కారుకు కేసీఆర్ చెప్పింది నిజం కదా? అని ప్రశ్నించారు. సంబంధిత వీడియోలను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చూపించారని గుర్తుచేశారు. ప్రాజెక్టుల పేరుతో లక్షన్నర కోట్లు ఖర్చు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టుమని పదెకరాలకు కూడా నీరందించలేదని ఎద్దేవా చేశారు. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. కేటీఆర్‌ది తాను స్పందించేంత స్థాయి కూడా కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఆయన ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే అసెంబ్లీ ఉందని, అసెంబ్లీలో ప్రతిపక్షాలకే ఎక్కువ సమయం ఇస్తున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలపై అసెంబ్లీలోనే చర్చిస్తారని, కేటీఆర్‌కు చేతనైతే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కేసీఆర్‌తో లేఖ రాయించుకుని, ఆయన వద్ద నుంచి ప్రతిపక్ష నేత హోదా తీసుకుని చర్చకు రావాలని కేటీఆర్‌కు సలహా ఇచ్చారు. అసెంబ్లీలో చర్చ అయితేనే అంతా రికార్డుల్లో ఉంటుందన్నారు.

పిచ్చికుక్కలా ఒర్లుతున్న కేటీఆర్

సమస్యలపై చర్చకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలంటూ కేసీఆర్ లేఖ ఇస్తే సమావేశాలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఓడించినా కేటీఆర్, హరీశ్‌లకు సిగ్గు రాలేదని, పిచ్చికుక్కల్లా ఒర్లుతున్నారని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల, సిద్దిపేటల్లో కాంగ్రెస్ హయాంలోనే ఎక్కువగా రైతు రుణమాఫీ జరిగిందన్నారు. ఇది తప్పని నిరూపిస్తే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, కేటీఆర్‌కు నిజంగా సమస్యలపై చర్చించే ధైర్యం ఉంటే డ్రామాలు ఆపేసి, తండ్రిని అసెంబ్లీకి తీసుకురావాలన్నారు. మదమెక్కిన కేటీఆర్ బజారున పడి, పిచ్చి కుక్కలా వ్యవహరిస్తున్నాడని వ్యాఖ్యానించారు. రేవంత్ పేరు చెప్తే బీఆర్ఎస్ నేతలు వణికిపోతున్నారని చెప్పారు. సొంత చెల్లె ఫోన్ ట్యాప్ చేసిన నీచ చరిత్ర కేటీఆర్‌దన్నారు. తెలంగాణను దోచుకున్న తండ్రీకొడుకులు జైలుకు వెళ్లక తప్పదన్నారు.

బీఆర్ఎస్‌లో కేటీఆర్ ఆరోవేలు: యెన్నం

బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్ ఆరో వేలుగా మారిపోయాడని ఎమ్మెల్యే అన్నారు. కేసీఆరే ఆయనను పక్కన పెట్టాడని, సొంత చెల్లెలు కూడా కేటీఆర్‌కు నాయకత్వ లక్షణాలు లేవని చెబుతోందని, పార్టీ సీనియర్లూ మద్దతు ఇవ్వట్లేదని చెప్పారు. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇంకోసారి రేవంత్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కోసి కారం పెడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, కేసీఆర్ ఆస్పత్రిలో చర్చలు చేస్తున్నడు కాని అసెంబ్లీకి మాత్రం రావడం లేదని చెప్పారు. అచ్చేసిన ఆంబోతులా కేటీఆర్ మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలపై ఓయూలో, సెంట్రల్ లైబ్రరీలో తనతో చర్చించేందుకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. రేవంత్‌పై మరోమారు చిల్లర మాటలు మాట్లాడితే కేటీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఉరికించి కొడతారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే ముందు కేసీఆర్ దగ్గర నుంచి ప్రతిపక్ష హోదా దక్కించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. ముఖ్యమంత్రికి సవాల్ విసరాలంటే కనీసం ప్రతిపక్ష నేత హోదా అయినా ఉండాలన్నారు.

కేటీఆర్.. దమ్ముంటే రాధాకృష్ణను టచ్ చెయ్!

దాడులు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయ్.. 'ఆంధ్రజ్యోతి'కి కాంగ్రెస్ అండగా ఉంటుంది

» ఆ పార్టీ నేతల స్పష్టీకరణ

» దాడికి రెచ్చగొడుతోంది కేటీఆరే: సీతక్క

» ఆంధ్రజ్యోతిపై మీరు దాడి చేస్తే.. గంటలోపే టీ న్యూస్‌పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేస్తాయ్: రమేశ్‌రెడ్డి

» రాధాకృష్ణ మా తెలంగాణ బిడ్డ: మైనంపల్లి

» దాడి చేస్తే కేటీఆర్ మూల్యం చెల్లించుకుంటారు

» తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



మంత్రి సీతక్క



మైనంపల్లి హనుమంతరావు



పటేల్ రమేశ్‌రెడ్డి

కేటీఆర్.. తెలంగాణ మీ అయ్య జాగీరా? అని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ నిజామాబాద్ జిల్లా బిర్కూర్‌కు చెందిన వ్యక్తి అని, దమ్ముంటే ఆయన్ను టచ్ చేసి చూడాలని సవాలు చేశారు. 'ఆంధ్రజ్యోతి'కి కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులు ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ములుగు జిల్లాలో ఆంధ్రజ్యోతి విలేకరిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేసినట్లుగా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేశారని మంత్రి సీతక్క ఆరోపించారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసింది, ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి యత్నిస్తున్నదీ బీఆర్ఎస్ నేతలే అన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడికి బీఆర్ఎస్ నాయకులను రెచ్చగొడుతోంది కేటీఆరేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు పూర్తి స్వేచ్ఛ ఉందని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 'ఆంధ్రజ్యోతి'పై దాడి చేస్తే టీ న్యూస్ కార్యాలయంపై గంటలోపు దాడి చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల తీరు తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బ తీసేలా ఉందన్నారు. పత్రికలు నిజాలు చెబితే జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు వాటి మీద దాడులు చేసి, సిగ్గు లేకుండా సమర్థించుకునేలా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. కేటీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డి తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే.. దాడులు ఉంటాయని బెదిరిస్తున్నారని, బిహార్ తరహా రౌడీయిజాన్ని తెలంగాణలో అమలు చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారికి వ్యతిరేకంగా ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేసి, దారికి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పు ఉంటే పత్రికల్లో ఎత్తిచూపుతారని, మంచి ఉంటే దాన్నే ప్రజలకు తెలియజేస్తారని అన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి తాము మద్దతుగా నిలుస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ పతనం కావడంతో కేటీఆర్ మైండ్ పని చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులు చేస్తామని చెప్పారని.. 'కేటీఆర్.. నీకు దమ్ముంటే ఆంధ్రజ్యోతిని టచ్‌చేసే ముందు నన్ను, నా కార్యకర్తలను టచ్ చేయి' అని సవాలు చేశారు. రాధాకృష్ణ తెలంగాణ బిడ్డ అన్నారు. పదేళ్ల పాటు ఆంధ్రా ప్రజల్ని వాడుకొని.. ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రా అని వేరు చేసి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'బిడ్డా.. ప్రాంతాలు, కులాల పేరుతో వేరుగా మాట్లాడితే ఉరికించి కొడతాం. కేటీఆర్.. మీడియా మీద చెయ్యేస్తే నీ అంతు చూస్తా' అని హెచ్చరించారు. గతంలో ఏబీఎన్‌పై నిషేధం విధిస్తే సుప్రీంకోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నారని గుర్తుచేశారు.

ఖబడ్దార్ బీఆర్ఎస్..

నిజాలను నిగ్గు తేల్చే ఆంధ్రజ్యోతిపై దాడి చేస్తామని బెదిరిస్తారా? ఖబడ్దార్ బీఆర్ఎస్.. ఖబడ్దార్ కేటీఆర్.. అంటూ గడ్డిఅన్నారం చౌరస్తాలో మంగళవారం మూసారాంబాగ్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చే ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై అక్కసు వెళ్లగక్కుతారా? అని మండిపడ్డారు. నిరంతరం ప్రజల పక్షాన నిలిచే ఆంధ్రజ్యోతిపై దాడులకు కుట్రలు పన్నితే కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్ష చర్యలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతిపై దాడి చేస్తే మూల్యం తప్పదు

మీడియా అనుకూలంగా ఉంటే పూలదండలు, లేకుంటే దాడులు చేస్తామనడం సరికాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య తెలిపింది. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థలపై బీఆర్ఎస్ దాడులు చేస్తే కేటీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సమాఖ్య సెక్రటరీ జనరల్ సాగర్ల ప్రసాద్ హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ పార్టీకి ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సహకరించిందని గుర్తుచేశారు. ఆంధ్రజ్యోతి ప్రజల పత్రిక, ఏబీఎన్ దమ్మున్న చానల్.. ఈ సంస్థలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మీడియా సంస్థలపై చెయ్యేస్తే టీ న్యూస్ అంతు చూస్తామన్నారు.



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో గౌరవెల్లి ప్రాజెక్టు డివిజన్-3 కార్యాలయం బయట విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

బకాయిల దెబ్బకు బయటే డ్యూటీ!

- రూ.60వేలకు పైగా కార్యాలయ విద్యుత్తు బిల్లు పెండింగ్
- కరెంట్ కట్.. రెండేళ్లకుపైగా ఆఫీసు ఆవలే సిబ్బంది విధులు

హుస్నాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆఫీసుకు వెళితే అక్కడి సిబ్బందికి లోపల కూర్చోబుద్దేయదు. ఒకవేళ బలవంతంగా కూర్చున్నా ఆ చీకట్లో ఫైళ్లు చూడలేని పరిస్థితి. పైగా ఉక్కబోతతో చెమటలు.. దోమల బెడద! ఇలా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మండల పరిషత్తు కార్యాలయం పక్కన ఉన్న శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి ప్రాజెక్టు డివిజన్-3 కార్యాలయ ఉద్యోగులకు పెద్ద కష్టమే వచ్చి పడింది. సిబ్బంది అంతా కార్యాలయం బయట కూర్చునే విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయానికి సంబంధించి 60వేల మేర విద్యుత్తు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో రెండున్నరేళ్ల క్రితమే విద్యుత్తు అధికారులు కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. అప్పటి నుంచి.. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు డీఈలు సహా 15మంది సిబ్బంది కుర్చీలు, టేబుళ్లు బయటే వేసుకొని పనులు చేసుకుంటున్నారు.

నూతన క్రిమినల్ చట్టాలపై ఉన్నతస్థాయి సమీక్ష

పోలీసు ఉన్నతాధికారులతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి భేటీ

హైదరాబాద్, జూలై8 (ఆంధ్రజ్యోతి): నూతన క్రిమినల్ చట్టాల అమలుపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మంగళవారం సమీక్షించారు. ఆయనతో పాటు నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో, బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ అధికారులు, కేంద్ర హోంశాఖకు సంబంధించిన పలువురు సంయుక్త కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, తెలంగాణ డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి పోలీసు కమిషనర్లు సీవీ ఆనంద్,సుధీర్‌బాబు, మహంతి తదితరులు హాజరయ్యారు. దాదాపు పదికి పైగా అంశాలపై ఉన్నతాధికారులు చర్చించారు. డ్రగ్స్ కట్టడి, సైబర్ సెక్యూరిటీ, ఉగ్రవాదం, తీవ్రవాదం, సరిహద్దు రాష్ట్రాల్లోని మావోయిస్టుల సమస్యతో పాటు నూతన క్రిమినల్ చట్టాలు భారత న్యాయ సంహిత అమలుపై ప్రధాన చర్చ జరిగింది. తెలంగాణ పోలీసులు మత్తుమందుల కట్టడికి చేస్తున్న కృషిని కేంద్ర బృందం ప్రశంసించింది.

యూరియా అక్రమ రవాణా.. 150 బస్తాలు సీజ్

ఆదిలాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో యూరియా అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. యూరియా లోడుతో మహారాష్ట్రకు వెళుతున్న రెండు వ్యాన్‌లను ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రైతులు మంగళవారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ వాహనాల్లో దాదాపు రూ.3లక్షల విలువైన 150 బస్తాల యూరియాను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించిన పోలీసులు.. ఆ వాహనాలను, సరుకును సీజ్ చేశారు. వాహన డ్రైవర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఈ అక్రమ రవాణాకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

ధర్నా చేసిన పోలీసు అభ్యర్థులపై కేసు కొట్టివేత

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన పోలీసు ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ధర్నాచేసిన పలువురు అభ్యర్థులకు హైకోర్టులో ఊరట లభించింది. ఆ ధర్నాలో పాల్గొన్న ఎనిమిది మంది నిరుద్యోగులపై పెట్టిన కేసును కొట్టివేస్తూ జస్టిస్ కే లక్ష్మణ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు పిటిషనర్‌లకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది.

అప్పుల వసూలు పోలీసుల బాధ్యత కాదు:హైకోర్టు

అప్పులు వసూలు చేసి పెట్టే బాధ్యత పోలీసులది కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఇచ్చిన రుణాలను వసూలు చేసుకోవడానికి సంబంధిత సివిల్ కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందని పేర్కొంది. రుణాలు వసూలు చేసిపెట్టాలంటూ పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగినా లాభం లేదని తెలిపింది. అప్పుతీసుకున్నవాడు మోసం చేశాడని, అతనిపై కేసు పెట్టాలని ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని పేర్కొంటూ ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ టీ వినోద్ కుమార్ ధర్మాసనం.. అప్పులు వసూలు చేసే అధికారం పోలీసులకు లేదని పేర్కొంది. దీంతో పిటిషనర్ కేసును ఉపసంహరించుకున్నారు.

ప్రముఖ అస్సామీ కవి నీలిమ్‌కుమార్‌కు సినారె జాతీయ పురస్కారం



గోషామహల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సినారె స్మృత్యర్థం ప్రతిఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక విశ్వంభర జాతీయ పురస్కారానికి 2025 సంవత్సరానికి ప్రముఖ అస్సామీ కవి నీలిమ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ అవార్డును ప్రతియేటా శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ప్రదానం చేస్తుంది. ఈ నెల 29న రవీంద్ర భారతిలో జరిగే సినారె 94వ జయంతి వేడుకల్లో నీలిమ్‌కుమార్‌కు ఈ అవార్డు ప్రదానం చేస్తామని ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగ, ప్రధాన కార్యదర్శి డా.జుర్రు చెన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్‌లోని జడ్పీ పాఠశాల

అడవి శ్రీరాంపూర్ హైస్కూలులో మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ

- సందర్శించిన పెద్దపల్లి జిల్లా అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెద్దపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు అధికార యంత్రం చర్యలు చేపట్టింది. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'పల్లె బడిలో ఏఐ పాఠాలు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం టీ-ఫైబర్ సేవలను పట్టణ ప్రాంతాలతోపాటు పల్లెల్లో విస్తరించేందుకు ప్రయోగాత్మకంగా మూడు గ్రామాలను ఎంపిక చేసింది. అందులో అడవి శ్రీరాంపూర్ ఒకటి. ఆ గ్రామాల్లో టీ-ఫైబర్ ఇంటర్నెట్ సేవలను ఆరు మాసాలుగా అందిస్తున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలకు సైతం టీ-ఫైబర్ కనెక్షన్ ఇవ్వడంతో అక్కడి ఉపాధ్యాయులు 8, 9, 10వ తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసి ఇంటర్నెట్ ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు స్వయంగా గూగుల్ సెర్చ్‌తో పాటు పర్ ప్లెక్సిటీ ఏఐ యాప్ సెర్చ్ చేస్తున్నారు. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రావడంతో పాఠశాలలో మౌలిక వసతులపై కలెక్టర్ దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం, ఉపాధ్యాయులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. తగిన అంచనాలతో కలెక్టర్‌కు నివేదికను అందజేయనున్నారు.

పురుషులకు దీటుగా..

- నెలన్నర వ్యవధిలో ఏసీబీ వలకు చిక్కిన ఏడుగురు మహిళా అధికారులు
- ఏసీబీ చరిత్రలోనే ఇది అత్యధికం!

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పురుషులకు దీటుగా మహిళా అధికారులు కూడా లంచాలు తీసుకుంటున్నారు! ఏసీబీ చరిత్రలోనే తొలిసారిగా.. నెలన్నర వ్యవధిలో ఏడుగురు మహిళా అధికారులు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. వీరంతా రూ.ఐదు వేల నుంచి రూ.1.2 లక్షల దాకా రకరకాల మొత్తాల్లో లంచాలు తీసుకుంటూ దొరికిపోయారు. వీరిలో పాతికేళ్ల వయసు వారి నుంచి.. పదవీ విరమణ దశలో ఉన్న వారూ ఉండటం గమనార్హం. పట్టుబడిన మహిళా అధికారుల్లో ముగ్గురు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగులే. జీహెచ్ఎంసీలోని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి ఏ స్థాయిలో జరుగుతోందో అనడానికి ఈ అరెస్టులు మచ్చుతునకలు. తాజాగా మంగళవారం మాదాపూర్ డివిజన్‌కు చెందిన డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ ఎం.సుధ.. ఒక కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం రూ.8 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. నాంపల్లిలోని గగన్‌విహార్ కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో.. హైదరాబాద్ సిటీ రేంజ్ 1 డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం రిమాండుకు తరలించారు.

అంతకు ముందు..

ఖమ్మం జిల్లాకు చెందిన సబ్ రిజిస్ట్రార్ జె అరుణ డాక్యుమెంట్ రైటర్‌తో కలిసి ఒక గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రూ.30 వేలు తీసుకోవడంతో వారిద్దరినీ మే 26న ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

- మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తున్న పి.మంజుల, తన వద్ద పనిచేస్తున్న చైన్‌మన్ మల్లేష్‌తో కలిసి ఒక వ్యవసాయ భూమిని సర్వే చేసి రిపోర్టు ఇవ్వడం కోసం రూ. 26,500 డిమాండ్ చేశారు. అందులో రూ.16,500 రూపాయలను ఫోన్ పే ద్వారా నాలుగు విడతల్లో మల్లేష్ తీసుకున్నాడు, ఆ తర్వాత పదివేల రూపాయలు నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వీరిని జూన్ 4న అరెస్ట్ చేశారు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. మల్లేష్ అసలు చైన్‌మెన్ కాదు, అతని తండ్రి స్థానంలో పనిచేయడానికి వచ్చాడు. మస్టర్‌లో అతని తండ్రి పేరుంటే అనధికారికంగా మల్లేష్ ఉద్యోగంలో కొనసాగాడు.
- సంగారెడ్డి జిల్లా బుధేరా గ్రామ పంచాయితీ కార్యదర్శి పి.నాగలక్ష్మి ఇంటి నెంబర్ ఇవ్వడం కోసం రూ.8వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా.. గత నెల 16న ఏసీబీ అధికారులు ఆమెను అరెస్టు చేశారు.
- జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ)గా పనిచేస్తున్న బి.స్వరూప ఒక కాంట్రాక్టర్ చేసిన పనిని ఎంబీ పుస్తకంలో నమోదు చేయడం కోసం రూ.1,20,000 లంచం అడిగి తీసుకుంటుండగా గత నెల 17న ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.
- జీహెచ్ఎంసీలోని నెహ్రూనగర్ సర్కిల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న టి.మనీషా ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఒక ఫైల్‌ను పై అధికారికి ఫార్వార్డ్ చేయడం కోసం కాంట్రాక్టర్ నుంచి రూ.5000 తీసుకుంటుండగా గత నెల 23న ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.
- జీహెచ్ఎంసీలోని మూసాపేట డివిజన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎం.సునీత ఇంటి మ్యూటేషన్‌కు సంబంధించి రూ.30,000 లంచం తీసుకుంటుండగా ఈ నెల 1వ తేదిన ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

భద్రాద్రి ఆలయ ఈవోపై భూ ఆక్రమణదారుల దాడి

- రామాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఈవో, సిబ్బందిపై దౌర్జన్యం
- ఏపీలోని పురుషోత్తపట్నంలో ఘటన
- దాడిని ఖండించిన మంత్రి తుమ్మల



ఈవో, ఆలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన భూ ఆక్రమణదారులు

భద్రాచలం/హైదరాబాద్/ఎటపాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్రస్వామి ఆలయ భూముల ఆక్రమణ అంశం మరోసారి రణరంగాన్ని తలపించింది. ఏపీలోని ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి రామయ్య భూముల్లో అక్రమార్కులు చేస్తున్న నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, కాంట్రాక్టు ఉద్యోగి వినీల్‌తో పాటు మరికొందరు సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేశారు. పురుషోత్తపట్నంలోని రాములోరి భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలుసుకున్న ఆలయ అధికారులు సోమవారం వెళ్లి, అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆక్రమణదారులు దాడికి యత్నించడంతో వెనుదిరిగారు. రెండో రోజు మంగళవారం ఈవో రమాదేవి సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లారు. 'నిర్మాణాలు ఆపేందుకు మీరెవరు?' అంటూ దేవస్థానం అధికారులు, సిబ్బందిని ఆక్రమణదారులు, స్థానికులు ప్రశ్నించారు. ఈ భూములు భద్రాద్రి ఆలయానివని, తమ వద్ద అన్ని పత్రాలూ ఉన్నాయని ఈవో స్పష్టం చేశారు. ఈ సమయంలో అధికారుల చేతుల్లో ఉన్న పత్రాలను ఆక్రమణదారులు లాక్కున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. 'మళ్లీ మా స్థలంలోకి ఎందుకొచ్చారు? వెళ్లిపోండి' అంటూ ఆక్రమణదారులు ఆలయ అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా తోపులాటకు దారితీసింది. అదే సమయంలో కొందరు ఈవో రమాదేవిపై దాడి చేశారు. ఆమె స్పృహ కోల్పోవడంతో భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనలో కాంట్రాక్టు ఉద్యోగి వినీల్ కూడా అస్వస్థతకు గురికావడంతో అతన్ని కూడా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ తోపులాటలో అక్రమంగా ఇంటిని నిర్మిస్తున్న పున్నమ్మ కూడా స్పృహ కోల్పోయింది. కాగా, అక్రమ నిర్మాణాలు అడ్డుకునేందుకు వెళ్లే సమయంలో ఎటపాక రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా సరిగా స్పందించలేదని ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. ఒక్క హెడ్ కానిస్టేబుల్‌ను పంపారని వాపోయారు. భద్రాచలం పోలీసులు కూడా ఎటపాక పోలీసులకు సమాచారం ఇచ్చారని, వారు స్పందించకపోవడంతోనే దాడి జరిగిందని అధికారులు ఆరోపిస్తున్నారు.

ఈవోపై దాడి హేయమైన చర్య

ఈవో రమాదేవిపై దాడి చేయడం హేయమైన చర్య అని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, మరో సంఘం నేత కె.చంద్రమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈవో రమాదేవిపై జరిగిన దాడిని ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఖండించారు.

కబ్జా చేస్తే పీడీ యాక్టు

భద్రాద్రి రామాలయ ఈవో రమాదేవి, సిబ్బందిపై దాడిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదన్నారు. ఆలయ భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు నమోదు చేసి, జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈవోను ఫోన్‌లో పరామర్శించారు. భద్రాద్రి రామయ్య భూముల సమస్యను పరిష్కరించాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. ఈవోపై దాడిని మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఖండించారు. దాడిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆస్పత్రికి వెళ్లి ఈవో రమాదేవిని పరామర్శించారు. దాడిని అర్చక, ఉద్యోగ జేఏసీ ఖండించింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ కోరారు. కాగా, ఆలయ అధికారులు, సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేసిన ఘటనపై రెండు రాష్ట్రాల్లోని పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. దాడి ఎలా జరిగిందనేదానిపై సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఈవో రమాదేవి నుంచి కూడా వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. కాగా, ఈవోపై దాడికి సంబంధించి ఏఈవో రామకృష్ణారావు ఎటపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎటపాక సీఐ తెలిపారు.

మహిళా ప్రొఫెసర్‌పై సీబీఐ కేసు

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. "రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఎన్ఎంసీ బృందానికి లంచం ముట్టి ఉంటుంది" అని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. సదరు మహిళా ప్రొఫెసర్‌తోపాటు.. ఏపీ, తెలంగాణకు చెందిన పలు వైద్య కళాశాలలు, మధ్యవర్తులు.. ఇలా మొత్తం 36 మందిని నిందితుల జాబితాలో చేర్చింది. ప్రభుత్వ ప్రొఫెసర్‌పై కేసు నమోదవ్వడం ఇప్పుడు వైద్యఆరోగ్య శాఖలో చర్చనీయాంశమైంది.

ప్రభుత్వం సీరియస్!

ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. సదరు మహిళా ప్రొఫెసర్ దక్షిణ తెలంగాణలో పనిచేసేవారు. గత ఏడాది హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. తన పలుకుబడితో రాష్ట్ర రాజధానిలోని ఓ ప్రభుత్వాస్పత్రికి సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ తెచ్చుకున్నారు. అక్కడ అవకతవకలు జరగడంతో.. ఆమెను తప్పించారు. ఇప్పుడు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో ఆమె పేరుండడంతో.. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోనుంది? అనే ఉత్కంఠ వైద్య ఆరోగ్య శాఖలో నెలకొంది. ఎఫ్ఐఆర్‌లో పేరుంటే.. శాఖాపరమైన దర్యాప్తునకు ఆదేశించవచ్చని, చార్జిమెమో జారీ చేయవచ్చని నిబంధనలు చెబుతున్నాయి. సీబీఐ ఆమెను విచారించి, అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ ఆమె అరెస్టు అయ్యి, 48 గంటల పాటు జైలులో ఉంటే.. సస్పెన్షన్ వేటు వేయవచ్చని అధికారులు వివరిస్తున్నారు. ఈ కేసులో సీబీఐ ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసింది. దీంతో.. సదరు మహిళా ప్రొఫెసర్ వాంగ్మూలాన్ని సేకరించి, ఆమెను కూడా అరెస్టు చేస్తారని తెలుస్తోంది.

సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్‌కు..

బాంబు బెదిరింపు

- బాంబ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

చార్మినార్/అడ్డగుట్ట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): "సిటీ సివిల్ కోర్టులో బాంబులు పెట్టాం.. అక్కడ బాంబు పేలిన 23 నిమిషాలకు జింఖానా క్లబ్‌లో మరో బాంబు పేలుతుంది" అంటూ వచ్చిన హైదరాబాద్‌లో కలకలం నెలకొంది. పోలీసులు అప్రమత్తమై బాంబ్, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టగా.. కోర్టుల్లో సేవలు నిలిచిపోయాయి. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు సిటీ సివిల్ కోర్టు ప్రధాన జడ్జి క్యాంప్ క్లర్క్(సీసీ)కి అబ్దుల్లా అనే వ్యక్తి పేరుతో ఓ ఈ-మెయిల్ వచ్చింది. "సిటీ సివిల్ కోర్టు, జడ్జిల చాంబర్లు, జింఖానా క్లబ్‌లలో నాలుగు ఆర్డీఎక్స్ పేలుళ్లు జరుగుతాయి. కోర్టు సిబ్బంది ఎవరూ ఆవరణాలో ఉండకూడదు" అనేది అందులోని సారాంశం. ఉదయం 11 గంటల సమయంలో సిటీ సెంట్రల్ కోర్టు లైజనింగ్ అధికారి సాయి కుమార్.. ఆ మెయిల్‌ను గుర్తించి, జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు.. సిటీ సివిల్ కోర్టుకు చేరుకున్నారు. జడ్జి ఆదేశాలతో మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని, తనిఖీలు చేపట్టారు. ఈ కోర్టుతోపాటు.. నాంపల్లిలోని కోర్టుల సముదాయం, సికింద్రాబాద్ కోర్టుల వద్ద కూడా తనిఖీలు చేపట్టారు. దీంతో.. ఆయా కోర్టుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. మధ్యాహ్నానికి ఎలాంటి బాంబు లేదని పోలీసులు నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉప్పల్ స్టేడియానికి దారేదీ?

(మొదటి పేజీ తరువాయి)



ఉప్పల్ స్టేడియం గేటును మూసివేస్తూ గోడ నిర్మాణం కోసం వేసిన స్తంభాలు

వెళ్ళిపోయింది. స్టేడియంలోకి వెళ్ళేందుకు ఉపయోగిస్తున్న కొన్ని దారులతో పాటు, పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్న స్థలాన్ని కూడా ఆ సంస్థ ఒక బ్యాంకు నిర్వహించిన వేలంలో కొనేసింది. తాజాగా ఆ దారులను మూస్తూ చకచకా ప్రీకాస్ట్ వాల్‌తో ప్రహరీగోడను నిర్మిస్తోంది. స్టేడియం చుట్టూ 11 గేట్లు ఉంటే సుమారు 5 గేట్లు మూస్తూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఇప్పటిదాకా క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో ప్రేక్షకుల కార్లు, బైకులు పార్కు చేస్తున్న స్థలాన్ని కూడా సదరు కంపెనీ స్వాధీనం చేసుకోవడంతో ఇప్పటి దాకా దేశంలో అత్యంత సౌకర్యవంతమైన స్టేడియాల్లో ఒకటైన ఉప్పల్ క్రికెట్ స్టేడియం ఇక ఇరుకు స్టేడియంగా మారనుంది.

అసలు స్థల వివాదం ఏంటి?

ఉప్పల్ పారిశ్రామిక వాడ కోసం 500 ఎకరాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఐఐసీకి కేటాయించింది. స్థలాన్ని అభివృద్ధి చేసి, కంపెనీలకు ఇచ్చినపుడు పెంగ్విన్ టెక్స్‌టైల్స్ 46 ఎకరాలు దక్కించుకుంది. చాలా సంవత్సరాలు నడిచిన కంపెనీ తర్వాత కాలంలో మూత పడింది. చేసిన అప్పును తీర్చలేక యాజమాన్యం భూమితో సహా ఫ్యాక్టరీని బ్యాంకుకు వదిలి వెళ్లింది. స్థలాన్ని బ్యాంక్ వేలం వేసింది. అప్పటికే అందులో 16 ఎకరాలను ఏపీఐఐసీ ఉప్పల్ క్రికెట్ స్టేడియానికి కేటాయించడంతో బ్యాంకు మిగిలిన 30 ఎకరాలు వేలం వేసింది. 2019లో జరిగిన వేలంలోనే బిల్డ్ బ్రిక్స్ అనే సంస్థ ఆ 30 ఎకరాలు కొనుగోలు చేసింది. అయితే, హెచ్‌సీఏ 23.5 ఎకరాల స్థలంలో స్టేడియాన్ని నిర్మించినట్లు చెబుతున్నారు. హెచ్‌సీఏ అదనంగా ఆక్రమించుకున్న స్థలంలో కొంత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని టీఎస్ఐఐసీ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన 22.5 ఎకరాల స్థలాన్ని సొంతం చేసుకున్న సంస్థ దానిని రక్షించుకొనే క్రమంలో స్టేడియం గేట్లను, దారిని మూసేస్తూ ప్రహరీగోడ నిర్మిస్తుండడం వివాదాస్పదం కానుంది. ఈ చర్యతో క్రికెట్ స్టేడియం భవిష్యత్తే ప్రమాదంలో పడే ప్రమాదం ఉందని క్రీడాభిమానులు వాపోతున్నారు. హెచ్‌సీఏ అధికారులు ఇప్పటి వరకు బహిరంగంగా ఎక్కడా స్పందించలేదు. టీఎస్ఎస్ఐసీ ఉప్పల్ కమిషనర్ ప్రభాకర్‌ను వివరణ కోరగా స్టేడియం పక్కనే పెంగ్విన్ టెక్స్‌టైల్స్ కంపెనీ స్థలాన్ని బిల్డ్ బ్రిక్ అనే సంస్థ కొనుగోలు చేసిందని చెప్పారు. ఆ సంస్థ ప్రహరీ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం. పూర్తి స్థాయిలో గోడ నిర్మించి, పార్కింగ్ ఎత్తేస్తే ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం కష్టతరంగా మారనున్నది. ఇప్పటికే క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు ప్రేక్షకుల వాహనాలతో ఉప్పల్ రోడ్లన్నీ అక్రమ పార్కింగ్‌తో నిండిపోతుండగా ఇక భవిష్యత్తులో మరింత కష్టంగా మారనున్నది. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం స్టేడియం దారులు, పార్కింగ్ స్థలాన్ని రక్షించే విషయంలో చొరవ తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

కిడ్నీలు జరభద్రం

దేశంలో పెరుగుతున్న దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి బాధితుల సంఖ్య

- హైబీపీ, మధుమేహ రోగులు, పొగాకు వాడేవారిలో అధికం
- 46 ఏళ్లు దాటితే ముప్పు ఎక్కువ
- భారత్, ఉజ్బెకిస్థాన్, ఫిలిప్పీన్స్ దేశాల్లోని 25 నగరాల్లో5వేల మందికి 'నెఫ్రోప్లస్' నిర్వహించిన స్క్రీనింగ్‌లో వెల్లడి
- తెలంగాణలో పరీక్ష చేయించుకున్న వారిలో 9% బాధితులు



అధ్యయనం వివరాలు వెల్లడిస్తున్న నెఫ్రోప్లస్ నిర్వాహకులు

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధుల(సీకేడీ)తో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది! మధుమేహం, అధిక రక్తపోటు బాధితులు, పొగాకు వాడేవారిలో ఈ సమస్య ఎక్కువగా కనపడుతోందని.. అలాగే, 46 ఏళ్లు దాటినవారిలో కూడా మూత్రపిండ వ్యాధుల ముప్పు పెరుగుతోందని.. ప్రముఖ డయాలసిస్ కేర్ నెట్‌వర్క్.. 'నెఫ్రోప్లస్' నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రారంభ దశల్లో లక్షణాలు పెద్దగా కనపడకపోవడంతో.. చాలా మంది తమకున్న సమస్య గురించి తెలుసుకోలేకపోతున్నారని, చివరి దశలో బయటపడడంతో ఆరోగ్య, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారని నెఫ్రో ప్లస్ సహ వ్యవస్థాపకుడు కమల్ డి షా, సీఈవో రోహిత్‌సింగ్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రిషబ్ ష్రాఫ్ ఆవేదన వెలిబుచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ అధ్యయన వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. కిడ్నీ వ్యాధులకు సంబంధించి.. భారతదేశం, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్‌లోని 25 నగరాల్లో ఈ ఏడాది మార్చి 6 నుంచి 11 దాకా విస్తృత స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆ ఐదురోజుల్లో.. 10వేల మందికిపైగా వ్యక్తులకు కిడ్నీవ్యాధులపై అవగాహన కలిగించామని, 5000 మందికి పైగా వ్యక్తులకు కిడ్నీ పనితీరు ఎలా ఉందో తెలిపే సీరం క్రియాటినైన్ పరీక్షలు చేయించినట్లు వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

ఆంధ్రప్రదేశ్‌లో ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిలో 16 శాతం, తెలంగాణలో 9 శాతం మంది దీర్ఘకాలిక కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. తెలంగాణలో దాదాపు 200 మందికి పరీక్షలు చేయగా.. హైదరాబాద్‌లో 9 శాతం, మహబూబ్‌నగర్‌లో 9 శాతం మంది బాధితులున్నట్లు తమ సర్వేలో గుర్తించినట్లు నెఫ్రోప్లస్ యాజమాన్యం తెలిపింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 200 నుంచి 300 మందికి పరీక్షలు నిర్వహించగా.. విశాఖపట్నంలో ఏకంగా 23 శాతం, రాజమండ్రి 10 శాతం మంది సీకేడీ బాధితులున్నట్లు తేలింది.

ఇతర రాష్ట్రాల్లో..

దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్యను రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే.. స్క్రీనింగ్‌లో పాల్గొన్న వారిలో అత్యధికంగా 25 శాతంతో ఝార్ఖండ్ అగ్రస్థానంలో ఉంది. హరియాణా (17%), ఉత్తరాఖండ్ (17%), ఆంధ్రప్రదేశ్ (16%) బిహార్ (15%), ఢిల్లీ (15%), కర్ణాటక (15%), మహారాష్ట్ర (15%), ఉత్తరప్రదేశ్ (14%), గుజరాత్ (9%), రాజస్థాన్ (9%), తెలంగాణ (9%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అలాగే అజంగఢ్ (28%), రాంచీ (25%) వంటి నగరాల్లో కిడ్నీవ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. పంచకుల (23%), విశాఖపట్నం (23%), జముహర్ (22%), హల్ద్వానీ (19%), లఖ్‌నవూ (19%), బెంగళూరు (16%), ఢిల్లీ (15%), మంగళూరు (14%), నాగ్‌పూర్ (14%), హిసార్ (11%), డెహ్రాడూన్ (10%), గోరఖ్‌పూర్ (10%), రాజమండ్రి (10%), జైపూర్ (9%), పట్నా (9%), మోతిహరి (9%), వడోదర (6%) తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

మరికొన్ని లెక్కలు..

ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిలో 27 శాతం మంది క్రమం తప్పకుండా నొప్పి నివారణ మందుల వినియోగిస్తున్నారని, 23% మందికి అధిక రక్తపోటు ఉందని, 22 శాతం మందికి మధుమేహం ఉందని, 21 శాతం మంది పొగాకు వినియోగదారులని నెఫ్రోప్లస్ నివేదిక వెల్లడించింది. పరీక్షించిన వారిలో 60 శాతం మంది పురుషులు అయినప్పటికీ, మహిళల్లో ఈ సమస్య తీవ్రత ఎక్కువగానే ఉన్నట్టు తెలిపింది. మొదట్లో లక్షణాలు అంతగా కనిపించవని.. కాబట్టి తరచుగా పరీక్షలు చేయించుకుంటే, సమస్యను ముందే గుర్తించవచ్చని నెఫ్రోప్లస్ సహవ్యవస్థాపకుడు కమల్ షా సూచించారు. అలా గుర్తించడానికి ప్రభుత్వాలు రూ.60 కోట్లు వెచ్చిస్తే.. మూడేళ్లకాలంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై డయాలసిస్ ఖర్చుల భారాన్ని రూ.1100 కోట్ల మేర తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.